


ఆంధ్ర సచిత్ర వార పత్రిక
1-6
180

క్రొత్త

పాలతో కూడిన
ఫారెక్స్
ఘన ఆహారం



అధిక
రుచికరం
అధిక
సంపూర్ణం



ప్రేమతో మీరు పెట్టే ప్రతి చెంచాడు పాపాయి పెరుగుదలకు మంచిది.

పాలతో కూడిన ఫారెక్స్ ఘన ఆహారం.

కలపడం సులభం. పాపాయికి తినిపించడం సులభం.

పాలతో కూడిన ఫారెక్స్ ఘన ఆహారం.

పాపాయి పెరుగుదలకు అత్యావశ్యకమైన ప్రోటీన్‌తో సమృద్ధం. ఆరోగ్యవంతమైన రక్తంకోసం అదనంగా ఐరన్ కలిగినది. గట్టి పళ్లు, ఎముకలకోసం సరియైన నిష్పత్తిలో కాల్షియం మరియు ఫాస్ఫరస్ కలిగినది. పాపాయి సున్నిత జీర్ణశక్తికి అనువుగా ముందుగానే పచనం చేయబడినది.

పాలతో కూడిన ఫారెక్స్ ఘన ఆహారం.

ప్రతి చెంచాలో అధిక సంపూర్ణ ఘన ఆహారం.

CLARION/B/GX/3/234 Te


ప్రేమ్ సబ్బుతో స్నానం
రోజంతా ఉల్లాసం
మీ శరీరమునకు మృదుత్వమునిచ్చి సహజ
సౌందర్యమును పెంపొందించు సబ్బు ప్రేమ్.
దీని స్వచ్ఛమైన నురగ, పరిమళము
మీ మనసును పులకింపజేయును.
Prem
REFRESHING SOAP
PREM
Prem
గులాబి మరియు ఆకుపచ్చ
రంగులలో లభించును
జయలక్ష్మి
గుంటూరు వారి తయారీ
Imageads M-1783

ఉత్తరాలు

నిజాయితీ నీ విలువ ఎంత ?

''నిజాయితీ నీ విలువెంత ?'' కథ ఎంతో బాగుంది. సీతాపతిలాంటి వ్యక్తులు చాల అరుదు. ఈ కథ మాకు చాల బాధ కలిగించింది. న్యాయానికి, నిజాయితీకి విలువ తగ్గిపోతోంది. ఈ కథ చదివిన కొంతమందయినా తొందరపడకుండా నిదానంగా కార్యాలు చేస్తారని ఆశిద్దాము. సీరియల్స్ 'కర్మయోగి', 'గోరంతదీపం', 'మారేడుదళం' చాల బాగున్నాయి.

వాడపల్లి శేషాచార్యులు, పెదపట్నంలంక.

కీ. శే. సావర్కార్

ఆంధ్ర సచిత్ర వారపత్రిక మార్చి, 11 1966 సంచికలో సావర్కార్ అస్తమయాన్ని పురస్కరించుకొని అప్పటి మీ విలేకరి వెలిబుచ్చిన భావాలను గమనించాను. కానీ, వ్యాసంలోనిచివరి వాక్యంలో సావర్కార్ వంటి వారు ఆధునిక సాంకేతిక సమాజాల్లో నిర్మాణాత్మక పాత్ర వహించలేరని, ఎందుకంటే వారు మనదేశం శతాబ్దాలుగా మహమ్మదీయ పరిపాలన క్రింద ఉండినదనే సంగతిని ఆవేశం లేకుండా పరిశీలించలేకపోయారని, పేర్కొనబడింది. అవి సావర్కార్ భావాలను కుణ్ణంగా పరిశీలించి వ్రాసిన వాక్యాలు కావనిపిస్తుంది. ముస్లిమ్ వ్యతిరేకతను వారి కంటగట్టడం సమంజసం కాదు. అలాగయితే అత్యధిక సంఖ్యాక ప్రజల మద్దతుతో స్వాతంత్ర్యోద్యమాన్ని కొనసాగించిన కాంగ్రెస్ సంస్థను ఆంగ్లేయ వ్యతిరేకమైనదిగా పరిగణింప వలసి ఉంటుంది. జాతీయత విషయంలో స్పష్టమైన అవగాహన లేకుండా బ్రిటీష్‌వారిని వెడలనంపడమే గమ్యంగా పెట్టుకోవడం వలననే 'విభజన' వంటి ఉపద్రవాలను దేశం ఎదుర్కొనవలసి వచ్చింది. నేటికీ దాని దుష్ఫలితాలను మనం అనుభవిస్తున్నాము. జాతీయత విషయమై సావర్కార్ భావాలేమిటి ? 'హిందు' పదానికి ఆయనిచ్చిన నిర్వచన మేమిటి?—వీటి విషయమై అధ్యయనం చేయవలసి వుంది. 'దేశాన్ని పితృభూమిగా, పవిత్రభూమిగా భావించేవారంతా హిందువులే'నని వారి నిర్వచనం. కాంగ్రెస్, తదితర పక్షాల నాయకుల అభిప్రాయాలను సావర్కార్ అభిప్రాయాలతో పోల్చి చూడవలసిన అవసరం నేడెంతైనా ఉంది. ఎలాంటి నిర్మాణాత్మక కార్యసాఫల్యతకైనా, దేశపునర్నిర్మాణానికైనా దేశభక్తి, దేశ సంస్కృతీ సాంప్రదాయాలపై గౌరవం అవసరం— అనే విషయాన్ని మనం విస్మరించరాదు. 'భావసమైక్యత' లేకుండా కేవలం సాంకేతిక, ఆర్థిక కార్యక్రమాల ద్వారా జాతి నిర్మాణాన్ని సాధించ గలమనుకోవడం నేల విడిచి సాము చేయటమే అవుతుంది.

మార్ఠూరి ప్రభాకరరావు, విజయవాడ.

కీ. శే. రెంటాల సుబ్బారావుగారు

ఆంధ్రపత్రిక 1918 మార్చి 27 సంచిక నుంచి ప్రచురించిన కీ. శే. రెంటాల వెంకట సుబ్బారావుగారిని గురించిన వ్యాసం గ్రాంధిక భాషలోనున్నను పంతులుగారిని గురించి తెలియని చాలా విషయాలను తెలిసికొన్నాము. సంపాదకులకు కృతజ్ఞతలు.

స్వరాజ్యలక్ష్మి, ఆనందగజపతిరావు,
తెట్టంగి.

నాచార ప్రాంతంలో ఉంటావు కదా, నేస్తం!

అయ్యో! త్రాగేందుకు మంచినీళ్ళ చుక్క
కూడా లేదా నేస్తం ?
మరి, నాచార ప్రాంతంలో ఉంటావు కదా,
ఏం చేస్తం !
అయ్యో ! శుభ్రమైన గాలికికూడా కరువా
నేస్తం ?
మరి, నాచార ప్రాంతంలో ఉంటావు కదా
ఏం చేస్తం !
అయ్యో ! మంచి గంధం వాసనే మరిచావా
నేస్తం ?
మరి, నాచార ప్రాంతంలో ఉంటావు కదా
ఏం చేస్తం !
అయ్యో ! మృష్టాన్న భోజనం రుచికూడా
తెలుసుకోలేవా నేస్తం !
మరి, నాచార ప్రాంతంలో ఉంటావు కదా
ఏం చేస్తం !
అయ్యో! గుండెలనిండా గాలికూడా పీల్చలేవా
నేస్తం ?
మరి, నాచార ప్రాంతంలో ఉంటావు కదా
ఏం చేస్తం !
అయ్యో ! కమ్మటి కలల కోసమైనా కునుకు
తీయలేవా నేస్తం ?
మరి, నాచార ప్రాంతంలో వుంటావు కదా
ఏం చేస్తం !
అయ్యో ! ప్రశాంత జీవనమే లేదా నేస్తం ?
మరి, నాచార ప్రాంతంలో వుంటావు కదా
ఏం చేస్తం !
అయ్యో ! నీ జీవితమంతా మందులపాలేనా
నేస్తం ?
మరి, నాచార ప్రాంతంలో ఉంటావు కదా
ఏం చేస్తం ?
అయ్యో ! చివరకు నీ జీవితమంతా
రోగాలపాలేనా నేస్తం ?
మరి, నాచార ప్రాంతంలో ఉంటావు కదా
ఏం చేస్తం !

నోరి సుబ్రహ్మణ్యశాస్త్రి, నాచారం.

గెలుపు ఎవరిది ?

6–4–84 ఆంధ్ర సచిత్ర వారపత్రికలో ప్రచురించిన స్నేహానంద్‌గారి ''గెలుపు ఎవరిది ?'' కథలో రాజశేఖర్ దంపతులు. సాందీపని తెనాలి ''కృష్ణా ఎక్స్‌ప్రెస్''లో వెళ్ళినట్లు వ్రాసారు. కృష్ణా ఎక్స్‌ప్రెస్ గుంటూరు నుండి సికింద్రాబాదు వెళుతుందని ఇప్పటికైనా తెలుసుకుంటారని అనుకుంటున్నాను.


జె. లలితారుక్మిణి.
యలమంచిలి.

ఆంధ్రసచిత్రవారపత్రిక

వ్యవస్థాపకులు :
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు
స్థాపితం : 1908
శివలెంక శంభుప్రసాద్
సంపాదకుడు :
[1938–1972]
శుక్రవారం : 1–6–'84
శ్రీ రక్తాక్షినామ సం. జ్యేష్ఠ శు. విదియ
సంపుటము 76 : సంచిక 38
సంపాదకుడు :
శివలెంక రాధాకృష్ణ
విడి ప్రతి వెల రు. 1-80
ఆరు మాసాల చందా రు. 46-80
పోస్ట్‌లో ఏడాదిచందా రు. 101-40
ఆంధ్రపత్రిక కార్యాలయము,
గాంధీనగరం. విజయవాడ-520 003.

విషయానుక్రమణిక

లోకం పోకడ–ఊమెన్



రాజకీయాలు ఎందుకు ఇలాగ అవుతున్నాయి?

న్యూఢిల్లీ లేఖ



డా. జయదుబాషి


మళ్ళీ రామ్‌రావు ఆదిక్‌ని గురించి రాయనంటే రాయను, ఆయన మళ్ళీ హానోవర్‌కి వెళ్ళినా సరే – ఇక్కడికే గదా ఈయన వెళ్ళపోయి భా. జ. పా. వాళ్ళ పన్నాగాలకి గురి అయ్యాడుట? ఈ అంతూలే, ఆదిక్‌లు నిజానికి అనామకులు కాని కొన్ని సంవత్సరాలుగా పత్రికలలో వీళ్ళని గురించి వేసి కాగితం దండగ చేస్తున్నారు. ఇక ఈ ఇద్దరినీ వాళ్ళ పాకంలో వాళ్ళనే వేగనివ్వటం మంచిది. వాళ్ళ పాకం ఏమిటో నాకు తెలీదు, వాళ్ళకి ఇంకేదయినా ఇష్టమయితే అందులో వేగనివ్వండి. మనం ఇప్పుడు మాటలాడుకోవాలిసింది భారతదేశంలో రాజకీయాలస్థాయి పతనాన్ని గురించి. శ్రీమతి గాంధీ కాంగ్రెసు మనం అనుకున్నదానికన్నా ముందుగానే పడిపోతుంది. పడిపోయేముందు ఆ సంస్థ దేశానికి ప్రసాదించే వరం రాజకీయాల స్థాయి పతనమే. ఎప్పుడు పడిపోతుంది ఈ కాంగ్రెసు? ఈ సంవత్సరమే కావచ్చు పయి సంవత్సరమే కావచ్చు.

అంతూలే మీద మోసం చేశాడన్న ఆరోపణలు ఉన్నాయి. 420 సెక్షన్ ఇలాంటి వాళ్ళ కోసమే. వీటిని గురించి ఒక న్యాయస్థానంలో విచారణ జరుపుతున్నారు. ఇదే న్యాయస్థానంలో 80 ఏళ్ళ కింద లోకమాన్య బాల్ గంగాధర్ తిలక్‌ని గురించి విచారణ జరిపారు. 1910లో ఇక్కడే వినాయక్ దామోదర్ సావర్కార్‌ని గురించి విచారణ జరిపారు. ఈ కోర్టులోనే ఆదిక్ ప్రాక్టీసు చేసేవాడు. ఇది ఫ్లోరా ఫవుంటెన్‌కి ఎక్కువ దూరంలేదు. ఆజాద్ మైదాన్ కూడా దగ్గరగానే ఉంది. 50 సంవత్సరాలకి పూర్వం నేను ఈ మైదానంలోనే నెహ్రూ, గాంధీల ప్రసంగాలని నా జీవితంలో మొదటిసారిగా విన్నాను. బొంబాయి ఒక చరిత్రాత్మక నగరం, ఫ్లోరా ఫవుంటెన్, హైకోర్టు, మైదాన్ - ఇవన్నీ చరిత్రాత్మక ప్రదేశాలే. ముందు తిలక్. ఆ తరువాత 1947లో స్వరాజ్యం వచ్చేదాకా ఇంకా ఎందరో!

ఈ పవిత్ర ప్రదేశాలలో ఇప్పుడు మోసగాళ్ళు, దగాకోరులూ, లాగుబోతులూ, విటులూ, రౌడీలూ, తారింపుగాళ్ళూ, ఇంకా రాజకీయాలలో కొట్టుకువచ్చిన ఇతర చెత్త. ఒక్కొక్కసారి అందమయిన సముద్ర తీరం మీద శవం ఒకటి కొట్టుకువస్తూ ఉంటుంది. అలాగే వీళ్ళూను. మానవ వ్యాపారాలలో రాజకీయాల కన్నా చెడిపోయినది ఏదయినా ఉందా అసలు? ఎప్పుడయినా ఒక అధికారంలో ఉన్న రాజకీయవాది నావయిపు వస్తే చాలు నేను తప్పుకుంటూ ఉంటాను. ఏదయినా అపాయకరమయినది, దుర్గంధం కలదీ కనపడితే తప్పుకుంటామే, అలాగన్నమాట.

20 సంవత్సరాల క్రితం కాంగ్రెసు (ఇంకొక కాంగ్రెసుపార్టీ అనుకోండి) అధికారంలో ఉన్నప్పుడు ఇలాగ ఉండేది కాదు. నెహ్రూ ఎలాంటి భయంకరమయిన సంప్రదాయాలని ప్రసాదించాడు దేశానికి! అప్పటి వాళ్ళలో కొందరిని ఇప్పటివాళ్ళతో పోల్చిచూడండి! ఎక్కడ గోవింద వల్లభపంత్ (ఆయన నెహ్రూ మంత్రివర్గంలోని సుప్రసిద్ధ దేశీయాంగ శాఖ మంత్రులలో ద్వితీయుడు), ఎక్కడ పి. సి. సేఠీ (ఈయన శ్రీమతి గాంధీ విదూషకులలో ఒకడు)! ఎక్కడ చింతామణి దేశ్‌ముఖ్, ఎక్కడ ప్రణబ్ ముఖర్జీ? ఈ ముఖర్జీ అంతూలే, స్వరాజ్‌పాల్‌ల మిత్రుడు. ఈయనే ఈ దేశాన్ని అంతర్జాతీయ ద్రవ్యనిధికి అమ్మేద్దామని చూస్తున్నాడు రాష్ట్రాలకి వెళ్ళండి. అక్కడా ఇంతే. రాజగోపాలాచారి – రామచంద్రన్, ఖేర్ – వసంత్‌దాదాపాటిల్, జీవరాజమెహతా – మాధవసింగ్ సోలంకీ, నిజలింగప్ప – గుండురావు (ఈయన్ని వోటరులు తీసేశారనుకోండి!), విధానచంద్ర రాయి – జ్యోతిబసు. ఈ మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ నాయకుడే కలకత్తాని ఒక పెద్ద మురికివాడగా మార్చివేశారు.

"రాజకీయాలు వృత్తిగా మారిపోయాయి," అంటారు. ఇది నిజంకాదేమో! నిజంగా వృత్తి అయితే అందులో సామర్థ్యం పెరుగుతుంది. భారతదేశంలో రాజకీయాలు వ్యాపారం అయిపోయాయి. ఇక్కడ అంతా ఒక సంత. కావలిసినవి కొని అమ్ముతూ ఉంటారు. ఈ దేశంలో వృత్తులు ఇంకా అంత చెడిపోలేదు. మంత్రులు కొందరు వృత్తులని అనుసరించేవాళ్ళని తిట్టవచ్చుకాని మనం వాళ్ళమాట పట్టించుకోనక్కరలేదు. భారతదేశంలో "నిర్వహణ" (మేనేజిమెంటు)ని వృత్తిగా స్వీకరించిన వాళ్ళు తమ విధులని బాగానే నిర్వహించారు; నిర్వహిస్తున్నారు. ఈ మధ్యనే ఢిల్లీలో ఒక "మేనేజిమెంటు సదస్సు" జరిగింది. దానిలో పాలుగొనటానికి దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ఎవరెవరో "మేనేజరులు" వచ్చారు. వాళ్ళని కలిసి మాటలాడితే ఎంతో సంతోషంగా ఉంటుంది. వీళ్ళంతా వివిధ వాణిజ్య సంస్థలని నిర్వహిస్తారు. మొత్తంమీద వాళ్ళ నిర్వహణ సమర్థవంతంగా జరుగుతోంది. వాళ్ళంతా వివేకం కలవారు. కష్టపడి పనిచేస్తారు. గడుసువాళ్ళు (మంచి అర్థంలో). కేవలం రేపటిని గురించి కాకుండా దూరదృష్టితో వ్యవహరిస్తారు. లాభాలని గురించి మాత్రమే కాదు దేశాన్ని గురించీ ఆలోచిస్తారు.



ఇలాంట వాళ్ళతో రాజకయవాదులని పోల్చి చూడండి. నిన్నటి రాజకీయవాదుల కన్నా నేటి రాజకీయవాదులు హీనులు. నిన్నటి వాణిజ్య సంస్థల నిర్వాహకుల కన్నా నేటి నిర్వాహకులు సమర్థవంతులు. ఒక జమ్‌షెట్‌జీ లే పోతేనేమి నేటి మూల్‌గావ్‌కర్‌లూ, పాల్కీవాలాలూ లేరూ? మరణించిన ఘనశ్యామ్‌దాస్ బిర్లాకన్నా ఆయన మనవడు ఆదిత్య బిర్లా ఎక్కువగా ప్రకాశిస్తాడు. మోడీ సామ్రాజ్యాన్ని స్థాపించిన గుజర్‌మల్ కన్నా ఆయన కొడుకులూ, సోదరపుత్రులూ సమర్థులని పేరు పొందకుండా ఉండరు. ఇవాళ ఎన్నో వాణిజ్య సంస్థలని నడిపే మేనేజరులు ఆ సంస్థలని స్థాపించిన వారికన్నా గట్టివాళ్ళు. హిందుస్తాన్ లివర్ కంపెనీ ప్రధానాధికారి అశోక్ గంగూలీతో పోలిస్తే అంతకిముందు ఆయన స్థానంలో ఉన్న బ్రిటిషు అధికారులూ, ప్రకాష్ టాండన్ అంత సమర్థవంతులు కారు. గంగూలీలాంటి వాళ్ళు కొన్ని వందలమంది దేశం అంతటా ఉన్నారు. వీళ్ళంతా కలిసి దేశంలోని వివిధ వాణిజ్య సంస్థలని నడుపుతున్నారు. వాళ్ల మూలంగానే ఈ దేశం నడుస్తోంది

నేను అడిగే ప్రశ్న ఇది : మన దేశంలో వాణిజ్య సంస్థల నిర్వాహకులు రోజురోజుకీ మరింత సమర్థవంతులు అవుతూ ఉంటే రాజకీయవాదుల సరుకు చెడిపోతోంది. రాజకీయవాదుల సరుకే కాదు అధికారుల సరుకు సయితం చెడిపోతోంది. ఇతర దేశాలలో పరిస్థితి దీనికి భిన్నంగా ఉంది. మార్గరెట్ థాచర్‌ని విన్‌స్టన్ చర్చిల్‌తో పోలిస్తే కొన్ని లోపాలు కనిపించవచ్చు కాని ఆవిడ పనికిరాని రాజకీయవాది మాత్రం కారు. అలాగే రీగన్ కూడా. రూస్‌వెల్ట్‌తో పోలిస్తే తక్కువవాడుగా తోచవచ్చుకాని నిక్సన్ లాంటి మనిషి కారు. రీగన్ పోయి హార్ట్ వస్తే అమెరికాలో కెన్నెడీలాంటి నాయకుడు వచ్చినట్లే కదా !

నేను అనుకుంటాను – మిగతా దేశాలలో రాజకీయాలు ఒక వృత్తి; ఈ దేశంలో రాజకీయాలు ఒక వ్యాపారం. వృత్తికారులకి ఆత్మగౌరవం అధికం. వాళ్లని కొనివెయ్యటం తేలికకాదు. వ్యాపారంలో అన్నిటికీ వెలగడతారు. బ్రిటన్‌లో పార్టీమార్పిడులు జరగటం చూశారా? అమెరికాలో చూశారా ? భారతదేశంలో నిత్యమూ జరిగేది ఇదే ! అంతూలే ఎన్నిమోసాలు చేసినా పార్టీలోనే ఉన్నాడు. ఆయన తోటి రాజకీయవాది ఒకాయన తాగినమైకంలో ఏమేమోచేసి శాసన మండలి ఎన్నికగెల్చాడు. ఆయనకి ప్రధానమంత్రి బాసట ఉండి ఉండాలి. మన రాజకీయాలు ఇలాగ నాశనమవుతున్నాయి. వాటిని నాశనంచేసిన మహా నాయకులూ, మహా నాయకురాళ్లూ తాముచెయ్య వలసినది ఇంకేమీలేదు, నోబెల్ బహుమతి గెలవటం తప్ప అనుకుంటున్నారు. ★

వక్రరేఖ

- న్యూట్రాన్

కలిదిండి సెంటర్లో బస్సు ఆగింది.

దిగుతున్న కొద్దిమందితోపాటు సూటు కేసుతో క్రిందకు దిగాను. బస్సు దుమ్మురేపి హారన్ మ్రోగించుకుంటూ ముందుకు కదలిపోయింది.

సూట్‌కేసును తీసుకొని బయలుదేరాను.

చల్లని సాయంత్రపు వేళ రోడ్డు ప్రక్క కాకాహోటళ్ళలోని రేడియోలు గందరగోళంగా అరుస్తున్నాయి. మేతకు పోయిన పశువులు కాలువ ఈదుకుంటూ అడ్డదిడ్డంగా రోడ్డు ఎక్కుతున్నాయి.

ఉల్లాసంగా వాటిని తప్పించుకుంటూ ముందుకు నడుస్తున్నాను. రోడ్డుకు రెండు వైపులా ఏపుగా పెరిగిన మామిడి తోటలు, వరి పొలాలు, మధ్య మధ్య పంటకాలువలతో ఎటు చూసినా ప్రకృతి పులకరింపజేస్తోంది.

ఎన్నో ఏళ్ళుగా పట్నవాసం అలవాటు కావటంతో చిరపరిచితమైన ఊరయినప్పటికీ, ఏదో వింత అనుభూతిని, మానసోల్లాసాన్ని కలుగజేస్తోంది.

అందుకే పెదనాన్నగారి వూరు రావటమంటే నాకెంతో యిష్టం. అసలు అన్నీ సక్రమంగా జరిగివుంటే నాలుగు నెలల క్రితమే తమ్ముడి పెళ్ళికి రావలసినదాన్ని. కానీ, అదే సమయానికి నేను యం. యస్. పరీక్షలకు వెళ్ళవలసి రావటంతో వీలుపడలేదు. తరువాత డిస్పెన్సరీ పని వత్తిడిలో తలమునకలుగా వున్న నాకు తమ్ముడు ఉత్తరాలు వ్రాసినప్పటికీ ఇదిగో అదిగో అంటూ ఇప్పటివరకు తీరిక చిక్కలేదు ఈ ప్రయాణానికి.

ఇదైనా—

'అక్కా !

ఇంతవరకూ ఇదిగో వస్తున్నానంటూ కాలం గడిపావు. ఈసారి అయినా రాకపోతే నీ మరదలు నీతో మాట్లాడనంటూంది సుమా! నీకో అల్లుణ్ణి బహుమతిగా ఇచ్చుకుంటుందట. మరి తప్పక వస్తావు కదూ ?

— నీ తమ్ముడు.'

అంటూ వ్రాయటంతో అన్ని పనులు ప్రక్కకు నెట్టి బయలుదేరక తప్పింది కాదు.

పిల్లకాలువ మీద వంతెన బదులు అడ్డంగా వేసిన తాటిబొత్త మీద అతి జాగ్రత్తగా నడుచుకుంటూ కాలువ దాటాను. ఊరికి చివరగా పంట పొలాల మధ్య పెద్ద నాన్నగారు కట్టించిన ఇల్లు కంటపడగానే అమ్మవడిని చేరిన పిల్లవాడి సంబరంలా నాకెంతో ఆనందాన్ని కల్గించింది.

గాలికి చెదిరిన జుట్టును సరిచేసుకుంటూ సూట్‌కేసును చేయి మార్చుకుని తలుపు తట్టాను.

"ఎవరూ ?..." తలుపు తెరిచింది ఆమె.

గుండ్రటి మొహం. అందమయిన ముక్కు. వెడల్పాటి కళ్ళు. తీర్చి దిద్దినట్లున్న కనుబొమలు. ఒత్తయిన జుట్టు. అందమంతా ఒకేచోట కలబోశారా! అన్నట్లుంది ఆమె.

ఈమెను ఎప్పుడో చూశాను ! ఎక్కడో కలిశాను !!

ఆలోచనలో పడ్డాను —

ఆమె కూడ నా వంక మార్చిమార్చి చూస్తోంది.

"ఎవరమ్మా ! వచ్చింది." అంటూ లోపలి నుంచి ముందు గుమ్మంలోకి వచ్చింది పెద్దమ్మ.

నన్ను చూసిన సంతోషంతో "రా అమ్మా! రా !... ఏమిటలా నిలబడిపోయావు ? ఓహో !.. నీ మరదలును ఇంతవరకు చూడలేదు కదూ ?" అంటూ లోపలికి దారి తీసింది.

ఏదో తెలియని ఆరాటం నన్ను ఉక్కిరి బిక్కిరి చేస్తోంది.

పెద్దమ్మ వేసే కుశల ప్రశ్నలకు జవాబులిస్తున్నానే కాని నా ఆలోచనలు నన్ను తరుముతున్నాయి. బిడియపడుతూ ఒక ప్రక్కగా ఒదిగి నుంచుంది ఆమె.

మనసు పొరలను చీల్చుకొని జ్ఞాపకాల దొంతరలు వెదకసాగాను.

మూడు సంవత్సరాల క్రితం —

* * *

"గుడ్ మార్నింగ్ డాక్టర్!" గంభీరమైన గొంతు విని డిస్పెన్సరీలో కూర్చొని మెడికల్ జర్నల్ చదువుతున్న నేను తలఎత్తి చూశాను.

ఎర్రగా పొడుగ్గా హిప్పీ క్రాఫుతో మడత నలగని బట్టలతో హుందాగా నిలబడివున్నాడా యువకుడు. షుమారు పాతికేళ్ళలోపు వుంటాయతనికి.

"అయామ్ మిస్టర్ సాగర్ ! షి యీజ్ మై ఉడ్‌బి" అంటూ పరిచయం చేశాడు సిగ్గుతో అతని ప్రక్కనే నుంచుని వున్న ఆమెను.

"ప్లీజ్ టేక్ యువర్ సీట్స్" అంటూ ఇద్దరికీ కుర్చీలు చూపించాను.

అమాయకమైన కళ్ళతో డిస్పెన్సరీని కలయజూస్తూ తలదించుకొని కూర్చుంది. చూడముచ్చటగా వుంది జంట అనిపించింది. అతను దేనికో సంశయిస్తున్నాడని గ్రహించాను.

"చెప్పండి !" అన్నాను అతనిలోని సంశయాన్ని పోగొడుతూ.

"ఒకసారి ఈమెను పరీక్షించాలి" అన్నాడు అదోలా.

"ఏమైంది ?"

"నెలరోజులుగా నలతగా వుంటూంది."

"లోనికి రండి టెస్ట్ చేస్తాను" అన్నాను ఆమెనుద్దేశిస్తూ.

నా వెంట ఆమెకూడ లోనికి వచ్చింది. భయం భయంగా నా వంక చూస్తూ బెడ్‌మీద పడుకుంది.

ఆమె కళ్ళలోని బిత్తర చూపులు గమనించిన నేను —

"ఫర్వాలేదు దీనిలో భయపడాల్సిందేమి లేదు" అన్నాను టెస్టింగ్ బెడ్‌మీద పడుకున్న ఆమెలో భయాన్ని పోగొట్టాలని.

ఆమె పడుకున్న తీరును గమనించిన నాకు ఆమెమీద నా మాటలు పని చేశాయనిపించింది.

పరీక్షించిన నాకు కేసేమిటో వెంటనే అర్థమయింది. ఎక్కడలేని విసుగు, కోపం నాలో చోటు చేసుకున్నాయి. కాని ఏమని నిందించను. ఎవరని హితబోధ చేయను.

"వెరీ బాడ్ మిస్టర్ !... షి యీజ్ ప్రెగ్నెంట్ నౌ." పరీక్ష ముగించి బయటకు వచ్చి అతనితో అన్నాను. నా గొంతు నాకే వింతగా తోచింది.

"అయామ్ సారీ డాక్టర్ ! అనుకోని పరిస్థితులలో బలహీనతకు లొంగిపోవాల్సి వచ్చింది. త్వరలో పెళ్ళి చేసుకోబోతున్నాము. ఈ ఆపద నుండి మమ్మలను మీరే గట్టెక్కించాలి" అన్నాడు.

"అంటే ? ..." ప్రశ్నించాను మత్తు నుండి అప్పుడే తేరుకున్నట్లుగా.

"డాక్టర్, ఆమెకు ఎబార్షన్ చేయించాలి" అన్నాడు అతను.

"నో మిస్టర్! ఎలాగూ మేరేజ్ చేసుకోబోతున్నారు. అదేదో సాధ్యమైనంత త్వరలో కానిస్తే సరిపోతుంది."

"లేదు డాక్టర్. కొన్ని బాధ్యతలు నెరవేర్చ

వలసి వున్న దృష్ట్యా మరి కొంత కాలం ఆగక తప్పదు.''

"సారీ మిస్టర్, యు కెన్ గో.'' అన్నాను విసురుగా.

"ప్లీజ్ డాక్టర్. ఒక సాటి స్త్రీగా నా కోసం సాయం చేయరూ?'' అంది అప్పటి వరకు తల దించుకుని కూర్చొన్న ఆమె. ఆమె కళ్ళలో దైన్యం దోబూచులాడుతూంది.

ఆమె అభ్యర్ధన నా మనసులో ఏ మూలో దాగిన మానవతా భావాన్ని మేలుకొల్పగా ఆమె కష్టాన్ని తలచుకున్న నేను కాదనలేకపోయాను.

ఎబార్షన్ ఎంత చట్టబద్ధమైనప్పటికి అది ఏ దిశగా పయనిస్తోందో చూస్తున్న నాకు క్షణకాలం వృత్తి మీద ఏహ్యాభావం కలిగించిందనటం అతిశయోక్తి కాదు.

"ఓ. కె. మీ యిష్టం. ఈ రోజు ఒక ఇంజెక్షన్ ఇస్తాను రేపు ఇదేటయిముకు వచ్చి కలవండి'' అన్నాను.


"ఈ రోజు చేయలేనంటారా?'' అడిగాడు

"చెయ్యవచ్చు కానీ ఎక్కువ టయిము తీసుకుంటుంది.''

"అంటే !''

"ఈ రాత్రికి క్లినిక్‌లో వుండి రేపు వెళ్ళవలసి రావచ్చు.'' అన్నాను.





''లేదు డాక్టర్! రాత్రిలోపు వెళ్ళిపోవాలి. పెద్ద వాళ్ళకు తెలియకుండా వుండాలి.'' అంది ఆమె.

వారి పరిస్థితి అర్ధమయింది—

''సరే, సాయంత్రానికి పంపటానికి ప్రయత్నిస్తాను.''

''థాంక్యూ డాక్టర్.'' అన్నాడు అతను ఎంతో రిలీఫ్‌గా.

రెండు, మూడు గంటలలోపు తతంగం పూర్తి అయింది. ఆమెకు అరగంట తర్వాత తెలివి వచ్చింది. సాయంత్రం వరకు బెడ్‌రెస్ట్ తీసుకున్నాక ఇద్దరూ వెళ్ళిపోయారు.

అంతే !

మళ్ళీ ఇన్నేళ్ళకు... అదీ ఆమెను ఈ విధంగా చూడటం...

*   *   *

''ఏమ్మా! అలావున్నావు ? '' అడిగింది పెద్దమ్మ నా మొహంలోకి చూస్తూ.

నా పరధ్యానం ఆమెను తెలియని ఆందోళనకు గురిచేసింది. అది గ్రహించి ''ఏం లేదమ్మా! తమ్ముడేడి. కనుపించడేం?'' అన్నాను వర్తమానంలోకి తొంగిచూస్తూ.

''పొలంలో ఎరువులు చల్లించాలని ఉదయమనగా వెళ్ళాడమ్మా! బహుశ వస్తూండవచ్చు'' అంది అమ్మ.

నా మనసు నిలువనీయటం లేదు.

ఇప్పుడేం చెయ్యాలి ? ఇలా జరిగిందేమిటి ?? నా కర్తవ్యమేమిటి ??? నాలోని ప్రశ్నల పరంపర నాకు ఊపిరి సలుపనీయటం లేదు.

తమ్ముడికి యీ విషయం తెలియజేస్తే ! నాలోని ఆడమనను పురికొలిపింది, చ్ఛా ! ... ఏమిటీ ఆలోచన ? అంతలోనే మందలించింది నా వృత్తి ధర్మం.

నాలోని సంస్కారానికి, వృత్తి ధర్మానికి మధ్య సంఘర్షణ.

చాలా సమయాల్లో మనిషి సరిదిద్దవలసి వుండి కూడ చేతులు ముడుచుకొని ఎందుకుండి పోతాడో నాకు యిప్పుడే అర్ధమయింది.

వక్రరేఖ

పోనీ ఆమెను అడిగితే ! ఏమని చెబుతుంది· ఈ సంఘంలో తనూ ఓ ఆడది. మేకవన్నె పులులుంటాయని, నాగరికపు ముసుగులో తోడేళ్ళు సంచరిస్తుంటాయని తెలుసుకున్నానంటుందా. చేతులు కాలిన తరువాత ఆకులు పట్టుకోక పోయినా ఓ చల్లని చెట్టు నీడ సేద తీర్చుకుంటున్నానంటుందా ! ఏమని చెప్పగలదు ?

నా వ్యక్తిత్వం ముందు నిలిచి నన్ను వెక్కిరిస్తూంది.

''శాంతీ ! ప్రయాణం చేసి అలసిపోయినట్లున్నావు. స్నానంచేసి విశ్రాంతి తీసుకో'' అంటూ—

''వదినకు స్నానానికి నీళ్ళు ఏర్పాటుచేయి'' అంటూ ఆమెకు పని పురమాయించింది పెద్దమ్మ.

అంతవరకు ఇల్లు సర్దటంలో బిజీగా వున్న ఆమె ముఖ కవళికల్ని గమనించలేకపోయాను.

బాత్‌రూములో నీళ్ళు ఏర్పాటుచేస్తున్న ఆమె ముఖం వంక చూశాను. ఎటువంటి భయ సంకోచాలు ఆమె ప్రవర్తనలో కనుపించక పోవటంతో ఆమె ధైర్య స్థయిర్యాలకు అచ్చెరువొందాను.

మధనం

క్షీరసాగర మధనంలో
హాలా హలం
తరువాతే
అమృతం
పుట్టినట్లు
జీవన సాగర మధనంలో
చెడు తరువాతే
మంచి పుడుతుంది
క్రాంతి తరువాతే
'సత్తు' పుడుతుంది

— "సింహం"

ఏమాత్రం నా వునికిని గుర్తించనట్లు ప్రవర్తించటంతో ఆమె నటనా సామర్ధ్యాన్ని తక్కువగా అంచనా వేయలేకపోయాను.

ఆమె నన్ను పట్టించుకోక పోవటంతో నాలోని అహం దెబ్బతింది. ఆమె జీవితం నాశనం కావటం నా మనస్సుకంగీకారం కాకున్న నన్ను ఆమె గుర్తించాలన్న తపన నాలో చోటు చేసుకుంది.

''ఏమ్మా ! నన్ను గుర్తించావా ?'' అడిగాను. నా గొంతు నాకే అసహజంగా తోచింది.

ఆమె చేస్తున్న పనిని మధ్యలో ఆపి దిగ్గున తల ఎత్తింది.

పాలిపోయిన మొహంతో, వర్షిస్తున్న కళ్ళతో బేలగా నా వంక చూస్తుందన్న నా వూహ తారుమారయింది.

ఆమె కళ్ళలో ఆశ్చర్యం, అనుమానం తొంగి చూస్తున్నాయి.

''క్షమించండి ! తొలిసారిగా చూస్తున్న మిమ్మలను గుర్తించటమేమిటి ?!'' అర్థం కానట్లు అడిగింది ఆమె.

ఆమె ప్రశ్నతో ఈసారి ఆశ్చర్యపోవటం నా వంతయింది. వంచనా శిల్పంలో ఆమె ఆరితేరిందని తెలుసుకున్న నాకు అంత సులువుగా ఆమెను వదలాలనిపించలేదు.

''హైదరాబాదులో మిస్టర్ సాగర్‌తో కలిసి నా డిస్పెన్సరీలో తీసుకున్న ట్రీట్‌మెంట్‌ను ఇంత త్వరగా మరుస్తావనుకోలేదు'' అన్నాను ఆమెను ఎలాగయినా దెబ్బకొట్టాలన్న తలంపుతో.

''సారీ మేడమ్ ! హైదరాబాదులో సాగర్ బావగారు, అక్కవున్న మాట వాస్తవమయినా నేను ఇంతవరకు హైదరాబాదు రావటం తటస్థించలేదు. బహుశ కవలలమైన మా అక్కగారిని మీరు చూసివుండవచ్చు'' అంది ఆమె.

మరోసారి ఆశ్చర్యపోవటం నా వంతయింది. ★


సంపూర్ణ ఆరోగ్యానికి-సంతృప్తికర మైన భోజనానికి



1


A, S. బ్రాండ్ పప్పునూనె మరియు మాన్షన్ బ్రాండు నువ్వులనూనెతో తయారయ్యే వంటకాలతో మీరు ఎన్నడూ చేయనంత సంతృప్తిగా భోజనం చేస్తారు. వంటకాల్లో వచ్చే రుచి, కమ్మదనం అద్వితీయం.

2



అన్నిరకాల ఊరగాయలను సంవత్సర పొడువునా మెత్తబడనీయకుండ, రుచికరంగా, ఘుమఘుమలాడుతూ, తాజాగా ఉంచుతుంది.

3



గుండెపోటు, రక్తపోటు అరికట్టడంలో గొప్పగా సహాయపడుతుంది.

15, 4, 2 కేజీల డబ్బాలలో ఇండియన్ గవర్నమెంట్ వారి అగ్‌మార్కు సీలుతో లభించును.

SAIKRUPA/ASC/83



అంబటి సుబ్బన్న అండ్ కో. సామర్లకోట . A.P.

వైద్యపరికరాలు లేకుండా వైద్యం చేసిన డా॥ అరిగో



అది బ్రెజిల్ దేశంలోని ఒక చిన్న పట్నం.

పట్నం శివార్లలో ఉన్న ఓ ఇంట్లో ఒక స్త్రీ కడుపులోని పుండుతో బాధపడుతూ మరణ శయ్యపై ఉంది. మంచం చుట్టూ బంధువులు, స్నేహితులు మూగగా రోదిస్తున్నారు. అప్పటికే డాక్టరు పరీక్షచేసి ఆమె బతకడం కష్టమనీ, కడుపులోని పుండు ఆపరేషన్ చేయడానికి కూడా వీలు లేనంతగా అయిపోయిందనీ, మహా అయితే ఆమె ఒక్కరోజు బతుకుతుందని చెప్పి వెళ్ళిపోయాడు. అందరూ బాధపడుతున్న ఆ సమయంలో అక్కడే ఉన్న ఓ యువకుడు ఒక్క ఉదుటునలేచి వంటింట్లోకి వెళ్ళి ఒక కత్తిని తీసుకువచ్చి అదే వేగంతో రోగిపై ఉన్న దుప్పటిని లాగివేసి కత్తిని కసుక్కున ఆమె కడుపులోకి దింపాడు. ఇది చూసిన కొందరు స్త్రీలు భీతావహులై స్పృహ కోల్పోయారు. తరువాత ఆ యువకుడు తన రెండు చేతులతోనూ ఆమె కడుపులోచేతులు పెట్టి మరుక్షణం ఆమె కడుపులోనున్న పుండును బయటకు తీసాడు. చూస్తున్న వారందరూ ఆశ్చర్యంతో నోళ్ళు వెళ్లబెట్టారు. రోగికి ఏ మాత్రమూ బాధ లేకుండా పుండును బయటకు తీసివేసి నందుకు అతను కూడా ఎంతో ఆశ్చర్య పోయాడు. వారం రోజుల తరువాత ఆ స్త్రీ లేచి మామూలుగా తిరగడం మొదలు పెట్టింది. డాక్టర్లు ఆమెను పరీక్షచేసి ఆమెకు పూర్తిగా స్వస్థత చేకూరినట్లుగా ధృవీకరించారు.

ఆ యువకుడి పేరు జోన్ పెడ్రో డె ఫ్రైటస్. 1918 లో జన్మించారు. ముద్దు పేరు అరిగో. అరిగో అన్నలందరూ బాగా చదువుకున్నారుకానీ అరిగోకి చదువు ఎక్కలేదు. నాలుగుసంవత్సరాలు అతికష్టంమీద స్కూలుకు వెళ్ళి తరువాత మానేసాడు. తన తండ్రితోబాటే పొలం పనులు చూసుకుంటూ, చేదోడు వాదోడుగా ఉండేవాడు.

ఇరవై అయిదు సంవత్సరాల వయసురాగానే తాను ప్రేమించిన ఆర్లెట్ అనే అమ్మాయిని పెళ్ళి చేసుకుని అదే ఊర్లో ఉన్న ఒక ఇనుప ఖనిజాల గనిలో ఉద్యోగం సంపాదించుకున్నాడు. ఆ గని యజమాని మరీ స్వార్థపరుడై లాభాలను దిగమింగుతూ, కూలీలకు మొండి చెయ్యి చూపిస్తూ ఉండేవాడు. అది చూసి రెచ్చిపోయిన అరిగో కూలీలకు ఒక యూనియన్ ప్రారంభించి యాజమాన్యంపై యుద్ధం ప్రకటించాడు. ఫలితం—అరిగో ఉద్యోగం ఊడింది.

నిరుద్యోగి అయిన అరిగో కొన్నాళ్ళ తరువాత అప్పు తీసుకుని ఒక బార్ ప్రారంభించాడు. అతనిది మరీ జాలిగల హృదయం అవటం వలన స్నేహితులు వచ్చి ఊరికే చిత్తుగా తాగి పోతూండేవారు. కొన్నాళ్ళకు బార్ కూడా భారీ నష్టంతో మూతపడింది.

అద్భుత వ్యక్తులు

ప్రొ॥ బి.వి. పట్టాభిరామ్

అక్కడినుంచి అతని జీవితం గొప్ప మలుపు తిరిగింది. ప్రతీరోజూ అతనికి కలలో ఒక హాస్పిటలు, నర్సులు, ఓ బట్టతల డాక్టరు అపరేషన్ చేస్తూ కనబడేవారు. ఇది మొదట్లో ''ఏదో కల'' అని కొట్టి పడేసినా రోజూ రావడంతో అతను ఆశ్చర్యపడి భార్యకు చెప్పాడు. ఆమె ఇతనికి ఏదో పిచ్చిపట్టి ఉండవచ్చునని భావించి మెంటల్ హాస్పిటల్‌కు తీసుకువెళ్ళింది. అక్కడవారు పరీక్షచేసి అతను సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నాడని చెప్పారు. మళ్ళీ ఆనాటి రాత్రి కలలో ఆ బట్టతల డాక్టరు వచ్చి అరిగోతో ''నా పేరు డాక్టర్ ఫ్రిట్జ్, నేను నా ప్రజలకు ఎంతో సేవ చేద్దామనుకున్నాను కానీ దురదృష్టవసాత్తూ మొదటి ప్రపంచ యుద్ధంలో మరణించాను. నేను చేయదలుచుకున్న సేవను ఇపుడు నీ ధ్వారా చేయిస్తాను. నువ్వు భయపడక నేను చెప్పినట్లు చెయ్యి'' అన్నాడు.

ఆ మర్నాడే తనకు తెలిసిన స్త్రీ మరణ శయ్యపై ఉండటం, ఆ సమయంలో అక్కడే కూర్చున్న అరిగోకి డాక్టర్ ఫ్రిట్జ్ ఏదో చెప్పినట్లని పించడం : అతను కత్తితో ఆపరేషన్ చెయ్యడం అన్నీ జరిగిపోయాయి. ఆ సంఘటనతో ఊర్లో, అరిగోపేరు మార్మోగిపోయింది. మర్నాటినుంచి రోగులు అరిగో దగ్గరికి రావటం మొదలుపెట్టారు. అతను వారికి స్వస్థత చేకూర్చేవాడు. ఆపరేషన్ చెయ్యడానికి చేతులకు తొడుగులు కానీ, సెప్టిక్ కాకుండా మందులు రాయడం కానీ, కత్తిని వేణ్ణీళ్ళలో స్టెరిలైజ్ చెయ్యడం కానీ వంటి జాగ్రత్తలేవీ తీసుకోకుండా అరిగో ఎన్నో ఆపరేషన్లు చేయగలిగాడు,

అందులో ఏ ఒక్క కేసూ కూడా ఫెయిల్ అవలేదు. ఎందరో సైంటిస్టులు, డాక్టర్లు, జర్నలిస్టులు ఈ వింతను కళ్ళారా చూసారు. కొంతమంది ఇదేదో మహత్యమనుకుంటే, మరి కొందరు అది విశ్వాసం వలన తగ్గి ఉండవచ్చునని సరిపెట్టుకున్నారు. ఏది ఎలాగున్నా అతను అనాగరిక పద్ధతిలో ఆపరేషన్ చెయ్యడం, పుండును తొలగించడం, అది రోగులకు స్వస్థత చేకూర్చడం యావత్ ప్రపంచాన్ని దిగ్భ్రమ పరిచింది. అమెరికాకుచెందిన ప్రముఖ వైద్యశాస్త్రనిపుణుడు డాక్టర్ హెన్రీ పుహరిచ్ 1963లో అరిగోని కలిసి అతనుచేసే ఆపరేషన్‌లు చూసి విస్తుపోయి ఇదేదో దైవలీల తప్ప మరొకటి కాదు అన్నారు. ఆయన చేతిలో ఉన్న ఒక పుండును కూడా అరిగో తన పద్ధతిలో ఆపరేషన్ చేసి తీసివేసాడు.

పేషెంటు రాగానే అతను బాధ చెప్పకుండానే అతనికి పుండు ఎక్కడఉందో చెప్పడం అరిగోలో మరో ప్రత్యేకత. ఆ పుండును ఒకే కత్తివేటుతో బయటకు తీయడం అతనికి కరతలామలకం అయింది. ఎక్కువ డబ్బు తీసుకోకుండా ఇలా వైద్యం చేయటంవలన బ్రజిల్‌లో మిగతా డాక్టర్లు దాదాపు దివాళాస్థితికి వచ్చారు. దాంతో వారందరూ ''అరిగో వైద్యశాస్త్రం చదవలేదు, అందులో అనుభవంలేదు. పేషెంట్ల ప్రాణాలతో ఆటలాడుకుంటున్నాడు — అతనిని శిక్షించాలి, అని కోర్టులో కేసుపెట్టారు. జడ్జి కేసునంతా విని అరిగోకి పదిహేను నెలల ఖైదు, కొంత జరిమానా వేసారు. కానీ, బ్రజిల్ అధ్యక్షుడు అతనికి క్షమాభిక్ష పెట్టి కేసు తప్పించాడు. కారణ మేమిటంటే, ఆ అధ్యక్షుడి కుమార్తెకు అరిగో ఆపరేషన్ చేసి పొత్తి కడుపులోని రాళ్ళను తీసివేసాడు. ఎవరెన్ని ప్రయత్నాలు చేసినా అరిగో ప్రాక్టీసును తగ్గించలేకపోయారు. తాను మంచి మనసుతో, పేదలకు సహాయం చేస్తూ భగవంతుడిపై నమ్మకంతో ఈ వైద్యం చేస్తున్నాననీ కాబట్టి తనను ఎవరూ శిక్షించలేరని అంటూ ఉండేవాడు.

అరిగోని పరీక్షించిన పారాసైకాలజీ శాస్త్రజ్ఞులు ''అతనిలో ఎటువంటి అతీంద్రియ శక్తి లేదు — దీనికి ప్రధాన కారణం విశ్వాసమే. ఇటు వైద్యం చేసేవారికీ అటు చికిత్స పొందుతున్నవారికీ ఈ క్రియపై ప్రగాఢమైన విశ్వాసం ఉంటుంది. దానివలన సగం ఉపశమనం కలుగుతుంది'' అన్నారు.

బ్రజిల్, చుట్టుపక్క దేశాలవారి ''దేవుడు డాక్టరు''గా పేరు పొందిన అరిగో 1971 జనవరి 11వ తారీఖున కారు యాక్సిడెంటులో మరణించాడు.

(పైవారం: అతీంద్రియ విజ్ఞానాన్ని అధ్యయనంచేసిన అబ్రహాంలింకన్)

ఆంధ్రసచిత్రవారపత్రిక

రచయితలకు గమనికలు

★ ఆంధ్ర పత్రిక వారపత్రికకు కథలూ యితర రచనలు పంపదలచుకున్నవారు సంపాదకుడు, ఆంధ్ర పత్రిక వారపత్రిక, గాంధీ నగరం, విజయవాడ—520 003 అన్న చిరునామాకి వ్రాయాలి.

★ కవరుమీద శీర్షిక పేరు పేర్కొనడం మంచిది. రచయితలు తమ పూర్తి పేరూ, చిరునామా రచన చివరకూడా స్పష్టంగా వ్రాయాలి— హామీపత్రం జత చెయ్యాలి.

★ గేయాలు తిప్పి పంపబడవు. వీటి పరిశీలనకు కూడా సుమారు ఏడు మంచి ఎనిమిది వారాల గడువు అవసరం.

★ కథలుగాని, యితర రచనలుగాని తిప్పి పంపబడాలని కోరుకునే వారు— వారి స్వంత చిరునామా గల తగినన్ని తపాలాబిళ్ల లంటించిన కవరు పెట్టడం అవసరం.

★ రచనల గురించి పంపిన వెంటనే గాక ఎనిమిది వారాల తరువాత మాత్రమే వాటిపై నిర్ణయం కోసం ఎదురుచూడడం మంచిది. రచనల గురించి ఉత్తరప్రత్యుత్తరాలకి తావులేదు కాని—తప్పనిసరి పరిస్థితులలో వాటిపై వ్రాయవలసివస్తే రచయితలు— రచన పేరు— అది పంపిన తేదీ, వివరంగా వ్రాయండే, వాటి గురించి పరిశీలించడం కష్టం.

★ మా కార్యాలయానికి రచనలు తెచ్చి ఇచ్చేవారు కూడా పై నిబంధనలన్నీ పాటించాలి. వారికి కూడా స్వంత చిరునామా గల తగినన్ని తపాలాబిళ్ల లంటించిన కవరు జత చెయ్యాలి అన్న నిబంధన వర్తిస్తుంది.

★ కార్టూన్‌లు పంపేవారు కూడా 8 వారాలలోగా మా మీద ఉత్తరాల దాడి చెయ్యకూడదు... ప్రతీ కార్టూన్ వెనుక పూర్తి పేరు, చిరునామా వ్రాయాలి.

★ ప్రత్యేక సందర్భాలుగా వేసిన కార్టూన్ల కవర్లపై ఆ విషయం వ్రాస్తే వాటి పరిశీలన త్వరితంగా జరుగుతుంది.

★ రచనల ఎంపిక తరువాత వాటి ప్రచురణ వీలు వెంబడి జరుగుతుంది.


★ రచయితలకు కార్టూనిస్టులకు [ఒక్క ఉత్తరాలు, ప్రశ్నావళి, డాక్టర్ సలహాల శీర్షికలో 'పడ్డ' వారికి తప్ప తతిమ్మా అందరికీ] అవి పడ్డ ''ప్రతు''లను— కాలక్రమంలో వాటి పారితోషికాలను పంపుతాము. కాపీలు టపాలోపోయే ప్రమాదం వుంటుందే తప్ప పంపకపోవడం జరుగదు.

సం॥


వ్యక్తిగతం



ముకాకి అయాతు బస్తర్ (మ.ప్ర.) గ్రామానికి చెందిన గిరిజన బాలుడు. ఏదో తగాదా వచ్చి అతని స్నేహితుడు ఏప్రిల్ 15 రాత్రి అతన్ని బాణంతో కొట్టాడు. అది అయాతు గుండెల్లో దిగబడిపోయింది. మర్నాడు ఉదయం అలాగే ఉన్న దానిని అతను తన బంధువులకి చూపాడు. వాళ్ళు పోలీసులకి తెలియచేశారు. సమీపంలో వైద్య సౌకర్యంలేనందువల్ల ఏప్రిల్ 17న అయాతుని తీసుకుని ఒక కానిస్టేబిల్ జిల్లా ఆస్పత్రికి జగదల్‌పూర్ బయలుదేరాడు. 18వ తేదీ మధ్యాహ్నానికి వాళ్ళు అక్కడికి చేరారు. ఆ సాయంత్రం డాక్టర్లు అయాతుని పరీక్షించి చికిత్స ప్రారంభించారు. గుండెల్లో దిగిన బాణం అలాగే మూడున్నర రోజులపాటు ఉండటమే కాకుండా ఆస్పత్రికి చేరుకోడానికి అతను 40 కి.మీ. కాలి నడకన, తర్వాత మరో 125 కి.మీ బస్సులో ప్రయాణంచేసి బతికి బట్ట కట్టడం అన్నది అద్భుతమైన విషయం...



అంటార్కిటికాపై భూగర్భశాస్త్ర పరిశోధనలని నిర్వహించిన మొట్టమొదటి భారతీయ మహిళ డాక్టర్ సుదీప్తా సెన్‌గుప్తా. ఈమె అక్కడ 25 రోజులపాటు రోజుకి 18 గంటలు పనిచేశారు. మైనస్ 25 డిగ్రీల సెల్సియస్ వాతావరణంలో లైంగికపరమైన ఊహలుగానీ, సెక్స్ సంబంధమైన స్పందనలుగానీ అసలు ఉండవని కుమారి సుదీప్త (38) అన్నారు. అంటార్కిటికాలో రాగి, సీసం, తుత్తునాగం ఉన్నట్లు ఈమె చేసిన పరిశోధనలవల్ల తేలింది. కుమారి సుదీప్త జాదవ్‌పూర్ విశ్వవిద్యాలయంలో భూగర్భ శాస్త్ర ఆధ్యాపకురాలిగా ఉన్నారు ...



వారఫలం

1-6-1984 శుక్రవారం మొదలు 7-6-1984 గురువారం వరకు

♈ మేషం: మీ సాహితీ కృషి రాణిస్తుంది. పత్రికా లేఖకులయినా, గ్రంథకర్త లయినా, పత్రికా ప్రచురణకర్త లయినా మీకు లాభదాయకమే. గృహాభివృద్ధికి అవకాశ మున్నది. నూతనాంశాలు గ్రహిస్తారు. స్త్రీలకు: యత్న కార్యసిద్ధి ఉద్యోగ మందు అభివృద్ధి, ధన లబ్ధికి అవకాశం ఉంటుంది.

♉ వృషభం: చలనచిత్ర రంగాను భవం గలవారికి, నిర్మాణ కార్యక్రమ మందు అనుభవంగలవారికి, భారీ వ్యాపార దక్షులకు, కళారంగానుభవం గలవారికి, పత్రికా ప్రకటన కర్తలకు చెప్పదగినఆదాయం చేకూరుతుంది. స్త్రీలకు: చేతి వృత్తు లందు అనుభవం గల వారికి మే లున్నది.

♊ మిథునం: ఒకానొక గృహ వ్యవహారం ఈ వారంలో మధ్యవర్తుల మూలాన పరిష్కారం కానున్నది. వృత్తియందు అభివృద్ధికి అవకాశం ఉన్నది. నూతనాంశాలు గ్రహిస్తారు. స్త్రీలకు: బంధువుల మూలంగా లాభించటం, శుభ వార్తా శ్రవణం, స్వల్పాదాయానికి అవకాశ మున్నది.

♋ కర్కాటకం: గ్రహించండి. రాశికి చతుర్థస్థాన స్థితుడైన 'శని' లాభ ప్రదాయకుడు. అన్ని రంగాలలో అభివృద్ధిదాయకుడు. 'ఇక రాదు, ఇదికాదు' అని అనుకొన్న వ్యవహారమే సుందరంగా ఆనంద దాయకంగా పరిణమించగలదు. నటకులకు ఈ రాశికి చెందిన వారికి సదవకాశాలు లభించగలవు. స్త్రీలకు: నూతనాంశాలు గ్రహింపునకు రాగల వారం.

♌ సింహం: అనేక విధాల యోగ ప్రదాయక వారం. అనుకొన్నది, అనుకొన్నట్లు నెరవేరుతుంది. ఆశించిన ఉద్యోగ 'ప్రమోషన్' లభ్యం కాగలదు. నూతన వస్తు సేకరణకు అవకాశం గలవారం. స్త్రీలకు: సర్వత్రా విజయవంతమే. చాల కాలంగా అందిరాని కార్యానుకూలత చేకూరుతుంది.

♍ కన్య: 'శుభస్య శీఘ్రం' అన్నారుగా. 'మీనం, మేషం' ఎంచక శుభ కార్యోన్ముఖులు కావాలి. అన్నీ వాటంతటఅవే సమకూరుతాయి. ఆదాయ మందు వృద్ధి గలదు, కొందరకు వాహన నిమిత్తమై చేసే యత్నం ఫలిస్తుంది. త్వర పడండి. స్త్రీలకు: నగలు, నూతన వస్త్రాలు కొనుటకు, ఉన్నత విద్యకై శ్రమించుటకు, ఉద్యోగ సాధనకు సదవకాశా లుంటాయి, గ్రహించాలి.

♎ తుల: అన్ని విషయాలలో గణ్యత నందగల వారం. అధికారం బాగా చెలాయించాలి. ధనలబ్ధికి ఎలాంటి ఆక్షేపణ లేదు. ప్రతిభ రాణించగల సమయం. స్త్రీలకు: కళా సాహితీ రంగాలలో సదవకాశా లుంటాయి. ఆదాయ మున్నది. అప్రయత్నంగా డబ్బు అందవచ్చు, గ్రహించాలి.

♏ వృశ్చికం: ముఖ్య బంధువులతో విభేదం రాకుండా చూచుకోవచ్చు. నూతనాంశాలు గ్రహింపగలుగుతారు. ప్రత్యర్థులతో తగాదా తంటాలు రాకుండా చూచుకోవాలి. ఇండ్లమార్పు గాని, స్వయంగా కొనే అవకాశం గాని కొందర విషయంలో చెప్పవచ్చు. స్త్రీలకు: ఉన్నత విద్యకు అవకాశాలు, ఉద్యోగ సంపాదనలో సుముఖత కనిపిస్తుంది.

♐ ధనుస్సు: మీ వ్యవహారం సుకరంగా పరిష్కారం కాగలవు. మీ ఆదాయమందు అభివృద్ధి కనిపిస్తుంది. వస్తు వాహనాలు సమకూర్చుకోగలుగుతారు. స్త్రీలకు: నూతనాంశాలు గ్రహించు అవకాశం అప్రయత్నంగా ధనాదాయానికి అవకాశా లుంటాయి. కొందరకు ఉద్యోగ యత్నాలు సానుకూలం కాగలవు. దూర ప్రాంతాలకు ప్రయాణం కొందరకు అనుభవనీయం

♑ మకరం: దూర బంధువులు యింటికి రాగలరు. శుభ కార్య ప్రస్తావన లుండగలవు. కొందరకు శుభ ముహూర్త నిశ్చయానికి అవకాశం కూడ గలదని గ్రహించాలి. చేసిన పనే మరలా చేయవలసి వచ్చిందని కొందరు బాధపడుతారు. స్త్రీలకు: అప్రయత్నంగా ఉద్యోగసంబంధ శుభ వార్తా శ్రవణం, ఆదాయం చెప్పవచ్చు.

♒ కుంభం: వ్యాపారానుకూల్యత గల వారం. కార్ఖానా, గనుల సంబంధంగా శ్రమించే వారికి లాభదాయక వారం. వైద్య వృత్తియందున్న వారికి అభివృద్ధికర వారం. నూతనాంశాల గ్రహింపునకు అవకాశం గలదు. స్త్రీలకు: పని తొందర, విశ్రాంతి లేకపోవటం గమనింపగలరు

♓ మీనం: ధనాదాయం గలవారం. విలువగల వస్తువులు కొందరు, వాహనాలు కొందరు, సేకరించుకో గలుగుతారు. గృహ నిర్మాణయత్నాలు కొందరకు సాగగలవు. స్త్రీలకు: గ్రహించండి. శ్రమిస్తే కళా సాహితీ రంగాలలో అనుకూలత చేకూరుతుంది. ఆదాయం సమకూడుతుంది.

– విద్వాన్ కోట సత్యరంగయ్య శాస్త్రి

సీరియల్

ఈ రాగానికదే తాళం

చక్కిలం విజయలక్ష్మి

(గత సంచిక తరువాయి)

జయంతి కవర్ చించింది.

జయంతీ,

నీ నిర్ణయం తెలిసి మొదట ఆశ్చర్యంతో బిగుసుకుపోయినా తర్వాత ఎంతో ఆనందించాను. నీలాంటి పెక్యులియర్ క్యారెక్టర్‌గల అమ్మాయి ఇలాంటి నిర్ణయం తీసుకోవడంలో పెద్ద ఆశ్చర్యమేమీ లేదనిపించింది. కానీ నిన్ను చూస్తే నాకిప్పటికీ ఆశ్చర్యమే! మొదట్లో నీవు ఇంట్లో మసలుతూ వుంటే, ముఖ్యంగా నా కాబోయే భార్యగా అనుకుంటున్నారని తెలిశాక నాకెంతో కంపరంగా వుండేది. నీలో నాకెలాంటి ఆకర్షణా, ప్రత్యేకతా కనిపించలేదు. నాకు యాక్సిడెంట్ జరిగాక మొదటిసారిగా తెలుసుకున్నాను నీవు మామూలు అమ్మాయివి కాదని. ఎవరో అన్నట్లు తమలోని గొప్పదనం బయట పడకుండా చూసుకోవడంలోనే వారి గొప్పదనం మరింత బయటపడ్తుంది. నీలో బయటికి కనిపించే మనిషి వేరు. నీ లోపలి మనిషి వేరు. నీలోని ప్రత్యేకతలు, ఆకర్షణలు బయట పడేకొద్దీ నేను పిచ్చిగా ఆకర్షితుణ్ణి అయాను. నీలో ఏమీ లేదని నిన్ను అసహ్యించుకున్న నన్ను, నీవు అభిమానించలేవని తెలుసుకోలేని మూర్ఖుణ్ణి.

ఏది ఏమైనా నీ నిర్ణయం ఎంతో సమంజసంగా వుంది. నిన్ను నిన్నుగా అభిమానించిన ఉన్నతుడు అన్నయ్య. మనింట్లో వాళ్ళు అనుకుంటున్నట్లుగా అన్నయ్య నీకు తగనివాడు కాదు. చదువు, సభ్యత, సంస్కారం మూర్తీభవించిన మనిషి అన్నయ్య. బహుశా నీకు తెలీదనుకుంటాను. ఆ రోజు—అంటే—అన్నయ్య, వదిన వెళ్లిన కారుకు యాక్సిడెంట్ జరిగిన రోజు, వదిన నిన్ను ఇంట్లోంచి వెళ్లగొట్టమనీ, ఇంట్లో నీవైనా, తానైనా ఒకరే వుండాలనీ అంది. అన్నయ్య ఏమన్నాడో తెలుసా?

"జయంతి నాకేమీ కాదు. నీవు నాకు అన్నీ. అయినా జయంతిని నేను ఇక్కడి నుండి పంపలేను. ఇక్కడ నుండి పంపిస్తే జయంతి బ్రతకలేదని కాదు. ఏమీ ఎరుగని అమాయకురాలిని నీ పంతంకోసం పంపేసి అవమానించేంత అవివేకిని కాను. న్యాయం ఎవరికైనా న్యాయమే."

వదిన వుగ్రురాలై పోయింది.

"అంటే ఆ పనిదానికి న్యాయం చేకూర్చటం కోసం కట్టుకున్న పెళ్లాన్ని కూడా వదులుకోగలరన్న మాట!" అంది.

"ఆ అమ్మాయి ఇక్కడవుంటే నీకు జరిగే అన్యాయమేమీ లేదుకదా? తిని కూర్చుని తోచక పంతాలకుపోయి ఎదుటివాళ్ళను ఇబ్బంది పెట్టే వాళ్ళు, పెళ్లామైనా, తల్లయినా అంతే" అన్నాడు అన్నయ్య.

ఇదంతా అనుకోకుండా నా చెవినిపడటం జరిగింది.

వదిన ఆగ్రహంతో వెంటనే బయలుదేరటం, యాక్సిడెంట్ జరగటం...

వదిన మరణానికి నీవు కారణమని కాదు. అందులో నీ బాధ్యత ఎంతమాత్రం లేదు. ఆమె కోపమే ఆమెను పామై కాటేసింది. అన్నయ్య ఔన్నత్యాన్ని గురించి చెప్పటమే నా ఉద్దేశం. అంతే.

జయంతీ, గీతద్వారా నీ ఉద్దేశం విన్నప్పుడు బాధ, ఆవేశం, ఉద్రేకం—ఓహ్— ఆ భావన మాటల్లో చెప్పలేను. ఇక నాకోరిక, నా బలీయమైన కోరిక తీ[illegible]కాశం లేదని తెలిసిన ఆ క్షణాన ఈ ప్రపంచాన్నే నాశనం చేయాలన్నంత కసి బయల్దేరింది. అయితే అది తాత్కాలికమే. కసి, ఆవేశం, వుద్రేకం, వుద్వేగం అన్నీ అణిగిపోయి బాధ నిలిచిపోయింది. ఆ బాధతోనే, దాన్ని అక్కడే వుండి భరించలేకే ఇక్కడికి వచ్చాను. నిజానికి చిత్రలేఖనంలో ఓనమాలు తప్ప గుణింతాలు కూడా నాకు రావు. అభిరుచి వుందిగానీ అభినివేశం లేదు. ఇలాంటి నేను శాంతి నికేతన్‌లో శిక్షణ పొందడమేమిటి! ఈ ప్రశాంత వాతావరణంలో, ఈ కళా నిలయంలో స్వాంతన పొందాలని మాత్రమే వచ్చాను. నిజంగానే ఇక్కడికి వచ్చాక క్రమంగా నా మనోరుగ్మత తగ్గిపోయింది. ఆవేశం చల్లబడి ఆలోచన చోటు చేసుకుంది.

నిజమే! నాకు కోరికలున్నట్లే నీకూ కోరికలుంటాయి. నేను నిన్ను కోరుకున్నట్లుగానే నీవూ మరెవరినో కోరుకోవచ్చు. ఆ హక్కు నీకుంది. నీదే. ఆ కోరుకున్న వ్యక్తి నా సోదరుడు కావడం, అతనికి నీలాంటి సద్గుణవతి భాగస్వామిని కావడం ... నిజంగా నాకెంతో తృప్తిగా వుంది. నేనిలా దూరంగా వుండడం పిరికితనమనీ, అవివేకమనీ అనిపించింది. నేను త్వరలోనే వస్తాను. అయితే ఈసారి నీకు నాలో క్రొత్త మనూ కనిపిస్తాడు. మాటిమాటికీ ఇలా అభిప్రాయాలు, అభిరుచులు మార్చుకునే వాళ్లంటే నీ కిష్టం వుండదు కదూ? కానీ జయంతీ, 'మార్పు'లో 'మంచి' కనిపిస్తే అది మంచి పద్ధతనే నా అభిప్రాయం.

నాలో ఈ మార్పు వచ్చాక చిత్రంగా చిత్రకళమీద ఆసక్తి కలిగింది. అందుకే మరో రెండు నెలలు ఇక్కడ వుండాలని నిశ్చయించుకున్నాను. ఆ తర్వాతే అక్కడికి వస్తాను.

మనూ.

నిర్వేదంగా నవ్వుకుంది జయంతి. కనీసం ఒక్కరైనా హరితో తన వివాహాన్ని సమర్థించినందుకు కొంత సంతోషం కూడా కలిగింది. ఒక్కక్షణం ఆ ఉత్తరాన్ని తీసికెళ్ళి అందరికీ చూపించి 'చూడండి. మనూ కూడా మా వివాహాన్ని ప్రోత్సహిస్తున్నాడు. నేను మనూ కాదన్నాడని హరి బావను పెళ్లాడాలనుకోవటం

జరిగిన కథ — 9 : గీతతో బజారుకెళ్లిన జయంతిని పద్మిని అవమానిస్తుంది. గీత బర్త్‌డే రోజు జయంతి పాడిన పాట విన్న సుమిత్రమ్మ జయంతిని సంగీతం మాస్టారు దగ్గర సంగీతం నేర్చుకోమని చెపుతుంది. జయంతి తనకిపుడు సంగీతంమీద ఆసక్తి లేదని చెపుతుంది. కారు యాక్సిడెంట్‌లో పద్మిని మరణిస్తుంది; హరికి కళ్లు పోతాయి. యాక్సిడెంటులో గాయాలయిన మన్‌మోహన్‌కు తన రక్తం ఇస్తుంది జయంతి. జయంతి వ్యక్తిత్వం మన్‌మోహన్‌ను ఆకర్షిస్తుంది. జయంతి హరి సేవలలో కాలం గడుపుతూ ఉంటుంది. గీతను చూడవచ్చిన పెళ్ళివారు వాళ్ల అబ్బాయికి జయంతి నచ్చినట్లు రఘునాధరావుకి ఉత్తరం రాస్తారు. జయంతి కథకు మొదటి బహుమతి వచ్చింది ఆమెను చూడను ఆమె అభిమానులు వచ్చారు. జ్వరం వచ్చి పడుకున్న జయంతిని మన్‌మోహన్ కిటికీలోంచి చూసాడు. మర్నాడు ఆ కిటికీ మూసి ఉండటం గమనిస్తాడు మన్‌మోహన్. జయంతి మన్‌మోహన్ ప్రేమను తిరస్కరిస్తుంది. జయంతి వివాహ ప్రసక్తి తెచ్చిన సుమిత్రమ్మతో తను హరి బావను పెళ్లి చేసుకుంటానని చెపుతుంది. ఆ వార్త విని జయంతిపై మండిపడతారు రఘునాధరావుగారు. రఘునాధరావు జయంతికి ఆమె చిన్ననాడు జరిగిన సంగతులు చెప్పి ఇప్పుడు తాము అనుభవిస్తున్న ఆస్తికి జయంతే వారసురాలు అని చెపుతారు. ఎవరెన్ని చెప్పినా జయంతి తన మనస్సును హరి ఆకర్షణనుంచి మరల్చలేకపోతుంది. ఆమె ఆ ఇంటిని వదిలి వెళ్లడానికి నిశ్చయించుకుంటుంది.

లేదు. నాకు హరి బావే కావాలి. అతని కోసం మనూను నేనే కాదన్నాను!' అంటూ గట్టిగా అరవాలనిపించింది. అంతలోనే విచక్షణ మేల్కొంది జయంతిలో.

ఈ ఉత్తరం అందరికీ చూపించినందువల్ల లాభమేమిటి !? మనూ మనసులోని పూర్వపు కోరిక తెలుస్తుంది. అతని భగ్న హృదయం తెలుస్తుంది. అతని ప్రస్థానం తెలుస్తుంది. ఇదంతా అందరికీ మరో రంపపు కోత అవుతుంది. పైగా తమ్ముడు మనసుపడిన పిల్లను ఆ పిల్ల మనసు తన మీద వున్నా ఆ అన్నగారు వివాహం చేసుకుంటారా ? కనీసం ఈ జన్మలో ఆ అవకాశం వుంటుందా ?

ఏ రకంగా చూసినా ఆ ఉత్తరం ఇతరులకు చూపడం సమంజసంగా కనిపించలేదు. పైగా తనకు హరిమీద ప్రేమ లేదని కాదు వాళ్ల అభిప్రాయం. తన గురించి. తన సుఖం గురించి. తన భవిష్యత్తు గురించి.

భారంగా నిట్టూర్చి చేతిలోని ఉత్తరాన్ని ముక్కలుగా చించి చెత్త బుట్టలో వేసింది జయంతి.

28

రంగా జయంతి సామాన్లు తీసికెళ్లి కార్లో పెట్టాడు. కారు స్టేషన్‌దాకానే. జయంతి తాను రైల్లో వెళ్తానని చెప్పినప్పుడు రఘునాథ రావుగారు ''కార్లో వెళ్ళు'' అని అనలేదు. కనీసం ''నేను దిగబెడ్తాను'' అనికూడా అనలేదు. జయంతి ఆయన ఆగ్రహానికి నవ్వుకుంది. తాను చాలా సామాన్యమైన ఆడపిల్ల. వీళ్ల ఆడంబరాల్ని వీళ్ల దగ్గరే మరచిపోయి సామాన్యంగా తన స్థానాన్ని చేరుకోవటం చాలా శ్రేయస్కరం. బహుశా తన వుద్దేశాన్ని మామయ్య అర్థం చేసుకుని వుండవచ్చు. లేదా ఆయన మాట వినలేదనే కోపం కావచ్చు. రెండోదే నిజమై వుంటుంది.


జయంతి పేరు పేరునా అందరికీ చెప్పి అందరిదగ్గరా శలవు తీసుకుంది.

రఘునాధరావుగారు, సుమిత్రమ్మ, హరి మౌనంగా వీడ్కోలిచ్చారు. నౌఖర్లు కళ్లొత్తుకున్నారు. గీత ''జయంతీ'' అంటూ భోరుమని జయంతిని అల్లుకుపోయింది. జయంతికి కన్నీరాగ లేదు.

''ఊర్కో గీతా వూర్కో. నన్ను నవ్వుతూ సాగనంపు గీతా ! ఇన్నాళ్లలా నువ్వు చిన్నపిల్లలా బాధ్యతారహితంగా పైపైన తిరుగాడితే లాభం లేదు. అత్తయ్య అనారోగ్యం మనిషి. నీవే అన్నీ...''

మళ్లీ భోరుమంది గీత.

''ఈ అప్పగింతలన్నీ ఎందుకు? నీవు మళ్లీ వస్తావు. నాకు తెలుసు. ఇక్కడెవరూ నీవు



లేకుండా బతకలేరు. నాన్నగారు తప్పకుండా మళ్లీ నిన్ను తీసుకొస్తారు'' అంది గీత.

జయంతి గీత చేతిని మృదువుగా నొక్కి వదిలేసింది.

అందరూ మౌనంగా పోర్టికోదాకా వచ్చారు, ఒక్క హరి తప్ప. హరిపైన బాల్కనీలో నిలబడి వున్నాడు. జయంతి ఒళ్లంతా చెవులు చేసుకుని వుంది. అత్తయ్యమీద, మామయ్యమీద ఆశలేదు. తనకుతెలుసు హరి...హరి...తను లేకుండా బ్రతకలేడు. తను లేకుండా ఒక్క అడుగు వేయలేడు. శారీరకంగానే కాదు మానసికంగా కూడా. అతని అంధత్వం ఆసరాతో తామిద్దరి మనసులు అతి సమీపంగా వచ్చాయి. కేవలం మనసుమీదే ఆధారపడి బ్రతుకుతోన్న హరి తన మనో సామీప్యం లేకుండా బ్రతకలేడు. అతని మనసు తనకు తెలుసు. కేవలం అతనిలోని సంస్కారం అతని కోరిక కద్దు పడ్తోంది. అతనిలోని ఔన్నత్యం ఒక ఆడపిల్ల బ్రతుకులో నిప్పులు పోయవద్దని ఘోష పెడ్తోంది. తనకు తెలుసు పళ్ల బిగువున తనను కాదన్నా తను బయలుదేరే చివరి క్షణంలోనైనా హరి తన నాపుతాడు. 'జయంతీ, నీవు లేకుండా నేనొక్కక్షణం బ్రతకలేను. నీవు లేని క్షణం నా కళ్లకే కాదు, నా మనసుకు కూడా అంధకారమే. నీ ప్రవేశంతో నా జీవిత ప్రాంగణంలో కోటి దీపాలు వెలిగించు. ఆగిపో జయంతీ, ఆగిపో.'' అని అంటాడు.

కానీ జయంతి ఆశ నిరాశే అయింది. హరి బాల్కనీలో నిలబెట్టిన శిలలా నిలబడ్డాడే తప్ప నోరు విప్పలేదు. తను బయలుదేరింది గుర్తించ లేదేమో అనే అనుమానంతో ''వెళ్ళొస్తాను గీతా వెళ్ళొస్తానత్తయ్యా'' అంటూ అవసరం లేనంత గట్టిగా చెప్పింది. అయినా హరి వులకలేదు, పలక లేదు.

జయంతి వెళ్ళి కార్లో కూర్చుంది.

డ్రైవర్ కారు స్టార్ట్ చేశాడు.

జయంతి ఆశగా పైకి చూసింది. డోర్ వేసిన శబ్దం, స్టార్ట్ చేసిన శబ్దం హరికి వినిపించ లేదంటే అతిశయోక్తే అవుతుంది.

ఈ రాగానికదే తాళం

కారు ముందు కురికింది.

కారు మెయిన్ గేట్ సమీపిస్తుండగా, ''డ్రైవర్, కారాపు'' అంది జయంతి.

కారు ఆగింది.

జయంతి వెనక్కుతిరిగి చూడలేదు. చెవులు నిక్కపొడుచుకుని మౌనంగా వుండిపోయింది.

''అమ్మాయిగారూ, ట్రైన్‌కు టైం అవుతోంది'' అన్నాడు డ్రైవర్.

గాఢంగా నిట్టూర్చింది జయంతి.

''పోనీ.''

29

బస్సు పూర్తిగా ఆగకముందే కిటికీలోంచి కనిపించిన సుబ్రమణ్యయ్యర్‌ను చూసి ముఖమంతా నవ్వు చేసుకుంది జయంతి. రైలు తర్వాత రెండు మూడు బస్సులు మారి ఆ ఊరికి వచ్చింది.

బస్సు దిగుతూ, తన చేతిలోని సామాను అందుకుంటూన్న అతనితో ''బాగున్నారా బాబాయ్ ?'' అంది తమిళంలో.

''బాగున్నానమ్మా. ప్రయాణం కులాసాగా జరిగిందా ?''

''ఆహా.''

ఆ వూళ్లో రిక్షాలు లేవు. కనిపించిన తెలిసిన వ్యక్తి నెత్తిన ట్రంకు పెట్టి, పరుపు చుట్ట పెట్టాడు సుబ్రమణ్యయర్.

ముగ్గురూ ఇంటిదారి పట్టారు.

ఈ మధ్య కాలంలోని ఒకరి విశేషాలు ఒకరి చెప్పుకుంటూ నడుస్తున్నారు.

''నీవు అక్కడికి వెళ్లినా ఏం మారలేదమ్మా'' అన్నాడు సుబ్రమణ్యయ్యర్.

''బాగుంది బాబాయ్. అక్కడికి వెళ్తే మారాలనేముంది !''

''మీ మామయ్యగారు శ్రీమంతులు కదా. ఆ వాతావరణం, ఆ ఆడంబరం నిన్ను కొంతైనా మార్చి వుంటుందనుకున్నాను.''

నవ్వి వూరుకుంది జయంతి.

''నీవు మళ్లీ ఇక్కడికి వస్తావని నేను అనుకోలేదు''

నవ్వుతూ అంది జయంతి ''నేను రావడం మీకు సంతోషంగా లేదా బాబాయ్ ?''

''అయ్యో! అలా అంటావేమిటమ్మ! నిన్ను చూసుకునే మేం బిడ్డలులేని లోటు మరచిపోయాం కదా ! మీ మామయ్యగారు అక్కడే నీకు వివాహం...''

ఆయన మాట పూర్తి చేయనివ్వకుండా అంది జయంతి ''నా ఉత్తరం అందిందో లేదో. మీరు బస్టాండుకు వస్తారో లేదో అని అనుమానంగా వుండింది.''

''అయ్యో! ఉత్తరం లక్షణంగా చేరింది. అది చేరాక ఎలా రాకుండా వుంటాను. నీవు మమ్మల్ని ఇంకా గుర్తు పెట్టుకున్నందుకు ఎంతో ఆనందపడిపోయాం.''

''ఎలా మరచిపోతాను బాబాయ్ ! ఒకవేళ మిమ్మల్ని మర్చిపోయినా పిన్ని ఇడ్లీ, సాంబర్ మర్చిపోతానా !'' అంటూ నవ్వేసింది జయంతి.

''మీ పిన్ని ఈ రోజు నీకోసం ఇడ్లీ, సాంబర్ చేసేసింది అప్పుడే.''

మాటల్లోనే గమ్యం చేరుకున్నారు.

విశాలమైన ఆవరణలోకి సుబ్రమణ్యయ్యర్‌ను అనుసరించి వచ్చిన జయంతి ఆశ్చర్యపోతూ అడిగింది – ''అదేమిటి ! ఈ ఇల్లు మీరింకా ఎవరికీ అద్దెకు ఇవ్వలేదా !?''

''ఇచ్చాం. నీవొస్తున్నావని తెలిసి మళ్లీ ఖాళీ చేయించాము.''

గిరుక్కున అతని కేసి తిరిగింది జయంతి.

''ఏమిటి ! నా కోసమా !''

''ఔను. నీకోసమే. ముందున్న వాళ్లకు వేరే ఇల్లు చూపించాము.''

''అదేమిటి బాబాయ్ ! ఇంత ఇల్లు నేనేం చేసుకుంటాను ? అప్పుడంటే నాన్నగారు ... '' జయంతి కంఠం దుఃఖంతో పూడుకుపోయింది.

అంతలో ''జయంతీ'' అంటూ ఓ స్థూలకాయురాలు వచ్చి జయంతిని అమాంతం వాటేసుకుంది.

జయంతి దుఃఖం కాస్తా సంభ్రమంగా మారిపోయింది. ''పిన్నీ'' అంటూ పసిపిల్లలా ఆ స్త్రీని అల్లుకుపోయింది.

''అయ్యో ! బిడ్డ ఎంత చిక్కిపోయింది !'' అందావిడ జయంతి దేహాన్ని ఆప్యాయంగా తడుముతూ.


''వాళ్ల పిన్నిగారి ఇడ్లీ సాంబార్ అక్కడ దొరకదట'' అన్నాడు సుబ్రమణ్యయ్యర్, కొంటెగా.

అతని మాటల్లోని శ్లేష అర్థంకాని ఆవిడ ''ఇకమీద నేను రోజూ చేసి పెడ్తానుగా'' అంది, సంబరంగా.



ధర్మపథం

—బులుసు వేంకటరమణయ్య



ప్రసాద దూషణ.

భగవంతుడు ఏ రూపంలో ఉన్నా మనం భక్తితో సేవిస్తాం. ఆ విధంగానే భగవన్నివేదితమైన ప్రసాదాన్ని మనం తిరస్కరించకుండా స్వీకరించాలి. కొన్ని పూజల్లోనూ, వ్రతాలలోనూ ప్రసాదానికి ప్రాధాన్యం ఉంటుంది. సత్యనారాయణ వ్రతంలో ప్రసాదం అతిముఖ్యంగా భావించబడడం అందరికీ తెలుసు. పురుషోత్తమ క్షేత్రంలో— అంటే శ్రీ జగన్నాథంలో దేవునికంటే ప్రసాదమే ముఖ్యం. "నన్ను దూషించినా సమ్మతిస్తానుకాని, నా ప్రసాదాన్ని తిరస్కరిస్తే సహించ"నని జగన్నాథస్వామి అన్నాడట! ఎంతో నిష్ఠా నియమాలున్న వారైనాసరే, జగన్నాథునికి నివేదన అయిన మిఠాయిలనే కాకుండా అన్నం కూడా ఆదరంతో స్వీకరిస్తారు. దాన్ని తిరస్కరిస్తే తమకు అపాయం కలుగుతుందనే విశ్వాసం! అలాంటి సంఘటనను ఒకదాన్ని వినండి!

గత శతాబ్ది చరమభాగంలో ఆంధ్రులు, గొప్ప మంత్రశాస్త్రవేత్త, శాపానుగ్రహ సమర్థులు సర్వమంగళేశ్వరశాస్త్రిగారు ఉండేవారు. ఎవ్వరినీ లక్ష్యపెట్టని స్వభావం ఆయనది. ఒకప్పుడాయన శ్రీ జగన్నాథం వెళ్లి దేవ దర్శనం చేసుకుని దేవాలయ ఆవరణలోనే ఒకచోట స్వామి ప్రసాదాన్ని ఆరగిస్తూ ఉండగా, మహాపండితుడైన ఆయనను చూడడానికి ఉత్కళపండితులు కొందరు వచ్చారు. శాస్త్రిగారు మరి ఆకులో ప్రసాదం పెట్టుకొని తినడం చూచి వారు "మహావిష్ణువు శయనమైన వటపత్రాన్ని ఉచ్ఛిష్టం చెయ్యడం మీవంటి వారికి తగునా?" అని ఆక్షేపించారు. "మీరు దేవుడి అవతారాలనే మింగివేస్తున్నారే! అది తప్పులేదుగాని ఇదా తప్పు?" అని ఎదురు ప్రశ్నవేశారు. మత్స్య భుక్కులయిన ఆ విద్వాంసులు కోపించి "ఆ మత్స్య భుక్కులు వండిన పదార్థాలు, ప్రసాదాలూ మీరు తింటున్నారు గదా!" అని అన్నారు. శాస్త్రిగారు తొందరపడి "ఇదిగో! ఆ ప్రసాదాన్ని పారవేస్తున్నాను" అని తాను తింటూ ఉన్న ప్రసాదాన్ని పారవేశారు. దానిని తిరస్కరించడం వల్ల ఆయనకు కన్నులు కానరాకుండాపోయాయి! ఉత్కళపండితులు తృప్తిపడి నవ్వారు. శాస్త్రిగారు సూర్య దేవతాకమైన "ఓం ఘృణిః సూర్య ఆదిత్యః" అనే మంత్రంలోని తొలి అక్షరాలతో ప్రారంభించి వెంటనే ఆర్యా వృత్తాలు తొమ్మిది రచించి, సూర్యదేవుని అనుగ్రహం వల్ల తిరిగి దృష్టివచ్చి తన బసకు వెళ్లిపోయారు. ఈ విషయం ఏభై ఏళ్ల కిందట శతవృద్ధులైన శాస్త్రిగారి మనుమనివల్ల — తెలిసింది.

ప్రసాద దూషణ తగదని మనం గ్రహించాలి. ★

జయంతి, సుబ్రమణ్యయ్యార్ ఆవిడ చూడకుండా ఒకరిని చూసి ఒకరు నవ్వుకున్నారు.

"రారా స్నానంచేసి ఇడ్లీ సాంబార్ తిందువుగాని" అంటూ ఆ ఇంటికి వెనకవైపున వున్న తన ఇంట్లోకి లాక్కువెళ్లింది సరస్వతి, సుబ్రమణ్యయ్యార్ భార్య.

స్నానం, ఫలహారం ముగించుకుని జయంతి ఇంటి భాగంలోకి వచ్చారు జయంతి, సుబ్రమ్మణ్యయ్యార్.

చాలా పెద్ద కాంపౌండ్. ముఖ్య భాగం రెండు గదుల పెంకుటిల్లు. అందులోనే శివరావు, కూతురు జయంతితో కాపురం వుండేవాడు. మిగిలిన విశాలమైన ఆవరణలో పర్ణశాలలాంటి పాకలు వేసుకుని చిన్న పాఠశాల నడిపాడు. జయంతికి ఆ పాకల్ని చూస్తుంటే గుండెలు బరువెక్కాయి.

తండ్రి గురుకులంలా నడిపాడు పాఠశాలని. ఆ క్రమశిక్షణ, ఆ బాధ్యతాయుత బోధన ఆ చుట్టుపక్కల ఆయన గౌరవాన్ని కీర్తిని పెంచాయి. చుట్టూ గౌరవాదరాలు, కీర్తి ప్రతిష్టలు, అభిమానులు వున్నా ఆయన వేటినీ అంటనట్లుగా తన పరిధిలో సాదు జీవనం గడిపారు. ఋషిలాంటి తండ్రి సంరక్షణలో తనెంతో ప్రశాంతంగా, ముని వాటికలోని లేడి కూనలా పెరిగింది. ప్రశాంతమైన ఏకాంత సుందర దీవిని చుట్టుముట్టిన పెను తుఫానులా తన జీవితంలో ఓ పెద్ద అల్లకల్లోలం!!! తండ్రి మరణం, మామయ్యతో ప్రయాణం, అవమానాలు, తర్వాత అభిమానాలు, క్రమంగా పెంచుకున్న ఆశలు అనుబంధాలు... నాని పక్కనే నిరాకరణలు, నిరాశలు, నిర్వేదాలు!

మళ్లీ ఈ ఏకాంత ప్రశాంత దీవిలో...

కానీ వెనకటి జయంతేనా తను? తుఫాను తగ్గిపోయినా దాని ఛాయలు మిగిలిపోతాయి కొంత కాలం. తన జీవితంలోని ఈ తుఫాను ఛాయలు తాత్కాలికమేనా? శాశ్వతమా? కాలమే చెప్పాలి.

"మొన్న ఖాళీచేసిన వాళ్లు ఈ పాకల్లో బర్రెలు, ఆవులు వుంచేవాళ్లు. పూవు అమ్మిన చోట కట్టె అమ్మినట్టు మీనాన్న ఆలయంలా నడిపిన ఈ పాఠశాల గదుల్లో గొడ్లు పొర్లుతూంటే ఎంతో బాధనిపించినా విధిలేకపోయింది. మరో సాంబ (శివరావు) దొరకడు కదా! డబ్బు కోసం ఇవ్వక తప్పలేదు" బాధగా అన్నాడు సుబ్రమణ్యయ్యార్.

ఇద్దరూ పెంకుటింటికేసి నడిచారు.

ఇంటిముందున్న చిన్న వరండాలో కూర్చున్న ఓ పదిహేనేళ్ల కుర్రాడు లేచి నిలబడి నమస్కరించాడు. లోపల ఓ నడివయసు స్త్రీ వంట చేస్తోంది.

' ఈమె లక్ష్మీదేవమ్మ అనీ..." అంటూ ఆపేశాడు సుబ్రమణ్యయ్యార్.

ఆమె బట్టలు ముతకగానే వున్నా మనిషి శుభ్రంగా, గౌరవం కలిగించేలా ప్రసన్నంగా ఉంది. జయంతి అప్రయత్నంగా నమస్కారం చేసింది.

ఆమె జయంతి తలమీద చేయివేసి "నాకు నమస్కారం చేయట మేమిటమ్మా!" అంది.

"నీవు కాసేపు విశ్రాంతి తీసుకో. త్వరగా వంట ముగించి వడ్డిస్తాను" అంది ఆవిడే.

జయంతి కొంచెం అయోమయంగా చూసింది.

"రామ్మా" అంటూ మళ్ళీ బయటకు దారి తీశాడు సుబ్రమణ్యయ్యార్.

ఇందాకటి కుర్రాడు మళ్ళీ లేచి నిలబడ్డాడు.

"ఈ కుర్రాడెవరు?" అడిగింది జయంతి.

"నౌకరు కుర్రాడు"

ఆశ్చర్యపోయింది జయంతి.

నౌఖర్లను పెట్టుకునే అలవాటు బాబాయ్‌కి లేదు. మామి అసలే ఒప్పుకోదు. మరి!?

ముందుకు వెళ్తున్న సుబ్రమణ్యయ్యార్‌ని గబగబ వెళ్ళి కలుసుకుంది జయంతి.

(ఇంకా వుంది)

సమస్త ప్రాణికోటి అంతర ప్రకృతి ఒకటేనా?

ప్రకృతిలో జీవి ఆవిర్భవించిన తీరు ఎంతో రసవత్తరంగా ఉంటుంది. కాస్మోస్ ఏర్పడిన విధము, భూమి రూపొందిన పద్ధతి — అంతా కూడ ఎంతో ఆసక్తికరంగా ఉంటుంది. ప్రకృతి వరప్రసాదాలైన జీవధాతువులనుంచే ప్రాణం పుట్టుకొచ్చింది. జీవకణం నుంచి సకల వృక్షజంతు జీవరాశులూ ఈ సృష్టిలో రూపకల్పన చేసుకొన్నాయి. మూలకందం ఒకటే కావడం వల్ల జీవజాతుల మధ్య ఎంతో వైవిధ్యమున్నప్పటికీ, అంతర్లీనంగా అనుసంధానించే అనుబంధం కూడ ఉంటుంది. అది జన్యుపరమైన అనుభావన అని పరిశోధనలు వెల్లడి చేస్తున్నాయి. అమీబా నుంచి పరిణమించి పరిణమించి ఆడమ్, మేడమ్‌లు రూపొందారని పరిణామవాదులు అంటారు. ఈ వాదాన్ని బలపరచే ఎన్నో సాక్ష్యాధారాలున్నాయి.

డార్విన్ ప్రకృతివరణ సిద్ధాంతంలో నరుని మూలపురుషునిగా వానరుని గుర్తించాడు. ఆనాడెంతగానో డార్విన్ వాదాన్ని ప్రతిఘటించినా నేడు విశ్వవ్యాప్తంగా అదే వాదానికి మహామహా మేధావుల నివాళి లభ్యమవుతోంది. జీవులలోని వైవిధ్యం కాలక్రమేణా ప్రత్యేక జాతుల ఉద్భవానికి మూలకారణమౌతుందన్నది డార్విన్ సూత్రము. ఈ వైవిధ్యం ప్రకృతిలో కలిగే మార్పులవల్ల ఏర్పడుతుందని భావన. ఒక్కోమారు యాదృచ్ఛికమైన ఉత్పరివర్తనాల వల్ల కూడ వైవిధ్యం తారాస్థాయికి చేరుకొని క్రొత్త జాతి పుట్టుకొని రావచ్చు. ఇలాంటి చర్య ద్వారానే చింపాంజీ నుంచి మానవుడు పుట్టుకొని వచ్చాడని డార్విన్ ఘంటాపథంగా చెప్పాడు. ప్రస్తుతం లభ్యమౌతున్న ఆధారాలను దృష్టిలో పెట్టుకొని చూస్తే డార్విన్ చెప్పింది సబబేనని తోస్తుంది.

తమాషా ఏమిటంటే జీవప్రవృత్తిని బాగా అధ్యయనం చేస్తే జంతువుకూ మనిషికీ పెద్ద భేదం కనిపించదు. ఆకలి, దప్పిక, నిద్ర, కామ వాంఛ ఇత్యాది లక్షణాలన్నీ జంతువులకు మనుష్యులకు సమంగానే ఉంటాయి. అయితే భావపరంగా అదీ భాషాశక్తివల్ల మానవుడు అత్యున్నతస్థాయికి చేరుకొన్నాడని చెప్పవచ్చు. అంటే మాట్లాడే ఏకైక జంతువు మనిషని చెప్పకోవచ్చు. కాని చిలుక మాటలాడుతుంది. ఇటీవల ఒక ఏనుగు మాట్లాడి సంచలనాన్ని సృష్టించిన సంగతి అందరికీ తెలిసిందే. మూడు సంవత్సరాల ప్రాయమున్న చింపాంజీలకు పరీక్షలు పెడితే అవి స్పష్టంగా డెబ్బై రకాల సైగలను, సంకేతాలను ప్రదర్శించి శభాష్ అనిపించుకొన్నాయి. దీన్నిబట్టి చూస్తే మనిషిమల్లే జంతువులో కూడ భావ



మనిషికేమాత్రం తీసిపోని స్థాయిలో మనిషిననుకరిస్తున్న వానరం! అంతర్లీనమైన జన్యుసంబంధం మనిషికి, ఈ కోతికి ఉండవచ్చునేమో కాని అంతర్‌ప్రకృతిమాత్రం ఒకేలా ఉండే అవకాశం లేదు!
(రవి చిత్రవారి "శ్రీరామబంటు" చిత్రానికి సంబంధించినదీ ఫొటో. వారికి కృతజ్ఞతలు)

సంస్కారం ఉండే అవకాశం ఉందని విదితమవుతుంది.

మనిషిని జంతువు ఎంతగా అనుకరించినా మనిషిస్థాయిని జంతువు చేరుకొనే ప్రసక్తి ఉండదు. అత్యంత శక్తివంతమైన నాడీమండలం మనిషి ఆలోచనను వివేచనను విచక్షణను అత్యద్భుతంగా పెంచివేసింది. ఈ లక్షణం జంతువుకు లేదని చెప్పడం అశాస్త్రీయం. అయితే మనిషి హోదాను పొందగలిగే స్థితి మాత్రం జంతువుకు లేదని చెప్పకోవచ్చు. కొన్ని వందలవేల ఏళ్ల తరువాత పుట్టుకొచ్చే మనిషి స్థితి, నేటి మనిషి స్థితికన్నా భిన్నంగా ఉండవచ్చు. అందులో ఆశ్చర్యం లేదు. అయితే మనిషి మనిషికి మధ్య నుండే భేదం భావపరంగా నాడీవ్యవస్థకు అందనిది. ఈ సంస్కారానికి కారణం ఇదమిత్థంగా తెలియడం లేదు. జన్మాంతర పుణ్యమని అనుకొంటే అది అధిభౌతిక దృక్పథమవుతుంది కదా! అట్లా అని శాస్త్రం గిరిగీచి నట్లు సమాధాం చెప్పలేకుంది.

ఒకటి మాత్రం నిజం. మనిషి లక్షణాలతో పూర్తిగా ఏకీభవించేస్థాయిలో జంతువున్నా, దాని అంతరప్రకృతికుండే వికాసాన్ని బట్టి వివేచించగలిగే సామర్థ్యం ఆధారపడి ఉంటుందని చెప్పవచ్చు. అంటే జీవకోటి మొత్తం అంతరప్రకృతి స్థితి ఒక్కటే కాదని తెలుస్తుంది. ★

— డా॥ గుమ్మమారు రమేష్‌బాబు



గురు దక్షిణ

— నవీన సాహితి బాష

'ముగ్గుబుట్ట' లాంటి తల—ముడుతలు పడ్డ నుదురు — 'వెండితీగ'ల్లా మెరుస్తూ కనుబొమలు—కళ్ళను రెండింతలు చేసి చూపించే మందమయిన చత్వారం కళ్ళద్దాలు — పాలిపోయిన చెక్కిళ్ళ లోగుంటల్లో నిలిచిన చెమట-వార్ధక్యం బరువుకు వంగిపోయిన వెన్ను—శరీరాన్నంతా కుదిపేసే ఉబ్బసం తాలూకు దగ్గు—ఆయాసం—నీరసం—కాళ్ళు కదలని స్థితి—చెమటను సైతం తుడుచుకోజాలని అశక్తతో

కూడిన బలహీనమయిన చేతులు—మనసులో ఆవేదన — మెదడులో ఆందోళన — ఒళ్ళంతా నిస్సహాయ ఆవేశం—వీటన్నిటి మధ్యన సజీవంగా—పుష్టిగా—దండిగా మాత్రం—ఓ ఆశ! అదే... ఏ రోజుకారోజు 'పింఛన్' అందుతుంది, ప్రభుత్వం నుండి రావలసిన బకాయి తాలూకు డబ్బు వస్తుందనేదే —

బాగా మాసిపోయిన పొడుగు చేతుల చొక్కా, అంతేవాసి పంచె, పూర్వకాలపు వాసనగా చొక్కాపై గుండీల్లేని చిరుగుల నల్లకోటు, కోటు జేబులో కనిపిస్తూ కాగితాలకట్ట, ఓ పెన్ను, 'స్ట్రైప్స్' తెగిపోగా పురికొసతో ముడి వేసి నిలిపిన బాగా అరిగిపోయిన రంగు వెలిసిన పాత స్లిప్పర్లు, ఓ చేతిలో చిరుగుల కోటును 'డామినేట్' చేస్తూ, ఆకారాన్నిబట్టి మాత్రమే అనుకునేందుకు వీలుగా ఓ గొడుగు—ఇవీ ఆ ఆశాజీవిని గుర్తించేందుకు ఆనవాళ్ళు. ఇంతకూ ఈ ఆశాజీవి ఓ రిటైర్డైన బడి పంతులు... అందునా తెలుగు పండితుడు. 'పరమాణు' వంత సైజు కొంపలో ఎప్పుడూ, విచ్ఛేదన కాస్కారం కల్పించే దరిద్రం — ఆ ఇంట్లో ఎప్పుడూ తిట్లు, తగాదాల ప్రేలుళ్ళే... అయినా మొండిగా బ్రతుకుతూ...జీవచ్ఛవాల్లా ...ఆ కొంపలో మాస్టారుపై ఆధారపడి ఓ ఆరు జీవాలు...భార్యను మినహాయించగా — మిగిలిన ఐదుగురూ ఆడపిల్లలే. ఈ ఐదుగురూ పెద్ద మనుషులై కూర్చునుండి పోయారు ఇంట్లోనే. 'పింఛన్', పూర్వం తనకు ప్రభుత్వపరంగా రావలసిన డబ్బులు అందితే— ముందుగా పెద్ద మ్మాయి పెళ్ళి చేసెయ్యాలని మాస్టారి ఆశ... మంచైనా, చెడైనా తొందరగా జరిగిపోతేనే మంచిది ఈ కాలంలో... ఇదే మాస్టారి తపన.

ఆఫీసు వరండాలో బెంచీమీద చతికిల బడ్డారు మాస్టారు. విద్యాశాఖాధికారి గదిముందు, స్టూలుపై గుర్రుపెట్టి నిద్రపోతున్న ప్యూన్ రంగయ్య ఆఫీసరుగారు బెల్లును మ్రోగించడం తోనే ఉలిక్కిపడి లేచి, బెంచీవంక చూశాడు. మాస్టారు! ప్రతిరోజు మాదిరిగానే, ప్రతిరోజూ వచ్చే సమయానికే వచ్చి కూర్చునున్నారు. రంగయ్య మాస్టారి దగ్గిరగావెళ్ళి, ఓ చెవినిటు పారేయమని "మాస్టారుకు సైగచేసి" 'కొత్తాఫీసర్గా లొచ్చి'న వార్తను చెప్పాడు. దాంతో మాస్టారుగారి కళ్ళల్లో కొత్తవెలుగు... రెక్కలు కట్టుకొని సరికొత్త ఆశ. ఈ కొత్తాయనైనా తన పింఛన్ను తొందరగా ఇప్పిస్తాడేమోనని. వెంటనే గది ముందుకు దూసు కొచ్చేశారు. నరాల్లో కొత్త రక్తం... కళ్ళల్లో కొత్త కాంతి... గట్టి హామీ దొరికినట్లు తృప్తి... తహ తహ... తొందరపాటు... ఇవన్నీ కలిసి మాస్టారుగార్ని ఎపుడెపుడు ఆఫీసరు గదిలో కెళ్దామా అన్నట్లుగా అలజడిని రేకెత్తిస్తున్నాయి. కాని... "కాళ్ళకు బంధం"లా రంగయ్య లేడా సమయంలో. లోపలున్నాడు. వాడు బయటి కొచ్చి తనను 'అయ్యగారు రమ్మంటున్నారంటే' గాని తను లోపలికెళ్ళడానికి వీల్లేదు. ఇంతలో రంగయ్య వచ్చాడు."

"లోపలి కెళ్ళండంటూ" సైగ చేశాడు.

మాస్టారు లోపలి కడుగుపెట్టారు—తలెత్తి చూశారు ఆశ్చర్యం! ఎదురుగ్గా... దేవుడిలా.. తన శిష్యుడు... ఆనందరావు .. సందేహంలేదు.. నిజంగా ఆనందరావే... మాస్టారు పట్టరాని సంతోషంతో ఉక్కిరిబిక్కిరవుతూ దేవుడు వరమిచ్చేందుకు ప్రత్యక్షమయిన క్షణం, భక్తుడు పులకరించి పోతున్నట్లుగా నిలువెల్లా పులకరించి పోసాగారు.

* * *

ఆనందరావు మాస్టార్ని చూడటంతోనే ఒక్కసారిగా కుర్చీలోంచి లేచి గబ గబా పరిగెత్తుక వచ్చి మాస్టారి కాళ్ళకు వంగి నమస్కరిస్తూ "మాస్టారూ! ఎన్నాళ్ళకెన్నాళ్ళకు మాస్టారూ ఇది నా అదృష్టం మాస్టారూ! ఇది, నా పాలిటి అపురూపమయిన వరం మాస్టారూ! ఇంకా నిలబడే ఉన్నారా! అయ్యో య్యో! క్షమించండి మాస్టారూ! ఇంతసేపూ మిమ్మల్ని నిల్చోబెట్టే మాట్లాడాను. రండి... రండి... అటు కాదు... ఇటు... నా సీట్లో కూర్చోండి! ఈ సీటు నాది కాదు మీది మాస్టారూ! ఇది మీరు పెట్టిన విద్యాభిక్ష ఫలితమే మాస్టారూ! ఇది మీ చలవే మాస్టారూ! మీ పని నేను చేయకపోవడమేమిటి మాస్టారూ! అసలు మీ శిష్యపరమాణువు కింతటి సువర్ణవ కాశం లభ్యం కావడమే నిజంగా పూర్వజన్మ సుకృతం మాస్టారూ! చెప్పండి మాస్టారూ! చెప్పండి" మాస్టారి రెండు చేతుల్ని తన చేతుల్లోకి తీసుకొని, వినయంగా ఎంతో సౌమ్యంగా కుదిపి కుదిపి మరీ అడుగుతున్నాడు ఆనందరావు.

* * *


మాస్టారికి, అప్పటిగ్గాని స్పృహ రాలేదు. ఇంతసేపూ శిష్యుని ఆదరాభిమానాలకు ముగ్ధులై తనలోతనే ఉప్పొంగిపోతున్న మాస్టారు తలెత్తి చూశారు. ఎదురుగా నిలబడిలేడు ఆనందరావు. తన చేతులు ఆనందరావు చేతుల్లో లేవు. ఆనంద రావు తన సీట్లోనే కూర్చొని సిగార్ కాలుస్తూ పొగను వదులుతూ 'సీలింగ్ ఫాన్' వంకే చూస్తున్నాడు అయితే ఇదంతా భ్రమేనా? ఇంతసేపూ జరిగింది తనాశించి, ఊహించుకున్న దేనా? ఇదంతా నిజంకాదా? కల చెదిరిపోయి నట్లుయింది మాస్టారి పరిస్థితి ఆనందరావు... తన శిష్యుడు ఆనందరావు . . తన ఉనికినే గమనించలేదింతసేపూను: అయితే తనింతసేపూ ఆనందరావు ఎదురుగా 'జడ్జీముందు దోషి'లా తలవంచుకు నిలబడే ఉన్నాడన్నమాట? ఆనంద రావు కనీసం, తనవంక చూడనైనా చూడలేదు. కాని తనే.. ఎంత ఆఫీసర్ హోదాలో వున్నా, శిష్యుడేకదా అనుకొని అతన్నుండి తనకు లభించే ఆదరణను ఊహించుకోవడంతో, అది నిజమని భ్రమించేంతగా రక్తికట్టి తననింతసేపూ ఆనంద రావు ఎదురుగా మూగగా నిలబెట్టింది.

మాస్టారు దగ్గారు. అప్పటిగ్గాని ఆనంద రావు...కాదు కాదు...ఆఫీసర్ ఆనందరావుగారు తలెత్తి చూడలేకపోయారు, గురువుగారి వంక... గురువుగారనే సంగతైనా మరిచిపోయి, కనీస మర్యాదనైనా పాటించకుండా సంస్కార హీనంగా...అదీ స్వీకార వైఖరితో అసహ నంగా...అంటీ అంటనట్లుగా అన్నట్లు చూసీ చూడనట్లుగా చూశాడు మాస్టారివంక ఆనంద రావు. వ్యక్తి విలువను బట్టి, ఆ వ్యక్తి వంక

ఇటీవల కడపలో జరిగిన కడపజిల్లా తంతితపాలా క్రీడా సాంస్కృతికోత్సవాలలో శాస్త్రీయ నృత్యంలో (జూనియర్స్ విభాగంలో) కడపజిల్లా కలెక్టర్ శ్రీ భట్టాచార్యనుండి ప్రథమ బహుమతి అందుకున్న కుమారి ఉమామహేశ్వరి శిష్యురాలు బేబీ పవన పద్మాఠాకూర్.



ఇవేమన పద్యాలు



కూటికి వగలేక కూర్చున్న వారికి
అడుదానిమీద వాశగలదె
అన్న మదమువలన నఖిల మదంబులు
విశ్వదాభిరామ వినుర వేమ.

గురుదక్షిణ

చూసే చూపుకు ఓ ప్రమాణాన్ని నిర్ణయించుకున్నవాడు ఆనందరావు.

మాస్టారే రెండు చేతులూ జోడించి ''నమస్కారం సార్ !'' అన్నారు.

ప్రతి నమస్కారమయినా చేయకుండా, 'ఆఁ...ఏవిటండీ ?'' ప్రశ్నించాడు. తనకవతల ఏదో అర్జంటు పనున్నట్లుగా ఆనందరావు.

మాస్టారు మ్రాన్పడిపోయారు. 'ఎంతో ఎత్తునుండి పడిపోయినట్లు'గా ఉంది మాస్టారి పని. చేజిక్కిన అదృష్టం జారిపోయినట్లయింది. మాస్టారుగా కాకపోయినా, ఓ వృద్ధుడిగానయినా భావించకుండా 'కూర్చోండి' అనే కనీస మర్యాదనైనా పాటించలేదు ఆనందరావు. కాలం ఎంత

విచిత్రమైనది ? మనుషుల్ని అది ఎంతగా మారుస్తుందో చెప్పలేంకదా ? ఇలా ఆలోచిస్తున్న మాస్టారిని—

''ఏఁవిటండీ ! బెల్లంకొట్టిన రాయికిమల్లె నిల్చుండిపోయారు ? ఏమీ మాట్లాడరేం ?'' గద్దించాడు ఆనందరావు.

ఉలిక్కిపడ్డారు మాస్టారు, మాటలు తడబడుతున్నాయి. నా పిం...నా పించ... పించన్ బాబూ ! అలాగే...నా బ... నా బ...నా బకాయి తాలూకుపైకం...''వణుకుతూ గద్గదికస్వరంతో తెలవిచ్చారు మాస్టారు.

''పింఛన్ గొడవా ! సరె! సరే! నే నీరోజునే 'జాయిన్' అయినాను. కొత్త 'అప్లికేషన్' ఇచ్చి, ఓ నెలాగిన తర్వాత రండి. అన్ని ఫైళ్ళతో పాటు మీ 'ఫైలూ' పరిశీలిస్తాను'' చకచకా చెప్పేసి, లేచి మాస్టార్ని రాసుకుంటూ బయటి కెళ్ళిపోయాడు ఆనందరావు.

మాస్టారి పరిస్థితి మళ్ళీమొదటికే వచ్చింది. భయం. భయం...బెంగ. బెంగ...బ్రతుకు భయం మాస్టారు స్పృహతప్పి పడిపోయారు. రంగయ్య పరుగునవచ్చి ఇన్ని నీళ్ళు మాస్టారిముఖాన చల్లి, కండువాతో ముఖం తుడిచి, కాఫీ తాగించి, కూర్చోపెట్టాడు. స్పృహలో కొచ్చిన మాస్టారు చుట్టూ చూశారు. తను బయట వరండాలో... బెంచీమీద ఉన్నట్లుగా గమనించారు. ఎదురుగ్గా రంగయ్య ! మాస్టారివంక బాధగా, భక్తిగా చూస్తూ...మాస్టారు పెదవి విప్పారు.

''రంగయ్యా ! నా పరిస్థితి మళ్ళీ మొదటికే వచ్చేసిందయ్యా ! ఈ డబ్బు చేతికందకుంటే బిడ్డ పీటలమీద పెళ్ళి ఆగిపోతుంది !'' గద్గదికంగా అంటున్న మాస్టారి కళ్ళల్లో నీళ్ళు గిర్రున తిరిగాయి.

రంగయ్య చలించిపోయాడు. అతనిలో కదలిక ...

ఇంతలో రంగయ్య కుమారుడు మధుబాబు అటుగా వచ్చి మాస్టార్ని చూసి, ఆశ్చర్యపోయి — ''ఏఁవిటి మాస్టారూ ? మీరిక్కడ ! ఇలా !'' అంటూ తండ్రి వంక తిరిగి ''ఏఁవిటి నాన్నా ! మాస్టారీ ఊళ్ళోనే ఉన్నారని, నాకు చెప్పనేలేదు'' అడిగాడు.

''ముసలితనఁ వచ్చేసింది కదా బాబూ ! మరిచిపోయాను'' సమాధానమిచ్చాడు రంగయ్య కొడుక్కి.

మధుబాబు వంగి మాస్టారి పాదాలకు నమస్కరించాడు. ఆ తర్వాత మాస్టార్ని తమ ఇంటికి తీసుకెళ్ళారు తండ్రీకొడుకులు. మాస్టారి ద్వారా, తండ్రి ద్వారా జరిగిన విషయమంతా గ్రహించాడు మధుబాబు.

ఆనందరావు మధుబాబు క్లాస్‌మేట్స్. ఇద్దరూ మాస్టారుగారి దగ్గర చదువుకున్నవాళ్ళే. మధుబాబు 'డ్యూటీ'లో 'జాయిన్' అయిన రోజున క్లాస్‌మేటే ఆఫీసర్ అని మురిసిపోయాడు. కాని మధుబాబుకూ ఆనందరావు ద్వారా మాస్టారిగారికి జరిగిన పరాభవమే జరిగింది. తను క్లార్కు, ఆనందరావు ఆఫీసర్ అనే విషయాన్ని గుర్తించుకొని మరీ మెసలసాగాడు మధుబాబు.

వారం రోజుల్లోనే మాస్టారమ్మాయిని కానీ కట్నం తీసుకోకుండా పెళ్ళి చేసుకున్నాడు మధుబాబు.

''హే భగవాన్ ! ఆనందరావును మంచి మనిషిగా మార్చు, మధుబాబుకు సదా శుభం చేకూర్చు'' అని ప్రార్థిస్తూ తృప్తిగా కన్ను మూశారు మాస్టారు. ★


ప్రవేశపెడుతున్నాం
జై కిసాన్
సామ్రాట్
18:46:0
JAI KISAAN
SAMRAT
18 : 46 : 0
GRS 40.4KG NET 40KG
ZUARI AGRO CHEMICALS LTD
GOA
మీ పంటలను ఉవ్వెత్తున పెరిగేటట్లు
చేసేందుకు అత్యధిక ఫాస్ఫేట్ గలది.
* 18% నత్రజని, 46% ఫాస్ఫేట్ (డీఏపీ)
జోరుగా, తొందరగా పెంచగల బలవర్ధకమైన
సంకీర్ణ రసాయనిక ఎరువు.
* వరి, చెరకు, ప్రత్తి, నూనె గింజలు,
పప్పు ధాన్యాల్లాంటి పంటలు బాగా ఏపుగా పెరగటంకోసం,
అధికంగావున్న ఫాస్ఫేట్ తోడ్పడుతుంది.
* నీటిలో పూర్తిగా కరుగుతుంది—దాని పూర్తి లాభం మీ పంటలకు అందుతుంది.
* అత్యధిక పోషక పదార్థాలు....అతి తక్కువ ఖర్చులో!
* నత్రజని పూర్తిగా అమ్మోనియా రూపంలో ఉండటంవల్ల, నష్టపోవడం అంటూ ఏమీ ఉండదు.
జై కిసాన్ ఎరువులు
అత్యధిక దిగుబడుల కోసం అత్యధిక పోషణ.
జువారి అగ్రో కెమికల్స్ లిమిటెడ్, గోవా.
సికింద్రాబాదు, విజయవాడ, బెంగుళూరు, హుబ్లి, నాగపూర్, పుణె, జువారీనగర్.
LINTAS 2UA 112 2315 TL



జూదవ్యసనమే లేకుంటే కురుక్షేత్ర సంగ్రామమే ఉండేదికాదేమో! ప్లేయింగ్ కార్డ్స్, గుర్రపు పందేలు, లాటరీ టిక్కెట్లు అన్నీ జూదమే కదా !

జూదాన్ని రెండు రకాలుగా విభజించవచ్చు—

1. సామాజిక సంప్రదాయంగా వస్తున్నది.
2. వ్యసనముగా మారిన జూదము.

ఈ సంప్రదాయము, వ్యసనానికీ మధ్య వ్యత్యాసము చాలా తక్కువ. మనిషికి జూదము మీద వ్యామోహము పెరిగినపుడు సాంఘిక పరమైన ఈ జూదపు అలవాటు వ్యసనముగా మారే ప్రమాదం చాలా ఎక్కువ.

జూదం వ్యసనాన్ని నిర్వచించడం కొద్దిగా కష్టమే. అదుపులో ఉంచలేని, తగ్గని, అధికమయ్యే జూదం, ఆడుదామనే ఆలోచనలు, మనస్సుమీద అధికారం చెలాయించే జూదపు కోరికలు. వీటితో మనస్సంతా నిండివుండటం. ఈ ప్రవర్తనవల్ల తనకేకాక తన కుటుంబానికి, తన వృత్తికి, ఉద్యోగానికి నష్టం వాటిల్లడం జరుగుతుంది. ఈ జూదపు ప్రవృత్తి తమ మనస్సు సరిగా లేనపుడు, మనస్సుకు ఒత్తిడి ఎక్కువగా ఉన్నప్పుడు, మరీ ఉగ్రరూపం దాలుస్తుంది.

ఈ జూద వ్యసనమువల్ల వృత్తి, ఉద్యోగాలకు గైరుహాజరవడం, వీటివల్ల ఉద్యోగాలూడే ప్రమాదాలు, నష్టాలు, అప్పులవల్ల దివాలా తీయడం, కుటుంబ విచ్ఛిన్నతకు దారితీయటం, ఎక్కువ వడ్డీలకు అప్పు తేవటము, ఇతరుల సొమ్మును అపహరించటం, పన్నులు మొదలైన వాటిని ఎగ్గొట్టడంలాంటివన్నీ సాధారణ అలవాట్లుగా మారుతాయి.

జూద వ్యసనాన్ని మానసిక శాస్త్రవేత్తలు, ఒక లైంగికోద్రేకముతో పోలుస్తారు. గెలుస్తామనే ఆశ, భావనని లైంగికోద్రేకముతోనూ, ఓడిపోవటాన్ని తమ పురుషత్వాన్ని పోగొట్టుకుంటున్నామనే మానసిక భావనతో పోలుస్తారు. జూద వ్యసనపరుడు ప్రపంచములోని అదృష్టమంతా తనకే కావాలనే పేరాశ, భ్రమలతో జీవిస్తాడు. ఆకస్మికంగా వచ్చిన చిన్న అదృష్టాల వల్ల పెద్ద నష్టాలకుకూడ సిద్ధమవుతాడు.

సిగ్మండ్‌ఫ్రాయిడ్ అనే మనశ్శాస్త్రవేత్త జూదాన్ని హస్తప్రయోగంతో పోల్చాడు. ఈ రెంటిని ఆటలుగా భావించాడు. కొందరికి పసితనములో తండ్రిని విరోధిగా పోల్చుకొని చంపాలనే ఆలోచనలుంటాయి. పంఘంలో ఈ ఆలోచనలు తప్పకదా ! అవి తమకు తెలియకుండానే మనస్సులో ఉండిపోతాయి. ఈ అణగద్రొక్కబడిన ఆలోచనలు మరో రూపంగా బయటకొస్తాయి. అందువలన ఆ శక్తిని జూదంలో వినియోగిస్తారని చెపుతారు. ఈ ఆలోచనలకు జూదంలో ఓడటంద్వారా పశ్చాత్తాపపడతారని మనస్తత్వ శాస్త్రవేత్తలు చెపుతారు. ఫెనికెల్ అనే ఆయన జూదాన్ని హస్తప్రయోగంతోనూ, గెలిచేటప్పుడు వచ్చే సంతోషోద్రేకాలను లైంగికోద్రేకముతోను, ఓటమిని చావుభయంతోనూ లేక తమ లైంగికావయావాలను పోగొట్టుకొంటున్నామనే తలంపుతోనూ పోల్చారు.

గ్రేన్‌సన్ అనే ఆయన మానసిక బలహీనుడైన ఈ జూదరిని ఎడిపస్‌కి గురి అయిన సంఘర్షణలో మునిగినట్లుగా భావించాడు. అంటే జూదరులు తమ పసితనాన్ని తమకు తెలియకుండానే ఊహించుకొని, జూదాన్ని తండ్రితో సవాలుగానూ, తండ్రితో గెలవడమో, లేక అతనికి లొంగిపోవడమనే పరిస్థితిగా ఊహించి జూదములో మునిగిపోతారని చెప్తారు. (ఇటువంటి ఆలోచనలు ఏ మనిషికి తనకి తెలిసిన మనస్సులో వుండవు అని గమనిక) తనుకు తెలియని తమ మనస్సు తమనలా ఆడిస్తుందని వారికి తెలుసా ? జూదమంటే తమకు తెలియని తమ మనస్సులోని చిన్ననాటి పెద్దలమీద కోపమా ?





ఎటువంటివారు ఈ వ్యసనానికి లోనవుతారు—

—తల్లి లేక తండ్రి నుండి విడిపోయిన వారు (చావువల్ల, విడాకులవలన. వదిలివేయుట వలనకాని, తమ 15 సం.ల వయస్సులోపునే.)

—సక్రమంగా లేని తల్లిదండ్రుల క్రమశిక్షణవల్ల (అసలు లేకపోవుట, అనవసరమైన లేక ఎక్కువైన క్రమశిక్షణ.)

—యవ్వనదశ (అడొలెసెన్స్) వారు ఈ అలవాటుకు త్వరగా లొంగిపోతారు.

—తల్లిదండ్రులు ప్రేమలకు, అనురాగాలకు కాక, వస్తువులమీద, భౌతిక ధన వాంఛలమీద ఎక్కువ మక్కువ చూపటం,

ఆ ప్రభావము పిల్లలమీద పడటం —

పొదుపు—దైనందిన జీవితాల్లో ప్రణాళికగా ఖర్చుపెట్టలేని కుటుంబాల్లో ఈ వ్యసనము ఎక్కువగా వుంటుంది.

ఈ జూదరుల లక్షణాలు : తమమీద తమకే ఎక్కువ నమ్మకం కలవారు. ఎక్కువ ఉత్సాహము కలవారు, ఎక్కువ ఖర్చుపెట్టేవారు, ఒంటరి బ్రతుకులకు లోనైనవారు, మానసిక రక్షణ లేని వారిలో ఈ జబ్బు ఎక్కువగా ఉండవచ్చును— కొందరు సంఘ వ్యతిరేక భావాలు మూర్తీభవించిన వ్యక్తిత్వం గలవారై ఉంటారు.

జూదంలో దశలు

1. గెలిచే దశ – మొదట ఎక్కువగా లాభపడుట, పేరాశలకు లోనవుట.

2. క్రమంగా పోగొట్టుకొనే దశ—జూద వ్యసనంలో మునిగిపోవడం వీటివల్ల అందరి నుండి దూరమవడము, ఉద్యోగం ఊడిపోవడం కూడా జరుగవచ్చు.

3. దివాలా దశ— ఎక్కువ డబ్బుతో జూద మాడటం, పెద్ద పెద్ద అప్పుల్లో మునిగిపోవడం, అప్పులవారి చేతుల్లో ఇరుక్కోవడము.

కస్టర్ అనే ఆయన ప్రకారం— మనిషి 10–15 సంవత్సరాలలో ఈ మూడవదశకి చేరుకుంటాడు, తరువాత ఒకటి రెండు సంవత్సరాలల్లోనే సర్వ నాశనమవుతాడు.

మామూలు అటుగా మారిన అలవాటు వ్యసనముగా మారి ఎలా సర్వ నాశనానికి దారి తీస్తుందో మనము తెలుసుకోవాలి. జూదరులు తమంతకు తామే ఈ అలవాటునుండి దూర మవుటకు చికిత్సకు రావడము చాలా అరుదు.

కుటుంబ సభ్యుల ఒత్తిడితోనూ, ఇతర మానసిక జాడ్యాల కొఱకుగాని మానసిక వైద్యులను కలుస్తారు. వీరికి తమ బలహీనతని తమకే తెలిపే మానసిక చికిత్స ఇవ్వాలి. వీరిని జూదం వాతావరణాన్నుంచి దూరంగా ఉంచడం మంచిది. అమెరికాలో "గేంబ్లర్స్ అనానిమస్" అనే సంస్థను ఏర్పాటు చేశారు. దీనివల్ల చాలామంది ప్రయోజనం పొందారని అంటారు.

— డాక్టర్ ఎస్. అశోక్ కుమార్

కాలుష్యం

తాత్కాలిక కుక్షింభరత్వం కోసం
విచక్షణా రహితంగా—
పచ్చగా ఏపుగా ఎదగాల్సిన
మానవతా వనాలను
క్రూరంగా నరికివేస్తున్నాము !
దానికి తోడు—
స్వార్థమనే రాక్షస ఫ్యాక్టరీ గొట్టాల పొగల్ని
మబ్బులు మబ్బులుగా సృష్టిస్తున్నాము !
అది చాలదన్నట్లు—
సహజీవన మార్గాలన్నీ
ఈర్ష్యాసూయల వాహనాల ధూమంతో
నింపేస్తున్నాము !
నిర్మలాంతరంగ వాతావరణాన్ని
చేజేతులా కలుషితం చేసుకుంటున్నాము !
ప్రేమానురాగాల వర్షాభావాన్ని
స్వయంగా కల్పించుకుంటున్నాము.
ఉన్న కాసిన్ని ఆర్ద్రతాజలాలను కూడా
స్వచ్ఛంగా దక్కించుకోలేక పోతున్నాము !
సస్యశ్యామలం కావలసిన జీవన క్షేత్రాలను
యిసుక ఎడారిగా మార్చుకుంటున్నాము !
ఈ కాలుష్యాన్ని అధిగమించేందుకు
గుండె గుండెలో మానవత్వాన్ని నాటుదాం !
అణువణువునా ప్రేమానురాగాల సుధలు
కురిపించి
మనిషి అమరుడని చాటుదాం... !

— దిలావర్





స్వప్నభంగం

సీరియల్

డాక్టర్ ముదిగొండ శివప్రసాద్

శ్రీనాథునికి విజయవాడలో ఒక సంస్థ సన్మానం చేసింది. వెళ్ళివచ్చాడు —

వచ్చేసరికి పత్రిక వెళ్ళవలసిన తేదీలోగా పని ముగించలేకపోయాడు నరసింహం —

పత్రికాధిపతి మండిపడ్డాడు.

''ఇదేం పత్రికనుకున్నారా ? పాత చింత కాయ పచ్చడనుకున్నారా ? సకాలానికి మార్కెట్‌లోకి పోకపోతే ఎవడు చదువుతాడయ్యా—మిమ్మల్ని నమ్ముకొని కాంట్రాక్టు ఇస్తే నన్నిలా ముంచు తారా — చాలు చాల్లేవయ్యా— పెద్దమనుషులు—బుద్ధులుండక్కర్లా—'' గంగరాజు మాటలు తూలుతున్నాడు — అయినా సకాలానికి పత్రిక ఇవ్వకపోవడం ఎంత తప్పో తనకు తెలుసు — శ్రీనాథుడు గంగరాజు కాళ్ళావేళ్ళా పడ్డాడు. 'బాబ్బాబూ ఈసారికి క్షమించండి — ఏదో పిల్లవాడు తెలియక తప్పుచేశాడు — ఇవి చేతులు కావు.'

గంగరాజు కొంచెం మెత్తబడ్డాడు —

''నేను నిన్ను క్షమిస్తాను శ్రీనాథుడూ — కాని నన్ను పాఠకులు క్షమిస్తారా చెప్పు— ఇలాంటి పిల్లల చేతనటయ్యా ప్రెస్సు నడిపిస్తావు నువ్వు.'

నరసింహానికి కోపం పొడుచుకొచ్చింది —

''అనవసరంగా నన్నా మాటలనకండి — కావాలంటే కంపోజిటర్ల నడగండి — నిన్న రాత్రంతా కరంట్ పోయింది — అదీ నా తప్పేనా ??''

''నోరు ముయ్యరా—ఎలుకకు పిల్లిసాక్ష్యం—నీకు కంపోజిటర్లా సాక్ష్యం —'' శ్రీనాథుడు మందలించాడు కోపంగా —

నరసింహం రోషంతో ప్రెస్సునుండి బయటకు వెళ్ళిపోయాడు —

శ్రీనాథుడు ఇంటికొచ్చాడు —

ఆ పూట తిండే తినలేదు —

''లేవండి — అనుష్టానం త్వర త్వరగా ముగించి సాపాటుకు రండి.''

''నాకు ఆకలిగా లేదు తాయారూ — ''

భర్త ఎవరిచేతనో మాటలు పడివుంటాడని గ్రహించింది తాయారు —

''ఉదయం ఇంటికికూడా రాకుండా అలాగే ప్రెస్‌కు వెళ్ళారేమిటి ? ఏం సన్మానం జరిగిందండీ విజయవాడలో ?''

(గత సంచిక తరువాయి)

''నా బొంద సన్మానం — బోడి సన్మానం— ముష్టి జరీ అంచుగల నూలు ఖండువా కప్పి ఓ ముప్ఫై మల్లెపూల దండలు వేశారు — ఏమిటిది ? వాళ్ళు సన్మాన సభ పెట్టింది నన్ను గౌరవించడానికా పూల షాపులవాళ్ళను బ్రతికించ డానికా ? కిలో బియ్యం మూడు రూపాయల డెభ్భై పైసలు — కందిపప్పు ఐదురూపాయల ముప్ఫై పైసలు—నెయ్యి దానమ్మ కడుపుకాలా అసలు దొరకడమేలేదు నలభై రూపాయలు పెట్టినా—ఘన సన్మానమంటేఇంకా ఏమిటో అనుకున్నాను ఘనమంటే మేఘమనే అర్థం వుందిలే. ఓ కుండెడు నీళ్ళునెత్తినిపోసి పంపినట్లుంది ఈ సన్మానం — ముష్టి సన్మానం ముండ సన్మానం సభలోనే తిట్టివచ్చాను వాళ్ళని ఈ పూలదండలు ఎందుకు వేశారని — దండ ఐదు రూపాయలు—ముప్పైఫ దండలేమిటి మరీ వెర్రి పట్టినట్లు — ఆ నూటయాభై రూపాయలూ రొఖ్ఖం ఇస్తే అరబస్తా ధాన్యం రాదూ — ఓ నెల ప్రెస్సుకు కరంటు బిల్లు కట్టనూ — ఛీ ఛీ అటు శరీర కష్టం — ఇటు ఆర్థిక నష్టం — ఆ చెత్త వెధవ మూలంగా గంగిరాజు ఇవ్వాళ ప్రళయ రుద్రుడై పోయాడు — పరపతికాస్త బుగ్గిపాలౌతున్నది — తల ఎక్కడ పెట్టుకోవాలి నేనిక.''

''సరేలెండి — ఈ గొడవ ఎప్పుడూ వుండేదే — లేవండి —''

''నాకు తిండి అక్కర్లేదు—తాయారూ—''

శ్రీనాథుడు తిండి తినలేదు — ఓ గ్లాసు మంచినీళ్ళు తాగి పిల్లవాడికి ఏదో మందు కావలసివుంటే ఇచ్చి ప్రెస్సు కాగితాలు కొన్ని బీరువానుండి తీసుకొని వెళ్ళిపోయాడు — అంతే మళ్ళా మరునాడు మధ్యాహ్నమే కనపడటం.

పని ఎక్కువవుతున్నకొద్దీ డబ్బు ఎక్కువౌతున్నది.

డబ్బు పెరుగుతున్నకొద్దీ పని పెరుగుతున్నది.

పని పెరుగుతున్నకొద్దీ ప్రెస్సు పెరుగుతున్నది.

శ్రీనాథుడు యంత్రంలా పని చేస్తున్నాడు—యంత్ర చక్రంలా, చక్రంలా ఒక మరమేకులాగా మారి పని చేస్తున్నాడు. డబ్బును 'మీట్' చేస్తున్నాడు.

పూర్వంలా భోజనంపట్ల శ్రద్ధ వహించడం లేదు.

నిద్రాసుఖాన్ని గూర్చి ఆలోచించడంలేదు.

''ఏమండీ నేనీ టెర్లిన్‌లో బాగున్నానా'' అంటే ''టెర్లిన్‌కేమి దానికై పెట్టిన నూట ఎనభై అయిదు రూపాయలూ బాగాలేవా ?'' అంటున్నాడు.

ఇదే పూర్వమయితే ''ఆకుపచ్చ టెర్లినులో నీవు సుందరనందన వననికుంజాలమధ్య మణి మందిరాలలో తిరిగే శచీదేవిలా వున్నావని'' ఓ అలంకారం ప్రయోగించేవాడు.

నీవు ధరించడంవల్ల చీరె విలువే పెరిగిందని వర్ణించేవాడు.

ఇప్పుడదేమీలేదు.

తాయారు ఆశ్చర్యపోయింది:

భర్త కేవలం యాంత్రికంగా మారుతున్నాడని గ్రహించింది.

ఆయన పెదవులమీద చిరునవ్వుల కోసం చుక్కాని వేసి వెదకడం ప్రారంభించింది.

కాని అవి మృగ్యమైపోయాయి.

నిన్న ఓ నవ్వు నవ్వాడు — కాని అది రసాత్మకమైన హాసం కాదు — తన ప్రెస్సుకు ఓ రచయిత వచ్చాడట — ఆయన బుక్కు అచ్చు వేయించుకుంటున్నాడట — ఆయన వ్రాసిన ఈ పుస్తకం మొదటి ముద్రణ చెల్లిపోయిందట. గ్రంథసమీక్షలు మాత్రం బాగా రాలేదట. అందుకని రచయిత సమీక్షకులను తిడుతున్నాడట.

''వాళ్ల మొఖం విమర్శ — ఇది విమర్శా ? ఈ రచయితలో హెమిగ్వే ఛాయలు కనిపించు చున్నవి — వారిలో హార్డీ పోకడలు డికెన్సు శైలి ప్రతిబింబించుచున్నది — అనడం పేరు విమర్శా: కేవలం ఆ విమర్శకుడు తానా ఆంగ్ల గ్రంథాల

జరిగిన కథ—4 : శ్రీనాథుడు సాహిత్య పిపాసి. ఆయన కవిత్వం అంటే భార్య తాయారుకు మొదట్లో సరదాగానే ఉండేది. కాని క్రమంగా విసుగు బయలుదేరింది. శ్రీనాథుడు, తాయారు కాలిబాటన తిరుపతి కొండ ఎక్కను ప్రారంభించారు. దారిలో అక్క వైదేహీ బావ లక్ష్మణమూర్తి కారులో కొండపైకి పోతూ వీరిని కలుస్తారు. లంచం ఇచ్చి దైవ దర్శనం చేసుకోడం పాపమని మంగతో చెపుతాడు శ్రీనాథుడు. క్యూలో నిల్చునే ధర్మదర్శనం చేసుకొంటారు. తీర్థయాత్ర సఫలమై మంగ గర్భవతి అవుతుంది. పుట్టింటికెళ్ళిన మంగ అక్క, బావలతో ఘర్షణపడి వచ్చేస్తుంది. మంగ అత్తగారింట్లోనే మగపిల్లవాడిని ప్రసవిస్తుంది. శ్రీనాథుడు పెట్టిన ప్రింటింగ్ ప్రెస్ దినదినాభివృద్ధి చెందుతుంది. అతను శ్రీమంతుల్లో ఒకడవుతాడు.

చదివానని చెప్పుకోవడానికి తప్ప వాడి శైలి విడిలో కనిపించడమేమిటీ — ఒకవేళ కనిపించిందిఫో — వెంకట్రామయ్యగారి భావావేశం లాంటిదే అయిదు వందల ఏళ్లకు ముందు షేక్స్పియరుకు వచ్చింది కాబట్టి షేక్స్పియరు కూడా అగ్రశ్రేణి రచయితే అనుకోమను.

నాకెందుకీ భావదాస్యం — అన్నాడు తాయారూ' అని నవ్వాడు శ్రీనాథుడు.

''ఇంతకీ అసలు తమాషా ఏమిటంటే ఆ విమర్శ నేనే వ్రాశాను — అది తెలుసో తెలియదో వెంకట్రామయ్యకు'' — మళ్లీ నవ్వాడు శ్రీనాథుడు.

పూర్వం శ్రీనాథుడు ఇలా నవ్వేవాడుకాదు.

మరొక రచయితను విమర్శించేవాడే కాదు. విమర్శించినా అసత్యమూ అప్రియమూ రెండూ లేకుండా విమర్శించేవాడు బహిరంగంగానే.

కాని ఇప్పుడు తోటి కవులనూ రచయితలనూ విమర్శిస్తున్నాడు — తాను మాత్రం రచనలు వేయడం విరమించాడు ఏవో కొన్ని పెళ్లిపద్యాలు తప్ప.

''తెలుగువాడు విమర్శను భరించలేక పోతున్నాడు తాయారూ —'' అని మళ్లీ ఓ పరిహాస సూచనమైన నవ్వు నవ్వాడు.

ఆ నవ్వు స్ఫటికంలా లేదు —

స్వర్గంలా లేదు —

వెన్నెలలా లేదు —

విరజాజిలా లేదు —

ప్రెస్ చక్రాలనుండి వచ్చే గరగరలా రవరవలా వుంది.

* * *

ఏప్రిల్ నెల.

పొలం మక్తాలు వసూలు చేసుకోని మిగిలిన బాగోగులు విచారించడానికై ఓ వారం రోజులు ఈమనిలోనే తిష్ఠవేయవలసివచ్చింది శ్రీనాథునికి.

నీటిలోనుండి బయటపడేసిన చేపలా గిలగిల లాడాడు, ఈమనిలో అన్నాళ్లు ఉండిపోవడానికి.

''అందరూ దొంగవెధవలు — ఉంటేనే పని అంతంత మాత్రం — ఇక కనుమరుగైతేనా ప్రెస్సు మొత్తంతినేస్తారు— మామిడి డొక్కులా పీల్చేస్తారు.''

''డొక్కులా పీల్చడమేమిటీ ? పండులా పీలుస్తారు — అంటే మీ ప్రెస్సు తియ్యమామిడి అని అర్థం.''

''ఏదోలో ఓ ముష్టి ఉపమానం — నువ్వు మరీనూ తాయారూ ఒక వైపు నేను నష్టం వస్తున్నదని అల్లాడుతుంటే — ''

తాయారు భర్త ముఖం చూచి ఆశ్చర్య పోతూ అన్నది —

''మీరు చాలా మారిపోయారండీ.''

''మార్పు ప్రకృతి లక్షణం — వెదురు బొంగులు చూడు న్యూస్ ప్రింట్‌గా మారి పోవడంలేదూ — అలాగే.''

తాయారు మరేమీ మాట్లాడలేదు —

ఈమనిలో పాలూ పెరుగూ సమృద్ధిగా దొరుకుతాయి — మురికికాలువల వాసనవుండదు.

నిరంతరమైన రద్దీ — హడావుడీ — నగర జీవిత ఫలితంగా ఆవిర్భవించే నిరాశా నిస్పృహ ఇక్కడ కన్పడవు — తాయారు కాకరకాయలు తరుగుతున్నది.

''పోస్ట్‌మాన్.''

తెనాలినుండి రిడైరెక్ట్ అయిన ఉత్తరాలు వచ్చాయి శ్రీనాథుడికి.

అవి చదువుతూ తల పట్టుకొని కూర్చున్నాడు.

''ఏమండీ.''

''ఆఁ—''

''ఎలా చేయమంటారు కూర ?''

''నీ మొఖంలా చేయి— ముష్టి కూర వండడానికి ముప్ఫైమూడు ఎంక్వైరీలు— ఇవతల ప్రాణాలమీదికి వస్తుంటే—''

''అదికాదండీ— మీ కేది రుచో తెలుసుకుందామని—''



''నాకు ఉప్పు కషాయం రుచి తెలిసిందా— నోరు మూసుకొని ఏదో వండిపారెయ్— కూరలో బెల్లం వేయాలా, వెల్లుల్లి వేయాలా అన్నదాన్ని నీవో ఇంటర్నేషనల్ సమస్యలాచేసి వర్ణిస్తావు— నేనేం తిండిపోతును కాను.''

తాయారు నిశ్చేష్టురాలైంది—

తిరుగమోతకు వేసే కరివేపాకు మొక్క సౌందర్యం లాలిత్యం దగ్గరినుంచీ శ్రద్ధ తీసుకున్న శ్రీనాథుడేనా ఈ శ్రీనాథుడు ??

తాయారు వంట వేసింది-

శ్రీనాథుడే వో అర్జంటు ఉత్తరాలు వ్రాశాడు—

వంట ముగించి భోజనానికి పిలిచింది—

''నీవు కానియ్—నాకింకా ఆలస్యం వుంది.''

''బాగుంది సరసం— మీరు తినకుండా నే నెన్నడైనా తిన్నానా ?''

''పతివ్రతా! అలాగే ఉండు మరో గంట''

సరిగ్గా మరో గంటసేపు బిజినెస్ లెటర్స్ వ్రాశాడు— ఆ పైన ఓ రెండు చెంబుల నీళ్లతో నెత్తి తడుపుకొని వచ్చి అన్నం ముందు కూర్చున్నాడు.

''అనుష్ఠానం —''

''నా బతుక్కు అదొక్కటే తక్కువిప్పుడు— అవతల చూడు ఆ గాడిదకొడుకు, టెక్స్టుబుక్ అచ్చు వేయించుకుపోయి అది సెలక్టు కాలేదు కాబట్టి డబ్బు ఇవ్వలేనంటున్నాడు. ఎక్కడుంది న్యాయం ఈ లోకంలో — వాడి బుక్కు సెలక్టు కాకపోవడం నా తప్పా ? వాడే గంగలో దూకితే నాకేం ఇవతల నా శ్రమంతా ఏంకావాలి ? కంపోజిటర్లకు నేనిచ్చే చార్జీలేమైనా తగ్గుతా యనుకున్నాడా దొంగలం - వెధవ... ఇటు కొంచెం అన్నం వెయ్ —''

''కూర కొంచెం వేస్తాను.''

''అక్కర్లేదు అవతల బస్సుకు వేళ

స్వప్న భంగం

అవుతున్నది. వాణ్ణి కోర్టు కీడుస్తాను ఏమను కున్నాడో — శ్రీనాథుడి సొమ్ము ఎగేసినవాడెవడూ బాగుపడలేదు వంశనాశన మౌతుంది వాడికి ఏ దొంగ, లం......''

''అబ్బబ్బ — ఏం తిట్లండీ అవీ — వినలేకుండా వున్నాను.''

''అవును మరి చిలకలకొలికివి — నీకు వాణి వీణలూ శారికల పలుకులూ కావాలి — అటు రోమ్ నగరం తగలడుతుంటే నీ బోటివాడే నీరో అని ఒకడు ఫిడేలు వాయించుకుంటూ కూర్చున్నాట్ట — నా తిట్లు నీకు బాగాలేదు కాని వాడు చేసిన పని బాగుందా ?''

చెయ్యి కడుక్కొని లేచాడు.

''ములక్కాయల సాంబారు వేసుకోలేదు — పెరుగు మామిడిపండ్లూ తిననేలేదు.''


''మీరిద్దరు వున్నారుగా తినండి —''

ఓ పాతచొక్కా తగిలించుకొని జోళ్లూ సంచీ ఉత్తరాలూ పట్టుకొని పరుగెత్తాడు పాటి వైపుకు బస్సు శబ్దంవిని. తాయారు నిశ్చేష్టు రాలైంది.

''అమ్మా ఆకలి'' అని వచ్చిన ముద్దు కృష్ణకు తిండిపెట్టి అలాగే కూర్చొని ఆలోచిం చడం మొదలుపెట్టింది. గతం ఆమె కళ్ళముందు రంగుల చిత్రంలా కన్పడింది.

ఈ ఇంట్లోనేనా లోకోన్నత కవిత్వం పండించాడు తన భర్త. ఇక్కడే కదూ తన్ను నీలిసరస్సులో తిరిగే రాజహంస అన్నాడు. నీలాకాశంలో విహరించే రాజహంస లాంటి చందమామలా వున్నా వన్నాడు తనను.

పాలసముద్రంలో నుండి వచ్చిన జగన్మోహిని వన్నాడు.



పచ్చపొలాల చీరెను కట్టుకున్న భూదేవి వన్నాడు తన చిలకపట్టు చీరెను చూచి.

ఇవ్వాళ తనకు ఆనాడులేని డబ్బువుంది.

ఆనాటికంటే ఎక్కువ వస్తువు లున్నాయి.

తామంటే ఇప్పుడు పేరిందేవికి భయం, గౌరవం భక్తి. వైదేహికీ లక్ష్మణమూర్తికీ తమ సంపదచూసి హడల్

కాని—

కాని తనను భర్త పూర్వంలా అందంగా వర్ణించ డెందువల్ల ?

జీవితాన్ని ఒక రంగవల్లిగా తీర్చిదిద్దు కోవడం లేదెందుకని ??

''ఎందుకింత శ్రమ. ఆ పాడు డబ్బుకోస మేనా'' అంటే, ''తాయారూ! డబ్బు విలువ తెలియక అలా అంటున్నావు. పాడు డబ్బట — పాడుడబ్బు. కొడుకు నా రికరింగ్ డిపాజిట్‌కన్నా వేగంగా ఎదుగుతున్నాడు. వాడికి రాబోయే అవ సరాల స్థాయిలో నా ఆదాయం పెరగడం లేదు. నోరు మూసుకొని అపశకునాలు పలకకు.

ఒక్కసారి బస్తీకి వెళ్లి చూడు — ఉదయం ఏడులోగా తిండితిని టిఫిను భరిణలు చేతపట్టు కొని అర్ధరాత్రివరకూ పనిచేయడానికి మనుషు లెలా బస్సులకు ఎగబడుతున్నారో ? వారితో పోలిస్తే నాదీ ఒక శ్రమేనంటావా ? అని వాదిస్తాడు — శ్రీనాథుడు ఇప్పుడొక డబ్బును ముద్రించే యంత్రం !!

ఇప్పుడాయనకు దొరువుకుపోవాలనే కోరిక లేదు.

తోటలూ చెట్లూ చూడాలనే వాంఛలేదు— ఆర్ద్రతలేదు. ఉష వింతగా తోచడంలేదు.

''సూర్యగోళంచుట్టూ భూమి తిరగడం వల్ల ఇలా వెలుగు నీడలు వస్తాయి — రాకెం జేస్తాయా ? ఛస్తాయా ?'' అంటున్నాడు.

''కోయిలలు కూస్తే గొంగళీలు తిని గొంతు దురదపుట్టి అరుస్తాయట తాయారూ — మనం అనుకునేటట్లు చిగురుటాకులు తిని కాదట''అని ప్రకృతి శాస్త్ర విజ్ఞానం పుస్తకాన్ని ఇటీవలే అచ్చువేసిన తన పాండిత్యాన్ని ప్రదర్శి స్తాడు... తాయారుకు తిండి సయించలేదు.

చేయి కడుక్కొని అలా యాంత్రికంగా లేచి వెళ్లి పక్కపై పడుకుంది — తాయారు తను కోల్పోయిందేమిటో గ్రహించింది — తాను కోరుకున్న ధనమయితే వచ్చింది. కాని...

కోరుకోకుండా ఈశ్వరుడు ప్రసాదించిన రసవాహిని మాత్రం తమ బ్రతుకుల్లో ఇంకి పోయింది — కళ కరువౌతున్నది.

ప్రెస్సు శబ్దాలమధ్య రేయింబవళ్లు నలిగి పోయిన ఆర్త హృదయం ఇప్పుడు హేమంతం లోని కమలంగా విశ్లథమైంది.

రేకులు రాలిపోయాయి.

తాయారులో అసంతృప్తి తెరలు తెరలుగా జారింది.

అలలు అలలుగా లేచింది.

సైరన్‌లా ఘూర్ణిల్లుతున్నది.

బాగా పొద్దుపోయివచ్చాడు శ్రీనాథుడు ఎండిన గోగు కాడలా వాడిపోయి.

ఆయన ముఖంలో ద్వేషమూ నిరాశా బాధా గూడు కట్టుకొని వున్నాయి—

రాగానే తాయారు ఆదరంగా దగ్గరికి వెళ్లి ''లెండి— స్నానంచేసి భోంచేద్దురు—'' అంది.

''అక్కర్లేదు – తెనాలిలోనే ఏ హోటల్ లోనో నాలుగు మెతుకులు కతికి వచ్చాను—'' అంటూ మంచంపైకి జారిగిలపడ్డాడు—

పుచ్చపువ్వులాంటి వెన్నెల—

దూరంగా కోయిల కూతలు –

ఆకుతోటల మీదుగా తిరిగిన చల్లని సమీరాలు తాయారులో భావావేశం ఉవ్వెత్తున లేచింది—

పాల వెన్నెలను కళ్లతో తాగుతూ అలాగే పడుకున్నది—

పక్కనే వెన్నముద్దలా ముద్దుకృష్ణ—

అలా ఎంత పొద్దుపోయిందో ఏమోమరి—

శ్రీనాధుడు అరుస్తూ లేచాడు! ''దొంగ

స్వప్న భంగం

రాస్కెల్— పుండాకోర్— పాపమని దయతో ఉద్యోగమిస్తే బైపు దొంగిలిస్తావా గాడిద కొడకా.''

''ఏమండీ— ఏమండీ'' తాయారు ఉలిక్కి పడింది. శ్రీనాథుడు లేచాడు—

అతని కల చెదిరిపోయింది—

కళ్లు నులుముకొని చుట్టూ చూచి నిట్టూర్చి ''తాయారూ ఓ గ్లాసు నీళ్లియ్యి'' అన్నాడు.

తాయారు నీళ్లిచ్చింది—

తాగుతూ అన్నాడు ''కల చెదిరినట్లుంది— నిద్రలో మెలకువ వచ్చింది —

''కల చెదిరింది మీకే కాదండీ నాకు కూడాను— దేవుడిచ్చిన తియ్యటి కలను కరిగించుకున్నాను'' అయోమయంగా చూచాడు శ్రీనాథుడు.

''ఏమండీ మనకా ప్రెస్ వద్దు మీకీ చిత్తక్షోభవద్దు – అమ్మేద్దామా ?''

శ్రీనాథుడు విషాదంగా నవ్వాడు. కొన్ని క్షణాలాగి అన్నాడు ''ప్రెస్సు లేకుంటే పెరిగే పిల్లాడి అవసరాలమాటేమిటి ? పైగా ప్రెస్సు పోయినా పూర్వపు శ్రీనాథుడు నీకు కన్పడడు. రసవాహినిని ఎండించడమయితే మనం చేశాము కాని తిరిగి దానిని జీవన గంగగా ప్రవహింపజేయడం మాత్రం నాకు సాధ్యంకాని విషయం. ఈ ఇంద్రధనుస్సులు నన్ను పలకరించవు. చంద్రతాపాలు నన్ను పులకరింపజేయవు. తాయారూ, కరిగించజాలవు.''

ఎందుకో తాయారు గొంతు గాద్గదికమైంది.

ఆమెకు తాను పోగొట్టుకున్నదేమిటో అర్థమైంది. తిరిగి సంపాదించుకోలేనిదేమిటో కూడా తెలిసిపోయింది.

ముద్దుకృష్ణ ఇటునుండి అటువైపు పొర్లాడు. శ్రీనాథుడు మళ్లీ పడుకున్నాడు కాని నిద్రపట్టలేదు. ఆయన మనస్సులో ప్రెస్ తాండవమాడుతోంది.

''ధన ధన ధన ధన ధన ధన—'' శబ్దాలు, ధ్వనులు, మోతలు, అరుపులు.

''ఏమండీ – ఈ వెన్నెలలో మనబాబు ఎలా వున్నాడో ఆలంకారికంగా చెప్పండీ.''

''చెప్పేందుకు ఏ ముష్టి వెధవ ఉపమానమూ నా దగ్గరలేదు తాయారూ!''

(అయిపోయింది) ★



ఈ వేళ కూడా ఆఫీసులో
రోజంతా పనే...ఇక యింటికి వచ్చేటప్పుడు,
బస్సులో అబ్బ, ఊపిరాడనంత మంది
జనం. అయితే ఏం! ఇంటికి రాగానే స్నానం
చేస్తే హాయిగా ఉంటుంది. ఒక కప్పుడు
హార్లిక్స్ త్రాగితే అలసటంతా పోతుంది.
మాల్టెడ్ బార్లీ, వెన్నతో కూడిన పాలు, బంగారు పచ్చ గోధుమలలోని పోషక శక్తుల మంచితనమంతా చక్కగా రంగరించబడిన హార్లిక్స్ ఎంతో బలకరమైన పానీయం.
పోషక శక్తిని సమకూర్చేందుకు ఉత్తమ మార్గంగా అందరు నమ్ముతారు. 100 సంవత్సరాలకు పైగా ప్రపంచమంతటా లక్షలాది కుటుంబాలు హార్లిక్స్‌ని నమ్ముకున్నాయంటే ఆశ్చర్యం ఏముంది?
Horlicks
The Great Nourisher
కొత్త సమయం,
కొత్త రూపం
మంచి పుష్టికరమైనది



'కాయ్ రాజా కాయ్' లో రావుగోపాలరావు, నూతన్‌ప్రసాద్

"కాయ్ రాజా కాయ్"లో కొత్త భిక్షాటనము

రాజారావు (రావు గోపాలరావు), మునసబు (నూతన్‌ప్రసాద్), నవగ్రహాలు—మెళ్ళో జోలెలు తగిలించుకుని నడి వీధిలో నిలుచున్నారు. రాజారావు గంభీరంగా ఉపన్యసించసాగాడు :

"గ్రామ ప్రజలారా! మన ఊరికొక్కాడా తుఫానొస్తుందీ అని రెండు మూడు రోజులుగా మనమెంత హడలిపోయామో మీ అందరికీ తెలుసు. కాని, ఏ తల్లుల పుణ్యం వల్లో, ఏ తండ్రులయొక్క పుణ్యంవల్లో తుఫాను మన ఊరు ముట్టుకోకుండా అలా ప్రక్కనుంచి వెళ్ళిపోయింది. అయితే దురదృష్టవసాత్తు మన ప్రక్క జిల్లాలను సర్వ నాశనం చేసింది. అంచేత మన తోటి సోదరులకు, మన జాతి వాళ్ళకు, మనకు వీలైనంత ఇలాంటి విపత్కరపరిస్థితుల్లో సాయం చెయ్యడం మన కనీస ధర్మం. అంచేత, మీమీ శక్తి వంచలేకుండా మీరు వచ్చి ఆ తుఫాను బాధితులకు విరాళాలు ఇవ్వవలసిందిగా కోరుతున్నాను."

ఎదురుగా ఉన్నవారు విసుక్కుంటూ వాళ్ళ వాళ్ళ ఇళ్ళల్లో కెళ్ళి తలుపులు మూసుకున్నారు.

రాజారావు అయోమయంగా చూస్తూ, "ఏంటయ్యా, మునసబూ! మనం పవరులోనే ఉన్నాంగదా? పాపులారిటీ ఏమన్నా పడిపోయిందా ఏమిటీ— ఒక్కరూ ముందుకు రావటం లేదు?" అని అడిగాడు.

"ఇప్పటివరకూ మనం గవర్నమెంటు ఒప్పుకోని పనులే చేశాం. ప్రప్రథమంగా ఒప్పుకొనే పని ఇప్పుడు చేస్తున్నాం ... .అంచేత, మనకు భూమికి ఉన్నంత సహనం, గాడిదకున్నంత ఓర్పు అవసరం," అన్నాడు మునసబు.

"అలాగే! ఇదిగో... నువ్వు చిన్నప్పుడు పౌరాణిక నాటకాలేవే కొన్ని యెలగిబెట్టినట్టున్నావుగదా?"

"ఆ... సహదేవ[illegible]నుంచి ధర్మరాజు వరకు లైనుబెట్టి వేశాను."

"మరైతే కొంచెం ప్రాపగాండా బాగుంటుంది. పాటో పద్యమో అందుకోవయ్యా, నలుగురూ చేర్తారు."

"అయ్యల్లాలా, మా అమ్మల్లారా!" అంటూ మునసబు పాట అందుకున్నాడు.

పరుచూరి సోదరుల కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, పాటలు దర్శకత్వంలో ఆలపాటి రంగారావు నిర్మించిన శ్రీనాథ్ మూవీస్ "కాయ్ రాజా కాయ్" చిత్రంలో మురళీమోహన్, చంద్రమోహన్, శివకృష్ణ, వేలు, రమణమూర్తి, గోకిన రామారావు, నారాయణమూర్తి, కిరణ్, రాజ్‌వర్మ, చిట్టిబాబు, మాష్టరుహరి, సుమలత, తులసి, ముచ్చెర్ల అరుణ, నిర్మల,

"ఈ అప్పులవాళ్ళకి జవాబు చెప్పలేక పోతున్నానయ్యా! నాకూ కాడా ఓ డూప్‌ని చూసిపెట్టు!"



'అదిగో...అల్లదిగో'లో చంద్రమోహన్, సుహాసిని, అత్తిలి లక్ష్మి



శుభ, కృష్ణవేణి, బిందుమాధవి, బేబీకీర్తి, అనూరాధ వగైరా తారాగణం. చక్రవర్తి సంగీతం, లక్ష్మణ్‌గోరే ఛాయ, దిలీప్‌సింగ్ శిల్పం, కె. బాబూరావు కూర్పుతో కోగంటి భాస్కరరావు నిర్మాణ సారధి.

విఠలాచార్య చిత్రం "నవమోహిని"

"ఏప్రిల్ 26కి షూటింగ్ పూర్తయిపోయింది. జూన్ చివరివారంలో రిలీజ్ అవుతుంది," అన్నారు జానపద బ్రహ్మ బి. విఠలాచార్య. ఇటీవలే అమెరికాలో హార్ట్ సర్జరీ చేయించుకుని, నూతనోత్సాహంతో తిరిగొచ్చిన ఈ దర్శక నిర్మాత ప్రసాద్ స్టూడియోలో విఠల్ ప్రొడక్షన్స్ "నవమోహిని" చిత్రాన్ని సరికొత్త పంథాలో రూపొందించడానికి రేయింబవళ్ళు నవయువకునిలా శ్రమించడం చూపరులకు ఎంతైనా ఆశ్చర్యం కలిగించింది. నరసింహరాజు, రోహిణి, మహిజ, షహీద, వంకాయల, శ్రీనివాస్, కిశోర్, కె. కె. శర్మ, పొట్టి వీరయ్య. మోదుకూరి సత్యం, టెలిఫోన్ సత్యనారాయణ, ఏచూరి, గరగ, సురేన్‌బాబు నటించారు. కర్పూరపు ఆంజనేయులు సంభాషణలు, పార్థసారధి స్వర కల్పనలో సి. నారాయణరెడ్డి, జి. కె. మూర్తి గీతాలు రాశారు. హెచ్. ఎస్. వేణు ఛాయ, వాలి శిల్పం, గోవిందస్వామి కూర్పు, గోపాలకృష్ణ సహ దర్శకత్వం నిర్వహించారు.



'నవమోహిని' రోహిణి

"అడవులి" జయసుధ


"మే 17 నుంచి జూన్ 10 వరకు జరిగే మలిషెడ్యూల్‌తో షూటింగ్ పూర్తయిపోతుంది," అన్నారు ఎస్. రామచంద్రరావు. ఈయన నిర్మించే ఎస్. ఆర్. ఫిలిమ్స్ "అడవులి" చిత్రంలో మోహన్‌బాబు, జయసుధ, సుధాకర్, ప్రసాద్‌బాబు, వేలు, డాక్టర్ శివప్రసాద్, రాజ్‌వర్మ, విక్రమ్, సంగీత, మణిమాల, పద్మ, సరోజ, అనూరాధ, జయమాలిని, సిల్క్‌స్మిత, అత్తిలి లక్ష్మి ముఖ్య భూమికలు నిర్వహిస్తున్నారు. తొలి షెడ్యూల్ ఏప్రిల్ 20 నుంచి 25 వరకు జరిగింది. సత్యానంద్ మాటలు, చక్రవర్తి సంగీతం, పుష్పాల గోపీకృష్ణ ఛాయ, కె. రామలింగేశ్వరరావు శిల్పం, శాఖమూరి సూరిబాబు కూర్పుతో కోడి రామకృష్ణ దర్శకుడు.



శరత్‌బాబు, అంజిబాబు 'మేమూ మీలాంటి మనుషులమే'

రాజశ్రీ రచన, దర్శకత్వంలో చంద్రమోహన్

"పుట్టన్న నిర్మించిన 'మునితాయ్'. కన్నడ చిత్రం మాతృక," అన్నారు రాజశ్రీ. ఈయన మాటలు, పాటలు సమకూర్చి దర్శకత్వం వహించే కె.ఆర్.పి. పిక్చర్స్‌వారి చిత్రంలో చంద్రమోహన్, భానుప్రియ, రమణమూర్తి ఆదిగాగలవారు పాల్గొంటారు. తాతినేని చలపతిరావు సంగీతం, జి. మోహనకృష్ణ ఛాయతో కె. ఆర్. ప్రభు నిర్మాత. ఈ చిత్రంతోపాటు బి.ఎస్. నారాయణ దర్శకత్వం వహించిన "నిమజ్జనం" చిత్రంకూడా ఒకే టిక్కెట్టుపై ప్రదర్శింపబడుతుంది.



'శ్రీమతి కావాలి' లో మోహన్‌బాబు, రాధిక

సినిమా

సక్సెస్‌ఫుల్ డైరెక్టర్, మినిమమ్ గారంటీ డైరెక్టర్‌గా పాపికెక్కిన ఎ. కోదండరామిరెడ్డి



'రామరాజ్యం వచ్చింది'లో. చంద్రమోహన్, ప్రభ

బాలకృష్ణ హీరోగా ప్రసన్న ఆర్ట్స్ చిత్రం

"బాలకృష్ణ, సుమలత హీరో హీరోయిన్‌లు," అన్నారు కెళ్ల రామస్వామి. ఈయన నిర్మించే చిత్రానికి జె. వి. రాఘవులు సంగీతం, పి. లక్ష్మణ్ ఛాయ, రావుశ్రీ సహ దర్శకత్వం, తాతా సురేష్ కూర్పు టి. సత్యనారాయణ ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్, కె. కనకారావు నిర్మాణత, కె. రాంబాబు సహనిర్మాత, ఉపద్రష్టశాయి సంభాషణలకర్త. "ఫస్ట్ షెడ్యూల్ రాజమండ్రి ప్రాంతాలలో జరుగుతుంది," అన్నారు కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వ బాధ్యతలు వహించే కోడి రామకృష్ణ.

జయప్రద 'నాయకులకు సవాల్'




అతిరథ మహారథులతో సంయుక్తా మూవీస్ అత్యంత భారీ చిత్రం "మహా సంగ్రామం"

"మా తొలి చిత్రంతోనే మా బానర్‌ను ఎస్టాబ్లిష్ చేసుకోవాలనే ఏకైక లక్ష్యంతో అధిక వ్యయప్రయాసలకోర్చి మా యూనిట్‌లోని ప్రతి ఒక్కరూ అత్యంత శ్రద్ధతో కృషి చేశారు. భగవదనుగ్రహంవల్ల, ఉత్తమాభిరుచులు గల మన ప్రేక్షకుల ఆదరణవల్ల మా 'ఖైదీ' చిత్రం అఖండ విజయం సాధించింది. దీంతో మా బరువు బాధ్యతలు మరింత పెరిగాయి. మా తదుపరి చిత్రం 'మహా సంగ్రామం'ను తెలుగు చలనచిత్ర చరిత్రలోనే అత్యంత భారీ చిత్రంగా నిర్మించడానికి నిశ్చయించాం," అన్నారు సంయుక్తా మూవీస్ పతాకంలో "మహా సంగ్రామం" చిత్రాన్ని నిర్మించే డాక్టర్ ఎం. తిరుపతిరెడ్డి. ఏప్రిల్ 11 నుండి 15 వరకు తొలి షెడ్యూల్ జరిగిన ఈ ప్రతిష్టాత్మక చిత్రంలో కృష్ణ — జయప్రద, శోభన్‌బాబు — జయసుధతోపాటు హేమాహేమీ లెందరో పాల్గొంటున్నారు ఉభయ తరగతి ప్రేక్షకులనూ ఉత్తేజితులను చేసే కథ, మాటలను పరుచూరి సోదరులు సమకూర్చారు. రసమయ రమణీయ కతతో వేటూరి రచించిన గీతాలకు చక్రవర్తి మధురమైన బాణీలను కూర్చారు. వి. ఎస్. ఆర్ స్వామి ఛాయ, భాస్కరరాజు శిల్పం, కె. వెంకటేశ్వరరావు కూర్పు, సలీం నృత్యాలు, రాజు సాహసాలు, ధర్మరాజు — రాఘారెడ్డి సహకార దర్శకత్వం, ఎస్. సుధాకరరెడ్డి నిర్వహణతో పి. శ్రీధరరెడ్డి సమర్పిస్తారీ చిత్రాన్ని, "కథాబలం, తారాబలం, సాంకేతిక బలం గల ఇదొక మహాయజ్ఞం. ఊటీలో మే 11 నుండి 20 వరకు రెండవ షెడ్యూల్, జూన్ 11 నుండి 20 వరకు మూడవ షెడ్యూల్, ఫారెస్ట్ బాక్‌డ్రాప్‌లో జూలై 11 నుండి 20 వరకు చివరి షెడ్యూల్ జరుగుతాయి," అన్నారు

వారపత్రికలకు
ఒరవడి దిద్దిన

ఆంధ్రపత్రిక

సంస్థ నుంచి వెలువడే



నవ వనితా సచిత్ర పక్ష పత్రిక

కలువబాల

పూర్తి ఆఫ్‌సెట్ ముద్రణతో ½ డెమ్మీ సైజులో,
24 పేజీలకు తగ్గకుండా, ఆలోచింప చేసే రచనలతో
పక్షం - పక్షం మీ ముందుకు రాబోతున్నది.



డాక్టర్ కె. వెంకటేశ్వరరావు

పి. సి. హెచ్. పి. ఆర్. — విజయవాడ

బోదకాలు ప్రమాదకరమైనదా? ఇదివస్తే మరల తగ్గుతుందా ? ఇది రాకుండా ఉండటానికి ఏదైనా ఇంజక్షన్, టీకాలు ఏమైనా ఉన్నవా ?

★ బోదకాలు వల్ల ప్రమాదమంటూ ఏమీలేదు. చూడటానికి కొంతవరకూ ఇబ్బందిగానూ, నడకలో కొద్దిగా బరువుగాను అనిపించవచ్చు. ఒకసారి వాపు ఏర్పడితే తగ్గటమంటూ జరగదు.

అప్పుడప్పుడు చలీ, జ్వరం వస్తూ ఉండే సమయాలలో తగిన చికిత్స చేయించుకొంటే బోదకాలు వచ్చే అవకాశం ఉండదు. ఇలా చలీ, జ్వరము వస్తూ ఉన్నప్పుడు డైయీథైల్ కార్బమజీన్ సిట్రేట్ అనే మాత్రలను వైద్యుల సలహా ప్రకారం వాడవలసి ఉంటుంది. దీనికి ఇంజక్షన్లు, టీకాలు లేవు.

ఏ. వి. ఆర్. కె. — వాయుడుపేట

నాకు చిన్నప్పటి నుండి ఫిట్స్ వస్తాయి. ఇప్పుడు 26 సంవత్సరములు, ఫిట్సు వచ్చినప్పుడు నాలుక కొరుక్కుంటాను. తలతిరిగి పడిపోతాను. ఇది వచ్చిన మూడు రోజులు ఏ పనీ చేయలేక పోతాను. ఎన్ని మందులు వాడినా నయము కాలేదు.


★ దీనిని గ్రాండ్ మాల్ ఎపిలెప్సీ అని అంటారు. గార్డినాల్, ఎప్టాయిన్ వంటి మందులను న్యూరాలజిస్టుల సలహా మేరకు వాడవలసి ఉంటుంది. చాలా మందికి వయస్సు మీరిన కొద్దీ ఈ రోగ లక్షణాలు తగ్గుతూ వస్తాయి.

డి. కె. ఎమ్. — విశాఖపట్నం

నాకు గత 10 సం॥లుగా చంకలో గజ్జ పిక్కంత కాయ ఉంది. దానివల్ల నాకు సంతానం కలుగలేదని అనుకొంటున్నాను ?

★ చంకలోని కాయకీ సంతానం లేకపోవటానికీ సంబంధంలేదు. శస్త్రవైద్యులు ఆ 'కాయని' పరిశీలించి అవసరమైతే ఆపరేషన్‌చేసి తీసివేస్తారు.

పిల్లలు లేకపోవటానికి గల కారణాలను, మీరు, మీ శ్రీమతీ వైద్యుల వద్ద పరీక్ష చేయించుకొని తెలుసుకోవలసి ఉంటుంది.



ఏ. జి. ఆర్. — తాడేపల్లి గూడెం

నేను ఈమధ్య వి. డి. ఆర్. యల్. పరీక్ష చేయించాను. "పాజిటివ్ 1 ఇన్ 4" అని వచ్చింది. ఇంతకు ముందు టెర్రామైసిన్, క్లోరమ్‌ఫెనికాల్, లెడరీమైసీన్, జెంటిమైసిన్ వంటి ఏంటీ బయాటిక్స్ డాక్టర్ల సలహాపైన, స్వంతంగానూ వాడాను. అయినా ఫలితమేమీ లేదు.

★ ఇలా మందులను స్వతహాగా వాడటం వల్ల, నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో నిర్ణీతమైన పద్ధతి ప్రకారం వాడకపోవటంవల్ల ఏ ఫలితమూ లేకపోగా రోగం మందులకి లొంగని పరిస్థితి ఏర్పడే అవకాశం ఉంటుంది. ఒక పద్ధతిలో మందులను వాడకపోవటంవల్ల రోగ కారక క్రిములు మందులకి లొంగవు. మీరు వి. డి. స్పెషలిస్టులకి చూపించండి.

కె ఆర్.డి. — బోడప కుర్రుపాలెం

మా మామ్మగారి వయస్సు 65 సంవత్సరములు. ఈ మధ్య ఆమె కళ్ళు తిరిగి పడిపోవుచున్నది. డాక్టరుకి చూపిస్తే బి. పి. వున్నదని చెప్పారు. మందులు వాడుతున్నాము. ఆమె పరిస్థితి చూస్తే ఆందోళనకరంగా వున్నది.

★ హైపర్ టెన్షన్ (అధిక రక్తపుపోటు) ఉన్నవారికి ఇలా తల తిరగటం జరుగుతుంది. ఇటువంటి వారు మూత్ర పరీక్ష నెత్తురులో గ్లూకోజు ప్రమాణం పరీక్ష మొదలయినవి చేయించాలి. పై వాటివల్ల డయాబెటిస్ ఉన్నదీ లేనిదీ తెలుస్తుంది.

ఫిజీషియన్లు రోగి ప్రత్యక్ష పరిస్థితి ననుసరించి చికిత్స చేస్తారు.

ఏ. ఏ. — కాకినాడ

నాకు 17 సంవత్సరములు. నేను చాలా సన్నంగా వుంటాను. నాకు ఏ వ్యాధీలేదు. కొంత కాలం క్రితం డాక్టరు సలహాపై రక్తపరీక్ష, మలపరీక్ష చేయించుకొని చికిత్స చేయించుకున్నాను. నా శరీరం పెరగటానికి ఉదయం ఒక ఉడకబెట్టిన గ్రుడ్డు, పాలు తీసుకుంటే ఏమైనా ఉపయోగం వుంటుందా ?

★ లావు అవటానికి గ్రుడ్లు, పాలు తిన్నంత మాత్రాన ప్రయోజనం ఉండదు. కొందరు ఎంత తిన్నా సన్నగానే ఉంటారు. కొందరు మొదట సన్నగా ఉన్నా వయస్సుమీరిన కొద్దీ లావవుతారు. లావుగా కనబడే వారందరికీ అధికశక్తి, ఆరోగ్యం ఉందనుకోవటం పొరపాటు. ఏ రోగం లేకపోతే సన్నగా ఉన్నందువల్ల నష్టమేమీ లేదు. ★

దగాకోరు పెద్దలు

–బి.వి. పట్నాయక్



ఎప్పటిలాగే సూర్యుడు తూర్పున ఉదయిస్తున్నాడు. ఎరుపు కిరణాలు భూమి మీద పడ్డాయి. సోమరులైన మనుషులను నిద్దుర నుండి లేపుతున్నాయి కాకులు.

అప్పుడే జోగయ్య నిదురనుండి లేచాడు. తనకు ఎదురుగా పడుకున్న భార్య ముఖము చూశాడు, ఏదో అదృష్టం వరిస్తుందేమో అని. కుక్కిమంచం నుండి నాలుగు అడుగులు ముందుకు వేశాడు దేవుడు పటము వుండే గోడ దగ్గరకు. "దేవా ! దయతో కాపాడి నన్ను నా కుటుంబాన్ని రక్షించు. ఈ రోజు ఇంట్లో పస్తులు లేకుండా చూడు. నిన్ను పదే పదే కోరుతున్నదల్లా ఈ ముష్టి బ్రతుకునుండి వేగంగా విముక్తి చెయ్యి. నా కోరికలను విని నీవు దయతో సహాయం చేస్తావని అనుకొంటున్నాను" అని ప్రార్థన ఆపుజేసాడు.

"ఓసే ! ఆదెమ్మా, తెల్లారి పోయింది. నిద్దుర నుండి లే. నేను పన్లోనికి వెళ్తున్నాను. పిల్లలకి నీలుపోసి తల దువ్వి స్కూలుకు పంపించు. అన్నట్టు మర్చిపోయాను నిన్నటి గింజలు వున్నాయి గదా ! అవి వేగంగా వండి పిల్లలకు పెట్టు. అసలే ఇది ఎండాలం. కడుపులో ఏమీ లేకపోతే యీమాయించి చచ్చిపోగలరు" అంటూ గోడకు వేలాడుతున్న సంచిని చేతిలోనికి తీసుకున్నాడు. ఒక చేత్తో వెదురు కర్ర పట్టుకొన్నాడు జోగయ్య.

ఇంటినుండి జోగయ్య అడుగులు రోడ్డు మీదకు పోయాయి. ఆ రోడ్డునుండి వీధులుండే వైపు నడిచాడు. ఇంత తెల్లవారే ముష్టికి వెళ్తే నలుగురూ తిడతారు అని మనసులో అనుకుంటూ వీధి చివర ఖానా దగ్గర బద్దకం తీర్చుకుని కూర్చున్నాడు. సెకండ్లు, నిముషాలు, గంటలు కూడ గడుస్తున్నాయి.

సైరనూదింది. సరిగ్గా ఎనిమిది గంటలైంది. జోగయ్య ముష్టికి మంచి ఘడియలు వచ్చాయి అనుకుంటూ ఇల్లు ఇల్లు తిరుగుతున్నాడు. అక్కడక్కడ బియ్యం గింజలు, అక్కడక్కడ డబ్బులు పడుతున్నాయి.

"దుడ్డుముక్కలా శరీరం వుంది. కష్టపడి కూలినాలి చేసుకొని పొట్ట పోషించుకోవచ్చుగా" అని ఒకరంటే –

"కూలినాలి చేస్తే శరీరం కందిపోదు" ఎగతాళిగా ఇంకొకరంటున్నారు.

ఆ మాటలు జోగయ్య మనసును ఎప్పుడో గాయపరిచాయి. వాటిని లెక్కచెయ్యకుండా తన పనిని సాగించుకుంటున్నాడు. అది వేసవి కాబట్టి పదకొండు గంటలకే ఎండ విపరీతంగా వుంది. ఎండను చూసి భయపడి తన పనిని ఆపుజేసాడు.

ఇంటికి వెళ్లేముందు తన సంచిలో వున్న బియ్యాన్ని చూసి మురిసిపోయాడు. దేవుడు తన మొరను ఉదయాన్నే ఆలకించి ఈ రూపాన సహాయం చేసాడు. 'దేవుడు కరుణామయుడు' అంటూ మనసులో మ్రొక్కుకొన్నాడు జోగయ్య.

వేగంగా ఇంటికి చేరుకొన్నాడు జోగయ్య. "ఓసే ! ఆదెమ్మా, చూడు ఈ రోజు దేవుడు కరుణించాడు" అంటూ సంచిలో వున్న బియ్యాన్ని చూపించాడు. "మావా, మన మీద దేవుడికి గురి వుంది" అంది ఆదెమ్మ. "అది నిజమే గాని ఈ బియ్యం మూడు రోజులు వరకు వస్తాయి. ఈ మూడు రోజులు నేను కూలికి వెళ్తాను" అంటూ బియ్యంలో డబ్బులు ఏరడం ప్రారంభించాడు జోగయ్య.

"మావా, ఈ రోజు డబ్బులు ఎంత వచ్చాయి ?" అని ప్రశ్న వేసింది ఆదెమ్మ. "డబ్బులా ! లెక్కపెడుతున్నానే. వుండు చెప్తాను" అంటూ లెక్కపెట్టడం ప్రారంభించాడు. "సరిగ్గా మూడు రూపాయలు ఈ రోజు వచ్చాయి" అన్నాడు జోగయ్య.

"మావ ! నువ్వు ఇంతవరకు దాసిన డబ్బు ఇదిగో" అని డబ్బు సంచి అందించింది ఆదెమ్మ.

"ఈ మూడు రూపాయలతో నూరు రూపాయలైంది. ఈ నూరు రూపాయలతో చిన్న చిల్లరకొట్టు పెట్టవచ్చు. ఆ చిల్లర కొట్టులో నువ్వు కూర్చుని అమ్ముతుంటే నేను రోజుకూలి పనికి వెళ్లడం జరుగుతుంది. అప్పుడు మన ఇద్దరి ఆదాయాలతో సంసారాన్ని సాగించవచ్చు. ముష్టిబ్రతుక్కి స్వస్తి చెప్పి పది మందిలో గౌరవంగా బ్రతకవచ్చు" ఆనందంతో అన్నాడు జోగయ్య.

దగాకోరు పెద్దలు

''అది నిజమే మావా, మన బతుకు అందరికి హేళనగా వుంది. ఈ ముష్టి బతుకులకు దూరంగా వుంటే అందరూ మనల్ని విలువుండే మనుషుల్లా చూస్తారు. మన పిల్లల్ని కొద్దిగా చదివించి వాళ్ల జీవితాలకు మంచిబాట వేద్దాం. వాళ్లైనా ఈ మనుషుల్లో తల ఎత్తుకుని తిరిగేటట్టు చెయ్యాలి. వాళ్ల జీవితాలు మనలా ముష్టి జీవితాలు కారాదు. ఈ ముష్టి జీవితాలు...'' అని ఆవేశంతో అంది ఆదెమ్మ.

''పిల్లల జీవితాలు ముష్టిజీవితాలు కారాదు అని నాకూ వుంది మనసులోన. ఆ దేవుడు కరుణించి మనకు తోడైతే పిల్లల జీవితాలకు బంగారు బాట వేస్తాను'' అని రెండు చేతులతో దేవుడ్ని మొక్కాడు జోగయ్య.

*　　　*　　　*

ఈ ముష్టి బ్రతుకు జోగయ్య స్వంతంగా ఈనాడు కల్పించుకోలేదు. తాతలు తండ్రులు వృత్తిగా స్వీకరించారు. తన తండ్రి ఏ ఆస్తి మిగల్చకపోయినా వారసత్వపు హక్కుగా ఈ వృత్తిని మిగిల్చాడు. ముష్టి ఎత్తుకొని బ్రతుకుతే ఈ సమాజంలో తన విలువ తగ్గిపోతుంది అని తెలుసు. కాని ఏం చెయ్యగలడు ? జానెడు పొట్టకోసం ఈ ముష్టి బ్రతుకు.

జానెడు పొట్టకోసం ముష్టి బ్రతుకే ఎందుకుసాగించాలి? కూలిచేసుకొని బ్రతకవచ్చుగా అని కొందరు ప్రశ్నించవచ్చు. కూలిచేసుకొని బ్రతుకుదామంటే తన భార్య తోడు వుంది. కూలి రోజంతా చేస్తే తన ఒక్కడి కడుపే నిండుతుంది. తన భార్య, పిల్లల కడుపుల నింపాలంటే ఈ ముష్టి బ్రతుకు ఒక్కటే మార్గమైంది జోగయ్యకు !

తన కడుపే నిండకుండా వుంటే పెళ్లి ఎందుకు చేసుకొన్నాడు ? అని చాలమంది ప్రశ్న వేస్తారని తెలుసు. కాని ఏం చెయ్యగలడు. ఈ మానవ జన్మలో ఏ సుఖం ఇంతవరకు అనుభవించలేదు. పెళ్లైతే చచ్చాక స్వర్గంలో ప్రవేశానికి అర్హత వుంటుంది అని నమ్మకం జోగయ్యకు. అక్కడైనా తనకి సుఖం శాంతి తోడు వుంటాయని. అంతేకాని వేరే అభిప్రాయం కాదు. అలా అని సంసారం సాగించకుండా వున్నాడా అంటే, పిల్లలున్నారు.

ఏ తండ్రి అయిన కోరేది కొడుకులు తనకంటే పెద్ద స్థాయిలో వుండాలని. అలాగే జోగయ్యకూడ ఒక తండ్రి కాబట్టి తమా కోరేది పిల్లలు తనకంటే పెద్ద స్థాయిలో వుండాలని.

పిల్లలకి బడిలో చదువుకోడానికి పంపించి వాళ్లకి అక్షరమ్ముక్కలు అబ్బి ఏదో వుద్యోగము వచ్చేటట్టు చేయాలని జోగయ్య అభిలాష. కాని పిల్లలు పలక బలపము పట్టుకొని బడిలోనికి వెళ్తే గొప్పోళ్ల పిల్లలు తన పిల్లల్ని చూసి అసహ్యించుకొంటారు. ఒక్కొక్కసారి ''ఈల్లు ముష్టోల్లు పిల్లలురా ! వాళ్ల బట్టలు చూడు సింకి బట్టలు, బుర్ర చూడు తాడికాయలా వుంది. జుత్తు చూడు రాగి జుత్తులావుంది. బుర్రకు మూనె రాయరుగా మరి ఎలావుంటుంది'' అని కొందరంటే —

''ముష్టోల్లు పిల్లలకి చదువట. ఈడి పక్కన కూర్చుంటే జబ్బులు అంటుకుంటాయి. ఈడికేసి ఎళ్లకండి'' అని కొందరు గొప్పోళ్ల పిల్లలంటారు.

ఈ గొప్పోళ్ల మాటలు తనపిల్లల గుండెల్లో సూదిరాయిలా గుచ్చుకున్నాయి. ఆ గొప్పోళ్ల పిల్లలనే మాటలు విని తన పిల్లలు ఒక్కొక్కసారి ''అయ్యా ! మనం ముష్టోళ్లమా ? మన దగ్గరకు వచ్చినవాళ్లకి జబ్బులు అంటుకుంటాయా ?'' అని అమాయకంగా ప్రశ్నలు వేస్తుంటారు.

పిల్లలు వేసే ప్రశ్నలకు సమాధానం చెప్పక మనసులో కుమిలి కుమిలి ఏడుస్తుంటాడు. ''ఈ సమాజంలో గొప్పోళ్ళు బ్రతకడానికే హక్కు వుంది. నాలాటి ముష్టోల్లు బ్రతకడానికి ఈ గొప్పోళ్ల సమాజం వొప్పుకోదు. ఆ దేముడు నాలాటి ముష్టోల్ల శరీరాలలో ప్రాణాలు వుంచుతాడు. ఆ దేముడుకు తెలియదా ? ఈ సమాజం ఒక్క గొప్పోళ్లకే పరిమితం ముష్టోల్లకి చోటు లేదు అని. తెలుసు ఆ దేముడికి ఈ సమాజం గొప్పోళ్లదని. కాని ఈ గొప్పోళ్ల సమాజంలో తనలాంటి ముష్టివాళ్లని పుట్టించి పడే కష్టాలు చూస్తూ ఆనందించాలని కోరిక కాబోలు దేముడుకు'' అని మనసులో ఆవేశంతో అనుకొనేవాడు. జోగయ్య మనసు ఎప్పుడో రాయిగా మారిపోయింది. ఒక్కొక్కసారి రాయి కరుగుతుంటుంది. అప్పుడే ఇలాంటి ఆవేశపు మాటలు వస్తుంటాయి.

*　　　*　　　*

తను, తన భార్య కలసి ప్లాను వేశారు ఇంటిముందు కొట్టు పెట్టడానికి. కొట్టులో సామాన్లు చుట్టలు, బీడీలు, సిగిరెట్లు వగైరా వగైరా కొనడానికి నిర్ణయించుకున్నారు.

ఆ రోజు సాయంత్రం జోగయ్య బజారుకు వెళ్లాడు. బజారులో వింతలు విశేషాలు చూశాడు. కడుపు ఆకలికి తట్టుకోలేకపోతోంది. ఇంటివైపు దారితీశాడు. ఇంటి దగ్గర భార్య వంట చేసి పక్కమీదకు వెళ్లింది. పిల్లలు ఆకలి ఆకలి అంటూ ఒకటే గోల చేస్తున్నారు. ''అబ్బా... అబ్బా... ఏమిటి ఈ గోల? బజారుకు వెళ్తే బస్సుల గోల ఇంటి దగ్గర పిల్లల గోల నన్ను విశ్రాంతిగా బతకనీయరు'' అన్నాడు కోపంతో జోగయ్య.

''మావా, నువ్వు ఈ ఒక్క చణంకే పిల్లల బాధ భరించలేకపోతే నేను రోజంతా ఈ పిల్లలతో గడుపుతున్నాను. నేను ఈ పిల్లలతో ఎంత బాధ భరించాలి?'' అంటూ పక్కమీద నుంచి లేచింది ఆదెమ్మ.

''అలా అనకే, నువ్వు నిజంగానే పిల్లలతో బాధ పడుతున్నావే, నేను కాదన్నానా. ఆ భగ

తలక్రిందులు

లోకంలో సహజంగా
పుచ్చుకునేవాడు ఇచ్చేవాడికి లోకువ !
ఓట్ల సంగతికి వస్తే
ఇచ్చేవాడు పుచ్చుకునేవాడికి లోకువ !

—సౌభాగ్య

ఢిల్లీ ఐ.ఐ.టి. తెలుగు సమితివారు ఏర్పాటు చేసిన ఉగాది కార్యక్రమాలలో శ్రీ కె.వి. బలరాం మూర్తి రచన ''ఇల్లలికిన ఈగ'' నాటకంలో శ్రీమతి గాయత్రి గోపాల్, శ్రీ పి. గోపాల్‌మణి, శ్రీ ఆర్. ఎల్. నరసింహం, శ్రీ ఎస్. గోపాల్, శ్రీ జె. వి. ఎస్. గుప్త.
(నిర్వహణ : శ్రీ ఆర్.ఎల్. నరసింహం, దర్శకత్వం: శ్రీమతి ఇందిరారావు)



ంతుడికి మనమీద దయలేదే. దానికి మనమేమి చెయ్యలేం. కొద్దిగ గెంజన్నం పిల్లలకి నాకు పెట్టు'' అన్నాడు.

'అలాగే' అంటూ అన్నం వుండే మట్టి కుండ వైపు వెళ్ళింది. పిల్లలకు భర్తకు వడ్డించి తను కూడ కొద్దిగా గెంజికూడు తెచ్చుకొంది. అందరూ తినేసారు.

నిద్రాదేవత వేగంగా జోగయ్య ఇంటికి వచ్చేసింది. అందరూ నిద్రపోయారు.

*　　　*　　　*

అగ్నిదేవుడికి చాలా రోజులుగా తిండిలేదు. ఆకలిని ఆపుకోలేకపోతున్నాడు. సరిగ్గా అర్ధరాత్రి 12 గంటలు అవుద్ది. ఆకలి భరించలేక జోగయ్య వుండే వీధిపై పడ్డాడు. పేదోళ్ళ గుడిసెలతో ఆకలి తీర్చుకుంటున్నాడు. జోగయ్య వుండే గుడిసె కూడ మింగేశాడు. జోగయ్య చేసేది ఏమిలేక పిల్లలతో, భార్యతో బయటికి వచ్చేసాడు. ఇల్లు బూడిద అయిపోయింది. ఇంటిలో దాచుకున్న వందరూపాయలు బూడిద అయిపోయాయి. మట్టి కుండలు బద్దలయ్యాయి. సిల్వర్ గిన్నెలు కరిగిపోయాయి. బట్టలు, మంచాలు కాలిపోయాయి. బూడిదయిన వంద రూపాయలు జ్ఞాపకం తెచ్చుకొని కంట నీరు పెట్టుకున్నాడు జోగయ్య.

జోగయ్యలా కంటనీరు పెట్టుకొంటున్నారు ఆ వీధివాళ్ళు. ఆ వీధి వాళ్ళే కాదు మరో రెండు వీధి వాళ్ళు కూడ. అగ్నిదేవుడికి మూడు వీధులతో ఆకలి తీరింది.

ఇంకా తినేయాలనుకున్నాడు కాని అగ్ని మాపకదళం వారు వచ్చి తను తినే తిండిలో నీరు పోశారు. తనకు శత్రువైన నీటి ముఖం చూసి చేసేది ఏమీలేక తన లోకానికి వెళ్ళిపోయాడు అగ్నిదేవుడు.

ప్రభుత్వం వారి దృష్టిని పడింది ఈ సంఘటన. తహశీల్దారు, ఆర్. డి. ఓ. వచ్చారు ఆ స్థలానికి.

''ఎన్ని ఇళ్ళు కాలిపోయాయి ? ఎంత ఆస్థి నష్టం వచ్చింది ?'' కనుక్కొని లెక్క వేసుకొని కలక్టరు దగ్గరకు వెళ్ళారు

కలక్టరు ఇళ్ళు కట్టుకునే నిమిత్తం ఇంటికి రెండేసి వందలు మంజూరు చేశాడు. డబ్బు పంచడం కూడ జరిగింది. జోగయ్యకు వంద పోయినా రెండు వందలు వచ్చాయి.

ఇళ్ళు కాలిపోయి రెండు రోజులైపోయింది. ప్రజాప్రతినిధి శాసన సభ్యుడు అయిన ఆ నియోజక వర్గం ఎమ్. ఎల్. ఎ. వచ్చాడు. నిరాశ్రితులైన మనుషులను కలుసుకొన్నాడు.

''మీకు చాల అన్యాయం జరిగిపోయింది. ఇలా జరుగుతుందని నేను కలలో కూడ వూహించ లేదు. అసలే మీరు పేదప్రజలు. అందులో మీరు నా ప్రజలు. నా నియోజక వర్గం ప్రజలు, ఇంత నిస్సహాయులై వుండడం నేను సహించ లేను'' అంటూ మొసలి కన్నీరు కార్చాడు.

ఆ శాసన సభ్యుని కన్నీరుని చూసి నిరాశ్రు లైన మనుషులు ఆశ్చర్యపోయారు.

శాసన సభ్యునితో వచ్చిన కొంతమంది పెద్దలు శాసన సభ్యుని వారిస్తూ ''మీ నియోజక వర్గంలో ఇలాంటి సంఘటన జరగడం మేము చాల విచారిస్తున్నాం. ఈ రోజు నుండి వూర్లో తిరిగి చందాలు పోగుజేసి వీరికి సహాయం చేస్తాం. ఈ విషయం గురించి మీరు బాధ పడకండి'' అన్నారు.

శాసన సభ్యుడు కంటినీరు తుడుచుకొని ''సోదరలారా ! మీకు ఎప్పుడు కూడ అగ్ని భయం లేకుండా పెంకుటిల్లులు కట్టమని ప్రభుత్వానికి చెప్తాను. మీరు విచారించకండి. ఈ సంఘటన పీడకలలా భావించండి.''

శాసనసభ్యుని మాటలు జోగయ్యకు, జోగయ్యలాంటి మనుషులకు ఆనందం కల్గించాయి.

''ఇక సూర్యచంద్రుళ్ళు మా యింటికి రాలేరు. మావి ఇహ పెంకుటిళ్ళు. ఈ సమాజంలో విలువుండే స్థానం నాకు వస్తుంది. నేను విలువుండే మనిషిని'' అని మనసులో వూహించుకుంటున్నాడు జోగయ్య.

''లోకమంతా డబ్బు మయమైపోయింది అని మీకు తెలుసు. మీకు ప్రభుత్వంవారు ఇల్లు కట్టుకోమని రెండేసి వందలు ఇచ్చారు. ఆ డబ్బుతో మీరు ఏ పూరిపాకలు కట్టకుండా నాకు అందజేస్తే నేను మీకు నెల రోజులలో పెంకుటిల్లులు కట్టించే ఏర్పాటు చేస్తాను.''

''నేను హైద్రాబాద్ రేపు వెళ్ళి అక్కడ మన పరిస్థితి చెప్పి వాళ్లని వొప్పించి డబ్బు వెదజల్లి మీ పని సాగిస్తాను'' అని చెప్పాడు శాసనసభ్యుడు.

''రెండేసి వందలు పోయినా రెండు వేలు విలువ చేసే ఇల్లు దక్కుతాయి'' అని సంతృప్తి చెందారు నిరాశ్రయులైన మనుషులు. ప్రభుత్వం ఇచ్చే డబ్బును శాసనసభ్యునికి ఇచ్చేశారు. రాబోయే పెంకిటిళ్ల గురించి ఆలోచనలో పడ్డారు.

*　　　*　　　*

శ్మశానంలా తయారైన స్థలాన్ని శుభ్రం చేసుకుంటున్నారు. జోగయ్య ఆకలికి తట్టుకోలేక పోతున్నాడు. పిల్లల ఏడుపులు చూస్తే తనకు జాలివేస్తుంది. ముష్టికి బయలుదేరాడు.


''బాబు ! ఇల్లు కాలిపోయింది పిల్లలు ఆకలితో ఏడుస్తున్నారు. ఏదైనా వుంటే కొద్దిగ సహాయం చెయ్యండి'' అని ప్రాధేయ పడ్డాడు జోగయ్య.

''లేదు లేదు ఇదో వేషం. ఇల్లు కాలి పోయిందంటే సహాయం చేస్తాననుకుంటున్నావా? ఇప్పటికే వూరి పెద్దలు వచ్చి మా రక్తాలు పీల్చేటట్టు మా దగ్గర డబ్బు వసూలు చేశారు ఈ అగ్నిబాధితులకని. ఇంకా నీకుకూడ సహాయం చెయ్యాలా ?'' అని కసిరాడు ఒక వ్యక్తి.

ఆ వ్యక్తి మాటలకు తలవంచుకొని ఇంకో ఇంటివైపు దారితీశాడు. అక్కడకూడ ఇవే మాటలు ! ఎక్కడ ఏమి దొరకక పోవడంతో మెయిన్‌రోడ్డువైపు దారితీశాడు. ఎక్కడ నుండో ఎవో మాటలు అరుపుల్లా మైక్‌ద్వారా విన్పిస్తున్నాయి:

శబ్దాన్ని గ్రహించి, అటువైపు వెళ్ళాడు. మైక్‌నుండి వచ్చేమాటలు శ్రద్ధగా ఆలకించడం మొదలుపెట్టాడు జోగయ్య.

''ప్రజలారా ! మొన్నరాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో సుమారు మూడు వందల ఇళ్ళు కాలిపోయాయి. ఆ ఇళ్ళ గలవారు చాల పేదవాళ్ళు. వాళ్ళు నిరాశ్రయులై వీధిన పడ్డారు. వస్తులతో వుంటున్నారు. వాళ్ళు కూడ మనలాంటి మనుషులే వారిని ఈ పరిస్థితిలో ఆదుకోవడం మనకర్తవ్యం. అందు గురించి మీ దగ్గరకు వస్తున్న వ్యక్తులకు మీరు



దగాకోరు పెద్దలు

సహాయం చేయదల్చిన వస్తువులను, డబ్బును ఇయ్యండి. మీ దగ్గరకు వస్తున్న వ్యక్తులు ఈ వూరి పెద్దలు మరియు పార్టీ కార్యకర్తలు.''

జోగయ్య హృదయం ఆనందంతో నిండి పోయింది. ''మనిషిలో ఇంత న్యాయమైన గుణం వుందా ? మనిషికి బాధ్యత కర్తవ్యం పదాలు గుర్తున్నాయా ? సాటి మనిషి కష్టసుఖాలను పంచుకుంటున్నాడు ఇది ద్వాపరి యుగమా ? స్వాతంత్ర్యం పదానికి అర్థం తెచ్చే రోజా ఇది. బాపూజీ కలలు ఫలించే రోజు. ఇది సామాన్య మానవుడికి స్వాతంత్ర్యం వచ్చే రోజా ?'' ప్రశ్నలు మీద ప్రశ్నలు వేసుకుంటున్నాడు.

ప్రతి ప్రశ్నకు సమాధానం చెప్పాలని అనుకొన్నది మనసు, కాని హృదయంలో వుండే ఆనందం సమాధానాలు వినబడకుండా గోల చేస్తుంది. అగ్నిబాధితులకు చందాలు వసూలు చేస్తున్న వ్యక్తులందరూ దేవుళ్లలా కన్పిస్తున్నారు జోగయ్యకి. వాళ్లని మరో వెయ్యేళ్లు బ్రతకమని దీవించాడు. లేనిశక్తిని కూడదీసుకొని ఇంటివైపు దారితీశాడు.

''ఆదెమ్మ ! ఇల్లు కాలిపోవడం మన అదృష్టం. గుడెసెపోయి పెంకుటిల్లు, తిండికి గింజలు వంటికి బట్ట ఇంకా ... ఇంకా ... '' ఏవేవో చెప్పబోయాడు జోగయ్య.

''తిండికి గింజలు వంటికి బట్ట ఏమిటి మావ ? '' అర్థంకాక ప్రశ్నించింది ఆదెమ్మ.

''అదేనే మానూరిలో పెద్దలు మన లాంటోల్లు వస్తులుతో వుంటున్నారని వూరిలో బియ్యం, బట్టలు, డబ్బు దండుతున్నారు. అవి మనకి త్వరలో ఇస్తారు'' నవ్వుతూ అన్నాడు.

''అబ్బా! దేవుడికి మన మీద ఇప్పటికి దయ కలిగింది'' అంటూ రెండు చేతులెత్తి సూర్యుడు వుండే వైపు తిరిగి నమస్కరించింది.

* * *

రోజులుగడిచాయి. వారాలు గడుస్తున్నాయి. నెలల గడుస్తున్నాయి. వూర్లో చందాలెత్తిన బియ్యం, డబ్బులు, బట్టలు పంచలేదు. ఆ పెద్దమనుషులు కూడ కన్పించలేదు. ''అగ్ని భాదితులకు సహాయం'' అని తమ పేరు పెట్టి బియ్యాన్ని, డబ్బుని, బట్టల్ని దోచుకున్నారని తెలుసుకొన్నాడు జోగయ్య.

శాసనసభ్యుడు కూడ తమ దగ్గిర డబ్బును దోచుకున్నాడని ఊహించాడు. తను ఎవరినైతే వెయ్యేళ్లు జీవించమని దీవించాడో వాళ్లని వెయ్యి సెకండులు కూడ బ్రతకనియ్యెద్దని దేవుణ్ణి కోరుకొన్నాడు.

పేదోళ్ళి పీక్కుతినడానికే ఈవూరి పెద్దలు. వీళ్లు దగాకోరు పెద్దలు ! దగాకోరు పెద్దలు !! దగాకోరు పెద్దలు !!! ★

అగ్ర రచయిత్రి !

ప్రపంచ ఖ్యాతి గడించిన డిటెక్టివ్ నవలా రచయిత్రి అగథాక్రిస్టి రచనలు 26 దేశాలలో 282 భాషలలోకి అనువదింపబడ్డాయట. ఇంత బహుళ ప్రచారంకల రచయిత్రి [రచయితయినా] ప్రపంచంలోనే లేదట. ఆ తరువాత బ్రిటిష్ రచయిత్రి బార్బరా కార్ట్ ల్యాండ్ రచనలు 137 భాషల్లోకి, ఎనిడ్‌బ్లయిటన్ అనే రచయిత రచనలు 117 భాషలలోనికి, విఖ్యాత రచయిత్రి పెరల్ బక్ రచనలు 83 భాషలలోనికి అనువదింపబడ్డాయట.

తమ్ముడి తప్పుకి అక్కకు శిక్ష !

బెల్గాంజిల్లా గోరాక్ తాలూకాకు చెందిన యారగణని గ్రామానికి చెందిన భీమప్ప అనే అతన్ని సూసవ్వ అనే వో వివాహిత ప్రేమించి, తన నగలూ, నగదూ అంతా మూట గట్టుకుని ఆ భీమప్పతో లేచిపోయిందట. ఆ సూసవ్వకు నలుగురు పిల్లలుట కూడాను. ఆమె పోలీసు పటేల్ చెల్లెలట. దాంతో ఆ పటేలు, సూసవ్వ మొగుడూ మరో యిద్దరు అనుయాయులతో చేరి భీమప్ప యింటి మీదపడి "నీ కొడుకేడి" అని కన్నడంలో భీమప్ప తల్లి సత్తెవ్వనడిగి, ఆమె తెలీదు అని మొరపెట్టుకుంటే ఆ కక్ష చల్లారక, భీమప్ప అక్క నిండు చూలాలు లక్ష్మవ్వనూ వివస్త్రగా చేసి, ఆమెతో తమ కామ దాహం తీర్చుకుని, అంతతో ఆగక, ఆమెను తమ కార్లో ఎక్కించుకు గోవా తీసుకుపోయి, అక్కడ అయిదురోజులామెను అనుభవించి, అనక పోలీసుల పరిశోధనలో పట్టుబడి పోయారట. ఇపుడు లక్ష్మవ్వ మొగుడు ఆమె కులటనీ, ఆమెతో కాపురం చేయననీ అంటున్నాట్ట...





తనయుని ప్రతిభకి తండ్రి ప్రోద్బలం !

మాంఛెస్టరు విశ్వవిద్యాలయంలో కంప్యూటరింజనీరింగు మొదటి ఏడు చదువుతున్న డేనియల్ ఇసాయెన్ అనే యువకుడు తన తండ్రి ప్రోత్సాహానికి తన మేధస్సు జతచేసి తన 18 వ ఏటనే కంప్యూటర్ విద్యార్థులకు పనికి వచ్చే మూడు పుస్తకాలు వ్రాశాడట. అంతేగాక మైక్రో కంప్యూటరు వొకదానిని తయారు చేసి అమ్మి బోలెడు డబ్బు సంపాదించాడట. ఈతని తండ్రి కేవలం వో పత్రికా ఉపసంపాదకుడట. ఆ యువకుడు తన ప్రతిభకి కేవలం తన తండ్రి ప్రోద్బలమే కారణమని, అట్టి తండ్రికి కొడుకు నవడం నా అదృష్టమంటాడట — నాచురల్లీ.

ప్రేమ పరీక్ష !


బవేరియాకు చెందిన కాథరినా బొడెల్ అనే రాగిరంగు జుట్టు సుందరిని జోభిన్‌స్క్రండ్సర్, విధెత్మస్టిర్లీ అనే ఇద్దరు కాలేజీ యువకులు ప్రేమించి ఆ విషయ మామెకు తెలియజేస్తే ఆమె దంతాలు కనిపించేలా నవ్వి "మీ రిద్దరూ కత్తి యుద్ధం చేయాలి. ఎవరు ముందు అవతలివారిని గాయపరుస్తారో వాడే నా నాథుడు" అందట తెలుగు సినిమా జానపద హీరోయినులాగ. వారిద్దరూ కష్టపడి, కత్తులు సంపాదించి నూతన సంవత్సరారంభంలో టంఠం అంటూ కత్తి యుద్ధ మారంభించి, అది బొత్తిగా రాక, ఒకేసారి ఇద్దరూ గాయాలు చేసుకున్నారట. దాంతో ఆ రాగి కేశ సుందరి పెదిమ చప్పరించి, చూపరులలో ఒకర్ని ఎంచుకుని, కమాన్ డియర్ అని వాడితో లేచిపోయిందట.

అసభ్య ప్రవర్తనకు నిరసనగా తూర్మావతారం !

అమెరికా మెస్సాచు సెట్స్‌లో సిల్వో ఓకాన్టి అనే కాంగ్రెసు అభ్యర్థి వాషింగ్టన్‌లో ఒక విలేఖరుల సమావేశానికి పంది ముఖం వున్న తొడుగు వేసుకువచ్చాట. వాటీజ్దిస్ అని విలేఖర్లు అడిగితే వ్యవసాయ అభివృద్ధి పథకాలకు ప్రభుత్వ రంగాలలో విశేష పరపతి కలవారి వైపే మొగ్గుతోంది కాని, అసలు సహాయం కావాల్సిన వారికి సహాయం చేయడమేలేదని, యీ ప్రభుత్వ అసభ్య ప్రవర్తనకు నిరసనగా తాను ముఖానికి పంది ముఖం తొడుగు వేసుకున్నాననీ చెప్పాట్ట — బాగుంది కానీ ఆ తొడుగు టెంప్రరీయా, పర్మనెంటా ! !

ఆకుల ఆచ్ఛాదనతో ఆరాధన !

న్యూఢిల్లీకి చెందిన చంద్రగుట్టి గ్రామంలో రేణుకాంబ జాతరకు ఆడవారంతా నగ్నంగా పూజలు చేయడం ఆచారమట. ఈ ఏడూ వారలా చేయబోయేసరికి కనీసం అసలు భాగాలకు ఆకులయినా చుట్టుకోండి అని పోలీసులు వారిని బ్రతిమాలారట. దాంతోవారు మొలలకు ఆకులతో కుట్టిన ఆచ్ఛాదన కట్టుకుని, పై భాగాన్ని పూలదండల మాటున దాచేశారట.



అడ్డం తిరిగిన కథ !

అరియగ వుండంపట్టి (తమిళనాడు)కు చెందిన 18 ఏళ్ళ మల్లికకు ఎనిమది నెలలక్రితం రాజశేఖరనే అనే అతనికీ వివాహమయిందట. మల్లిక తండ్రి ఆమెకు పది కాసుల బంగారం, రాజశేఖరుకు ఒకటిన్నర కాసులో వో గొలుసూ వగైరాలు పెట్టి, ఇతర లాంఛనాలతో పెళ్ళి చేశాడట. అనక సంక్రాంతి పండుగకు తనకు స్కూటరు కావాలని మల్లిక తండ్రిని అడుగమని ఆమె భర్త ఆమెను బలవంతం చేశాట్ట. దానికామె ముక్తసరిగా "ముడియాదు"అని అరవంలో చెప్పేసరికి అతను చితక బాదాడట. ఆమె ధైర్యంగా మా నాన్నదగ్గర డబ్బులేదు. వున్నదంతా ఖర్చుచేసి యీ పెళ్ళి చేశాడు అందట. దాంతో రాజశేఖర్ ఆమె బట్టలూడదీసి నగ్నంగా చేసి, ఇంట్లో వో స్థంభానికి కట్టేసి, అతనూ, అతని తల్లీ, తండ్రీ చేరి ఆమె చేతులమీదా, బుగ్గలమీదా వాతలు పెట్టారట. మామగారామె బుగ్గమీదో వాత పెట్టాడట. ఈ బాధలు భరించలేని మల్లిక యధాలాపంగా వచ్చిన తన అన్నతో యిదంతా చెప్పి యింటికొచ్చేసి పోలీసు ఫిర్యాదు చేసి వాతలు చూపి, ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సకు చేరిందట.

మంథా వెంకట రమణారావు సీరియల్

ఉదయసంధ్య

రామం పద్యాలు చదివి అర్థాలు చెప్పడం ఆరంభించేడు. పుస్తకం తీయించి రాయించేడు. రత్నం బుద్ధిగా కూర్చొని రాసింది. అంకమ్మ వచ్చి కూతురు బుద్ధిగా చదవడంచూసి మురిసిపోయింది. వరలక్ష్మి గదిలోలేదు. అంకమ్మ రామంతో తన ఇంటి సంగతులు చెప్పడం ప్రారంభించింది. "ఏటో నాకేటీ తోచడంలేదు. ఇది ఎదిగిపోతన్నాది...యింకా ఆరోక్లాసే. దీనికి ఒక పంవత్సరం యింటికాడ సదువు సెప్పించి పెద్ద క్లాసులో సేర్చాల. బాబూ దీనికి నువ్వే సదువు సెప్పాల, నీకు తీరుబాటున్నప్పుడే... ఉత్తినే సెప్పక్కర్లేదు...ఆ మేష్టరుకిచ్చిందినీకిస్తాను"

"ఈ ఊళ్ళో ఉంటే తప్పకుండా చెప్తాను. నాకేం డబ్బు మాత్రం ఇవ్వకండి..." రామం అన్నాడు. తన పరీక్షలయిపోగానే పల్లెటూరు పోవాలి. పరీక్ష పాసయ్యేక ఉద్యోగ ప్రయత్నాలు.

"ఉండకేడికి పోతావ్ ... కాలేజీలో చదవ్వా..." అంది రత్నం.

"ఆ చదువు జరగదు. ఫీజుకీ, పుస్తకాలకీ చాలా డబ్బవుతుంది. ఇక్కడ బసా, భోజనం కష్టం. నాన్నకి ఆ స్థోమతలేదు."

రత్నం ముఖం వాడిపోయింది. అంకమ్మ నవ్వుతూ అంది... "వాయసు కుదరనేదుకాని, నిన్నల్లుడ్ని సేసుకొని యిల్లరికం ఉంచేసుకుందును...అప్పుడు నీకు డాకటరీ సెప్పించుదును..."

రత్నం ఆ మాటలకి కిలకిలా నవ్వింది... రామం సిగ్గుపడ్డాడు. ఈ మాటలు చాలాసార్లు సరదాకి అంకమ్మ అంటూ ఉంటుంది. తనకి ఇబ్బందిగా ఉంటుంది... "ఆళ్ళు బేమ్మళ్ళే అమ్మా...ఆళ్ళకీ మనకీ సాటేటి. యేం రామం... నువ్వు మా యింట్లో అన్నం తింటావా ?..." రత్నం అడిగింది...

తనకీ రామునికీ పెళ్ళిసంగతి అంకమ్మ అన్నప్పుడల్లా హాస్యంగా ఉంటుంది రత్నానికి... ఎందుకంటే అది ఎప్పుడూ జరిగే పనికాదు. అందుకు రామాన్ని ఆటపట్టించడంలో పోయిం

(గత సంచిక తరువాయి)

దేమీలేదు. తన ఆధిక్యత రామంమ్మీద అక్కడే. తనని శాసించేవాడు తనముందు సిగ్గుపడి, తడబాటుపడడం ఈ కబుర్లొచ్చేసరికే.

అంకమ్మ అందుకుంది..."దీనికెవుడ్నోజూసి పెళ్ళి సేసేస్తాను. మీ మావంటాడుగదా కసింత సదువుకున్నోడ్ని సూద్దాం అని. సదువుకున్నోడు కావాలంటే మా కులంలో ఎంత కట్నమియ్యాలో నీకు తెల్దు...కసింత సదువుకుంటే మంచిసంబంధమొస్తది. ఆడెవుడో కరగ్‌పూర్‌లో కలాసీ కొడుకున్నాడని మా ఈరగాడు రాసేడు. ఆడు ఇంజన్‌లో బొగ్గేస్తాడంట ... బాబూ ... యిదొక్కర్తె పెళ్ళికుండిపోయిన బొట్టె... దీన్నంత దూరం పంపడం నాకిష్టంనేదు. సరే ఆ సంగతొదులు. యిప్పుడు ముక్కెమైన యిషయం ఆదినారాయన. పరీచ్చపేసయి అత్తారింటికి యిల్లరికం పోతాడంట. ఫుట్‌బాలాడాలంటే ఈ ఊళ్ళో అవదా ? కలకత్తాయే ఎళ్ళి ఆడాలా? ఆడు మామాటినకుండున్నాడు. అసలు సంగతి, వొరలచ్మి, కిక్కడుండాలని నేదు. ఆడికక్కడే రెండుమూడొందలు దొరుకుతాయి. మీ మావ ఆడికి పనినేర్పి మోట్ర మెకానిక్‌గా తయారు జేస్తానంటున్నాడు ... నువ్వే ఆడికి సెప్పాల..."

జరిగిన కథ — 4 : రామం వారాలు చేసుకుంటూ చదువుకుంటుంటాడు. దుర్గమ్మ కూతురు మీనాక్షి రామాన్ని ఆదరిస్తుంది. పూర్ణమ్మ ఇంటిలోని వీధి కొట్టులో రామం నివాసం. ప్లీడరు సీతారామయ్యగారి మేనకోడలు నిర్మలకు రామం అంటే ఇష్టం. శాంతమ్మగారి నడిగి వాళ్ళింట్లో గదిలో ఉండడానికి నిశ్చయించుకుంటాడు రామం. వెంకటేశ్వరులు రాసిన ప్రేమ పద్యాలు చదివి లత రామంమీద విరుచుకుపడి అతనిని అవమానిస్తుంది. శాంతమ్మ రామంను తమ ఇంటికి వచ్చి ఉండమని చెపుతుంది. రామం మాటలను పెడచెవిన పెడతాడు వెంకటేశ్వరులు. నిర్మలంటె విశాలకి పడదు. వరలక్ష్మి రామాన్ని రత్నాన్ని ఒక దారిలో పెట్టమని కోరుతుంది.

అప్పుడు వరలక్ష్మి గబగబా వచ్చింది... "అదేటత్తా...నా కెక్కడైనా ఒక్కడే... మీ యబ్బాయే కలకత్తా పోదాం కలకత్తా పోదాం అంటే అయ్యకి చెప్పేను...నన్ననకండి..." అంది విసురుగా.

రామానికి తను ఇవ్వగలిగిన సలహా కనిపించలేదు. ఎలా జరగవల్సిందలా జరుగుతుంది. ఎవరు చెప్పినా చెప్పకపోయినా ఆదినారాయణ వెళ్ళిపోకమానడు.

ఇంతలో ఆదినారాయణ రానేవచ్చేడు. చేతిలో కాలిబంతి...సరికొత్తది. ఆదినారాయణ రాగానే వరలక్ష్మి అంది... "అడగండి...నేనే చెప్పేనో అతనే అన్నాడో..."

"ఏటనడం..." విసురుగా అన్నాడు ఆదినారాయణ. మనిషి బాగా పొడుగు. కళ్ళల్లోకి జుత్తు పడుతూఉంటే తల ఎగరేసి మీదకి తీసుకోడం అలవాటు. మనిషిలో సున్నితత్వం తక్కువ. అందంకన్న పట్టుదల ఎక్కువగా కనిపిస్తుంది. దళసరి పెదవులు... కలసిపోయిన దళసరి కనురెప్పలు. పాదాలు పెద్దవి. బంతిని కొట్టి కొట్టి రాటుదేరి ఉన్నాయి.

"అయ్యకి నేనే రాసేనా... మీరు చెప్తే రాసేనా... రెయిల్‌వేలో ఉద్యోగం చూడమని... మనకేమో యిక్కడుండాలని లేదుట... మీ యమ్మంటున్నాది..." వరలక్ష్మి కంప్లెయింటిచ్చింది.

"నేనిక్కడుండను... యీ ఊళ్ళో ఏటుంది. హార్బరు టీము... షిప్ యార్డ్ టీము. కాలేజి టీమూ... యూనివెర్సిటీ టీము.. యింతేకదా ? మోహన్‌బగాన్...ఈస్ట్‌బెంగాల్.. బి. ఎన్. ఆర్. యిలా క్లబ్బులకాడాల... అప్పుడు పేరుకాని... అమ్మా... యీ బంతాటలో ఎంతో డబ్బుందే. పీవే అని ఒకడున్నాడే... ఆడు లక్షలార్జించేడే... యీ యిసాపట్నంలో కూచుంటే అయినట్టే...ఆ...యింకమీరెళ్ళండి.. నేను ఎస్సే రాసుకోవాల..." అని బంతి ఒక మూలకి విసిరి రత్నం భుజంమ్మీద ప్రేమగా కొట్టేడు.. "యేటి.. తెలుగు చదివేస్తున్నావేటే గుంటా... బావకాడ పాఠాలు నేర్చుకుంటున్నావేటి... ఆడికి తిరిగి నేర్పకు... అమాయకపు బాపనోడు..."

అందరూ పక పక నవ్వేరు ఆ జోక్‌కి రామం తప్ప. ఈ మోటు మాటలే రామానికిష్టంలేదు. ఈ వీధిలోంచి వెళ్తూ ఉంటే అంతా మోటుతనమే కనిపిస్తుంది. ఆడదానికీ, మగాడికీ సంబంధించిన సంగతులు బహిరంగంగా తిట్లలో ఉపయోగిస్తారు. ఆ తిట్లు పిల్లలూ, యువకులూ, యువతులూ మామ్మూలు సంగ



తుళ్లా వింటారు. అన్న మాటల అర్థం వెంటనే రత్నం సరిగ్గానే అర్థం చేసుకుంటుంది అందుకే. వాళ్లకది మామ్మూలు సంగతిలా ఉంది... ఆదినారాయణకి కోపం వచ్చినప్పుడు అశ్లీలాలు ఇంట్లోనే వాడతాడు... ఆ మాటలు విని సిగ్గు పడేసరికి వాళ్లకి తనంటే ఆటగా ఉంటుంది...

అందరూ గది ఖాళీ చేసేరు. ఆదినారాయణ టేబులుముందు కూర్చొని పుస్తకం పడేసి అన్నాడు..."రాయి..నువ్వే నాలాటి బంతిఆటగాడి వయితే నువ్వేం చెయ్యాలనుకుంటావో..."

"నాకు బంతాట తెలీదు... చెప్పు... నువ్వేం అనుకుంటున్నావో..."

"మా గురువు అన్నట్టు... యీ ఊరొది లేస్తేకాని బాగుపడదంరా... నాకు ఇండియాకి ఫార్వర్డ్‌గా ఆడాలని ఉందిరా... ప్రపంచం అంతా తిరగాలని ఉందిరా..." ఆదినారాయణ కలలు కనడం ఆరంభించేడు.

రామం రాయడం ఆరంభించేడు...

6

సెలెక్షన్సు అయిపోయేయి. రామం క్లాసుకి మొదటివాడుగా నిలబడ్డాడు. హెడ్ మాష్టారు రామానికి కబురు పెట్టేరు. హనుమంతరావు మాష్టారు పొట్టిగా, సన్నగా ఉంటారు. ఎప్పుడూ కారాకిల్లీ నవులుతూనే ఉంటారు. అది ఉమ్మడానికి అస్తమానం గదిలోంచి బయటకివెళ్తూ ఉంటారు. ఆ వెళ్తున్నప్పుడు పంచకట్టు విడిపోతూ ఉంటుంది. అది విడిపోయిందన్న గుర్తున్నా ఉండని మతి మరుపు. కళ్లజోడులోంచి ఎదురుగా చూస్తున్నా ఆలోచనలెక్కడో ఉంటాయి. చాక్లెట్ రంగు కోటు అతనికన్న పొట్టిగా కనిపిస్తుంది. అతని చేతిలో ఎప్పుడూ పేకబెత్తం ఉంటుంది. అతనికి ఆదినారాయణంటే భయంలేదు. ఎవరన్నా భయంలేదు. అతను ఇంగ్లీషు చెప్తారు. ఒకరోజు ఆదినారాయణని ఒక సులభమైన ప్రశ్న వేసేరు. వాడు జవాబు చెప్పలేకపోయిడు. బోధపరిచి, చెప్పమన్నారు. వాడు పెడసరంగా చెప్పేడు. క్లాసందరూ ఏం జరుగుతుందా అని ఎదురుచూస్తున్నారు. మాష్టారు కేన్ పట్టుక వెళ్లి "హోల్డవ్ యువర్ హేండ్!" అన్నారు. ఆదినారాయణ చెయ్యి ఎత్తలేదు... "హోల్డవ్!" అన్నారు రెండోసారి. వాడి చెయ్యి లేచింది. నాలుగు 'కట్స్' పడ్డాయి. ఆదినారాయణ బాధతో ముఖం చిట్లించలేదు. తొణకలేదు. దెబ్బలు తిన్నాక కూర్చున్నాడు ఏమీ జరగనట్టు పిల్లిలా.

హెడ్ మాష్టారి గదిలోకి అడుగుపెట్టేడు రామం. "నమస్కారం సార్!" అని నమస్కరించి భయపడుతూ నిల్చున్నాడు. "కూర్చోహోయి., కూర్చో!" ఆ కళ్లద్దాలలోంచి నవ్వే కళ్లతో మాష్టారు చూసేరు. రామం నిల్చొనే ఉన్నాడు.

హెడ్ మాష్టారు రామాన్ని ప్రేమగా చూసేరు. "ఇలారా..." అన్నారు మృదువుగా. రామం దగ్గరగా వెళ్లేడు. ఇప్పుడు కాలుకి కట్టు లేదు. కాని అక్కడ పెద్ద మచ్చ ఏర్పడింది.

హనుమంతరావు మాష్టారు రామం భుజం తట్టేరు...ఎదురుగా కుర్చీలో కూర్చున్న డ్రిల్లు మాష్టారిని చూస్తూ అన్నారు..."చూసేరా ఆంజనేయులు గారూ ఈ అబ్బాయిని? వారాలు

చేస్తూ చదువుకుంటున్నాడు. బుడ్డి దీపం ముందు చదువుకుంటున్నాడు ... సరైన బస లేదు...సరైన తిండిలేదు ... చదువుకుందుకి గైడ్‌లు లేవు...ఎండ్ యెట్...హి ఈజ్ ఎ జెమ్! ఎ జెమ్! మాష్టరూ! మనమంతా గర్వపడాలి...ఐ ఆమ్ ప్రౌడ్ ఆఫ్ యూ మై బోయ్!'' హెడ్ మాష్టారు ఇవాళ ఎమోషనల్‌గా మాట్లాడుతున్నాడు... ''చూడండి మాష్టరూ మార్కులు ... లెఖ్కలు నూటికి నూరు...గ్రూప్ లెఖ్కలు... నూటికి నూరు... ఇంగ్లీషు... ఇంగ్లీషు... అసలు నేను ఎలా దిద్దుతానో తెలుసును కదా? నేను ఇచ్చిన మార్కులకన్నా ఎపుడు పబ్లిక్‌లో పది మార్కులు ఎక్కువే వస్తాయి... నేను డెబ్బయ్యో ఇవ్వాల్సొచ్చింది... రామారావ్... నిన్నెందుకు పిలిచేనంటే ఒకే ఒక్క మాట చెప్పడానికి... ఇంతకన్న బాగా చెయ్యి పబ్లిక్‌లో... నువ్వు మొదటి రేంక్‌లో పాసవుతావు... అన్ని రికార్డులూ బీట్ చేస్తావు... ఆఁ... మరో సంగతి... నీ పరీక్ష ఫీజు నేను కట్టేసేను... ఇన్ ఎప్రీసియేషన్... నువ్వు దాని గురించి వర్రీ అవకు... నీకు ఏ పాఠాలు డౌట్‌గా ఉన్నా ఒచ్చి అడుగు. నీకు చదువుకుందుకి గది కావాలంటే రికార్డ్ రూమ్‌లో కూర్చొని పగలల్లా చదువుకో... ఎవ్వరూ నిన్ను డిస్టర్బ్ చెయ్యరు...''

ఇంత దయకి రామం తట్టుకోలేకపోయేడు. రెడీగా ఉన్న కన్నీళ్లు కళ్లల్లోకి వచ్చేయి. ''తమ ఋణం నేను తీర్చుకోలేను సార్... తమరి పాదాలని ఒక్కసారి ముట్టుకోనివ్వండి...'' అని మాష్టారి కాళ్లని ముట్టుకున్నాడు. హెడ్‌మాష్టారు కళ్లొత్తుకున్నారు. డ్రిల్లు మాష్టారు నిట్టూర్చేరు... ''ఈ పరీక్షలయేక బాడీబిల్డింగ్ ఆరంభించు... ఇలా ఈనపుల్లలా ఉంటే ఎందుకూ పనికిరావు...'' అని సలహా ఇచ్చేరు. ''అలాగే మాష్టరూ!'' అన్నాడు రామం.

ఇటీవల శ్రీ ఖలీల్ దర్శకత్వంలో ఖమ్మం జిల్లా కోర్టు రజతోత్సవాల సందర్భంగా ఖమ్మంజిల్లా న్యాయవాదుల సంఘం సాంస్కృతిక శాఖ ప్రదర్శించిన ''పద్మ వ్యూహం'' నాటికలో శ్రీ టి. బలరాంచౌదరి, శ్రీ బి. వెంకటేశ్వరరావు.



ఆదినారాయణ, వెంకటేశ్వరులు, లత కూడా సెలెక్టయ్యేరు. స్కూలంతా పందడిగా ఉంది. సెలెక్టయినవాళ్లు పరీక్షకి డబ్బు కడుతున్నారు. సెలెక్ట్ కానివాళ్ల పిల్లల తండ్రులు, హెడ్‌మాష్టారిని చూడడానికి పైన నిల్చున్నారు అతని పిలుపుకోసం.

రామం హెడ్‌మాష్టారుగారి గదిలోంచి బయటపడ్డాడు. పైన ఆదినారాయణ, వెంకటేశ్వరులూ నిలబడ్డారు. రామం రాగానే సంగతేమిటో అడిగేరు. రామం చెప్పేడు. ''పద హోటల్‌కి! సెలిబ్రేట్ చేద్దాం!'' అని ఆదినారాయణ అన్నాడు. ముగ్గురూ మిలాప్ హోటల్లో దూరేరు. ఆదినారాయణ ఆర్డర్ చేసేడు... ''నాకా నోట్సేవో నువ్వు రాసివ్వాలి. సెలెక్షన్లలగో గట్టెక్కిపోయేయనుక్కో'' ఆదినారాయణ అన్నాడు. ''అలాగే... నాకు తెల్లకాగితాలు, పెన్సిలు కార్బన్లు, ఇంక్‌పెన్సిలు కావాలి... ఒకటి నీకు, ఒకటి వెంకటేశ్వరులుకి, ఒకటి నాకు...'' అన్నాడు రామం. తన కాపీ నిజంగా తనకోసం కాదు. లత కోసం. లత అడగలేదు. అయినా ఇవ్వడం తన ధర్మం. శాంతమ్మ, లతతో కంబైన్డ్ స్టడీస్ చేయ్యమంది తనని. తను ఏమీ అనలేదు . లత ఒప్పుకోదని తెలుసు. నోట్సు రాసి ఇచ్చేస్తే శాంతమ్మ సంతోషిస్తుంది.

వెంకటేశ్వరులు పద్యాలిచ్చిన మర్నాడు లతని స్కూల్లో నిఘావేసి చూసేడు. లత ఆ పుస్తకాన్ని తిరిగి ఇచ్చేసింది. ఇచ్చేస్తూ అంది. ''ఈశ్వరులూ! నాకు గైడ్‌లు కాని, నోట్సుకాని, పద్యాలుకాని అవసరమైతే మిమ్మల్ని అడుగుతాను అడక్కుండా ఇవ్వకండి... అవేవో పద్యాలు కనిపించేయి మీ గైడ్‌లో...ఎవ్రరాసేరవి? ఏ కావ్యంలోవి ?'' ఆ గైడ్‌లోంచి ఆ పద్యాలు తీసింది లత. మొదటి పీరియడ్ అయిపోయింది. వరండామీద ఆపింది. పిల్లలంతా చుట్టూ మూగేరు. రామం క్లాసులోంచి చూస్తున్నాడు. దగ్గరికి వెళ్లడానికి భయం వేసింది. వెంకటేశ్వరులు తడబడ్డాడు. ఇన్ని కబుర్లు చెప్పినవాడూ నీళ్లు నమిలేడు... ''అవీ...అవీ... సరదాకి నేను రాసుకున్న పద్యాలు. ఏదన్నా పత్రికకి పంపుదాం అనుకుంటున్నాను ... అందులో ఉండిపోయిందా కాగితం పొరపాటున... వాటికోసం నిన్నల్లా వెతుక్కు చచ్చేను...'' అన్నాడు.

''ఏం మీ ఫ్రెండు చెప్పలేదా... మీ పద్యాలు ఈ పుస్తకంలో ఉన్నట్టు?'' లాయర్‌లా అడిగింది...

''చెప్పేడు... చెప్పేడు... వాడు నిన్నల్లా ఇంటికి రాందే... ఇవాళ పొద్దున్న చెప్పేడు... థాంక్స్...'' అన్నాడు చెమటలు కారుస్తూ వెంకటేశ్వరులు.

''వాటికి యతి, ప్రాసలు కుదరలేదని మా అమ్మంది— మీ నాన్నగారికి చూపించి దిద్దింపించండి తరువాత ''భారతి''కి పంపండి.'' అని సలహా ఇచ్చి, కాల్చేసేటట్టు ఒక్క చూపు చూసి వెళ్లిపోయింది లత. క్లాసంతా వాడివెంటపడ్డారు పద్యాలకోసం. ఆదినారాయణ వాటిని చదివేడు... ''ఒరే వెధవా... ఇలాటి పద్యాలేట్రా... పెళ్లి చేసుకున్నాక కవిత్వం రాయిరా... ఆడదంటే ఏటో తెలీకుండా ఈ బోడి కవిత్వం ఏట్రా...!'! అన్నాడు.

ఆ రాత్రి వెంకటేశ్వరులు నాట్యం చేసేడు. ''ఒరే రామిగా! ఆడదంటే అదిరా ఆడది... దాని ధైర్యం ఏమిటి... సాహసం ఏమిటి... అందరిముందూ నిలబెట్టేసిందిరా. కాని ఒకటి గమనించేవా? మేం ఇద్దరం మాటాడుకున్న భాషే? దానికి అర్థం వేరురా! దాని కాపీ ఒకటి రాసి ఉంచుకొనే ఉంటుంది. 'భారతి'కి పంపమంది... పంపుతాను... భయపడతానా? 'ఊర్వశి' అని పేరు పెడతాను. ఒరే రామం నువ్వు వాళ్లింటికి వెళ్తావుకదా? ఇంకా ఏమన్నా అంటే ప్రతి ముక్కా నాకు చెప్పాలి... ఏం? లత నాదిరా... సావిత్రినీది... లత జోలికి నువు రాకు... సావిత్రి జోలికి నేను వెళ్లను. సావిత్రి అందం ఇంకా విరబుయ్యలేదుకాని తండ్రీ...అది స్కూల్‌ఫైనల్‌కి రానీరా చూద్దువుగాని... అందుకు నువ్వేం విచారించక్కర్లేదు...'' నీ వంతు నీది, నా వంతు నాది అన్నట్టు పంచీసేడు.

''ఒరే వెంకూ... నన్ను మాత్రం ఇందులో ఇరికించకు నీకు నమస్కారం. ఈ పరీక్షలవగానే పోతాను... నాకీ గొడవలంటే ఇష్టంలేదు'' అని రామం చెప్పేడు.


పద్యాలు 'భారతి'కి పంపేడు వాడు. రోజూ పోస్ట్‌మేన్ కోసం ఎదురు చూస్తాడు. పోస్ట్‌మేన్ ఏమీ ఆశచూపలేదు. పోస్ట్‌మన్ రావడం ఆలస్యం అయితే పోస్టాఫీసుకి పరుగుతీస్తాడు... ''ఇంకా తిరిగి వాపసు రాలేదు కదరా? ఆశ ఉంది...'' అంటాడు.

మీనాక్షి అడిగింది రామాన్ని... ''వెంకయ్య లతమీద పద్యాలు రాసేట్ట?''

రామం ఆశ్చర్యపోయేడు... ''నీ కెవరు చెప్పేరు?''

''లతే చెప్పింది... పుస్తకంలో పెట్టి ఇచ్చేడుట... మర్నాడు స్కూల్లో అందరిముందు డోసు ఇచ్చింది కదా? ఊరంతా తెలును...'' మీనాక్షి నవ్వింది.

రామం అన్నాడు మీనాక్షితో, గొంతు చాలా సిన్సియర్‌గా పెట్టి... ''వాడు సరదాకి రాసు



కున్నాడు... పత్రికలకి పంపదామని— ఆ పుస్తకంలో ఉండిపోయిందంతే...''

''కొయ్... కొయ్... కోతలు...అవి నువ్వే రాసేవని లత అంది...''

''నువు నమ్మేవా ?''

''నమ్మలేదనుకో... రాయాలనుకుంటే నువ్వు రాయగలవ్ !''

''నేను రాయాలనుకోలేదు...'' మీనాక్షికా జవాబు సంతోషాన్నివ్వలేదు.

హోటల్లోంచి బయటపడ్డారు. ఆదినారాయణ కిళ్లీలు కట్టించేడు. రామం వేసుకోలేదు. కిళ్లీ వేసుకోగానే ఎందరివో కనుబొమలు ముడివడతాయి. వెంకటేశ్వరులూ, ఆదినారాయణా, సందులోకి దూరి సిగరెట్లు ముట్టించేరు. వెంకటేశ్వరులుకి భయం. ఆదినారాయణకి ఖాతరులేదు.

సాయంత్రం నాలుగయింది. రామం పోస్ట్ మేన్‌కోసం చూసేడు. ఇంటిదగ్గర్నించి పది రోజులయి ఉత్తరంలేదు. ఇంటికిపోయి చదువుకుంటే బాగుంటుంది అనుకున్నాడు. కాని వెంకటేశ్వరులు, ఆదినారాయణ వదలడంలేదు. ''నువ్వెవరి ఇంటికీ వారాలకి వెళ్లక్కర్లేదు... ఇక్కడే తిను...'' అంది లక్ష్మమ్మ. ''నీకేపాటి కావాలి కనక ?'' పరీక్షఫీజుకోసం మనియార్డరు రావాలి — కాని ఁడ్ మాష్టరు తనకి సహాయం చేసేరు. ఆ డబ్బు తిరిగి నాన్న కిచ్చియ్యాలి. ఎవరిదగ్గర అప్పుచేస్తారో మరి. అంతా అప్పులమీదే నడుస్తోంది. పొలం అయిదెకరాలుంది. ఇల్లుంది. పొలంమీద అప్పు పెరుగుతోంది. అది అమ్మేయ్యాల్సి వస్తుంది మరికొన్నాళ్లకి. చెల్లికి ఎనిమిదో క్లాస్‌తో చదువు సరి. పన్నెండేళ్లు వెళ్లేయి. పట్నంలో ఆడపిల్ల చదవడానికి అవకాశంలేదు. ప్రయివేట్‌గా మెట్రిక్ చదివించాలి... అందుకు రెండేళ్లు పడుతుంది కోచింగ్ ఇస్తే. ఎవరిస్తారు కోచింగు. దానికి పెళ్లి సంబంధాలు వెతుకుతున్నారు నాన్న. ఆస్తి పాస్తులు పోయినా ఆచారాలు, సాంప్రదాయపాలన కోసం తాపత్రయం పోలేదు. పిల్ల పెద్దదయిందనేసరికి బెంగ. ఉన్నది ఒక్క పిల్ల. కాని ఇరుగుపొరుగులవాళ్లకే కావాలి తమ ఇంటి సంగతులు ఆ పల్లెటూరులో. వంశం పేరుప్రతిష్ఠ మిగిలిపోయింది. కరణంగిరీ చేతికొచ్చింది. ఆదాయం సున్నా... ఏదో పాతికో పరకో. ఖర్చు అంతకు నాలుగయిదు రెట్లు.

ఆలోచిస్తూ ఇద్దరివెంటా వెళ్తున్నాడు రామం. మెయిన్ రోడ్డు రద్దీగా ఉంది. హోటళ్లకి వెళ్లేవాళ్లూ, వచ్చేవాళ్లూ, ఊరికే రోడ్లమీద తిరిగేవాళ్లూ, ఎక్కువగా ఉన్నారు. ఎక్కడ చూసినా బట్టల దుకాణాలే... చెల్లి కోసం ఒక్క అద్దంకొని తీసుకవెళ్దాం అంటే డబ్బు లేదు. నాన్న పంపిన డబ్బు పెట్టి బట్టలు కొంటే ? అమ్మకొక చీర... నాన్నకి పంచల చాపు... పండుగ దగ్గర్లో ఉంది.

''అదుగో పోస్ట్‌మన్'' అన్నాడు వెంకటేశ్వరులు... ఎగిరిగెంతేసి. పోస్ట్‌మన్ నవ్వుతున్నాడు.

''ఏం వెంకటస్వామీ... ఏమన్నా వచ్చిందా...'' అన్నాడు వెంకటేశ్వరులు.

''ఒచ్చింది బాబూ... తమరి పద్దేలు పడ్డాయి...'' అన్నాడు వెంకటస్వామి 'భారతి' ప్రతి ఇస్తూ. వెంకటేశ్వరులు గావుకేక పెట్టేడు. ''నా పద్యాలు పడ్డాయా ? నా పద్యాలా ?... నీకెలా తెలుసు ?''

రామం 'భారతి' ప్రతి అందుకొని ఆత్రంగా విప్పి, పేజీలు తిరగవేసేడు... మొట్టమొదటి పేజీలో ఉన్నాయి పద్యాలు...''ఊర్వశి''. రచన: శ్రీ బులుసు వెంకటేశ్వరులు... ''ఒరే... వెంకూ ! నిజమేరా !'' రామం కేకపెట్టేడు... ఆదినారాయణ ఆ పుస్తకం లాక్కున్నాడు. ''హాయ్ ! నా పద్యాలు ''భారతి''లో పడ్డాయి!'' వెంకటేశ్వరులు రోడ్డుమీద పిచ్చివాడిలా అరిచేడు... పోస్ట్‌మేన్ నవ్వుతున్నాడు. ''నాకు బాబుపేర పుత్తకం రాగానే, పద్దేలు పడుంటాయని తీసి సదివినాను... బాగా రాసినాడు...'' నా పేర పుస్తకం ఒస్తుంది భారతి... అందులో పద్యాలు పడతాయి నావి... ఒస్తే... వెంటనే తెచ్చి నాకియ్యి... అని రోజూ పోస్ట్‌మేన్‌కి స్పెషల్ ఇన్స్ట్రక్షన్స్ కాకుండా బీడికి డబ్బులు కూడా ఇచ్చేవాడు... అందుకు పుస్తకం రాగానే వెంకటస్వామి చదివేడు ముందుగా, అర్థం కాకపోయినా...

పోస్ట్‌మన్ అన్నాడు... ''మీకు ముప్పయి రూపాయలు మనియార్డరుంది రామంబాబూ .. ఉత్తరం ఉంది మీ ఊరునించి.''

''పదండి ఆ బంగారం కొట్టు అరుగుమీద కూర్చుందాం'' అన్నాడు ఆదినారాయణ.

పరోపకారం !

పరమహంస గారు
నిన్న రాత్రి సెలవిచ్చారు
పరోపకారాయ పుణ్యాయ
పాపాయ పరపీడనం...అని
మన పురాణాలు, మతగ్రంథాలు...వగైరాలు
ఘోషిస్తున్నాయని !
మఱి మానవుడు భూలోక ప్రయాణానికి
తొమ్మిది నెలల ముందుగానే
టికెట్టు 'బుక్' చేసుకున్నది మొదలు
భూలోకపు 'ప్లాట్‌ఫాం'పై
కాలూనిన దాకా...ఊనిన తర్వాతా
ఆశ్రయ మిచ్చిన ప్రాణినే
అన్నివిధాలా బాధిస్తాడు !
మానవ తత్త్వమే
మానని స్వార్థపరత్వం !
పరోపకారం...అంటే...
ఇహిహి...గుణసంధి కాదు
దీర్ఘసంధి...అని...ఇకిలిస్తాడు !

—నల్లాన్ చక్రవర్తుల శేషాచార్య

రామం డబ్బు తీసుకున్నాడు. "ఒరే వెంకటసామికొక రూపాయియ్యిరా... ఇంటిదగ్గర అమ్మనడిగి ఇచ్చేస్తాను." వెంకటేశ్వరులు అన్నాడు, అచ్చులో తన పేరు చూసుకుంటూ. రూపాయి తీసుకొని వెంకటస్వామి వెళ్లిపోయేడు... "నువ్వు పేద్ద కవివయిపోతావ్‌పంతులూ!" అని దీవించి అందరూ నవ్వేరు... వెంకటస్వామితప్ప.

అప్పుడు వెంకటేశ్వరులన్నాడు... "ఒరే రామం... థేంక్స్‌రా..."

"ఏం రామంకెందుకురా థేంక్సు?" అని అడిగేడు. వాడికి పద్యాలు అర్థంకావడంలేదు.

"వెంకూ పంపేముందు వాటిని కాస్త మెరుగుపడ్డాను..." సిగ్గుపడుతూ అన్నాడు రామం.

"అలా చెప్పగురూ... ఈడేటి పద్యేలు రాయడమేటి.. అచ్చవడమేటి అనుకున్నానప్పుడే.."

"పద్యాలన్నీ వాడివేరా అదీ... అంటే కొంచం..."

రామం చదివేడు పద్యాలని.. శాపవశాత్తూ ఒక గంధర్వుడు భూలోకంలో మానవుడయి పుడతాడు ఈ కలియుగంలో. అతడికి తన ప్రియురాలు ఊర్వశి గుర్తుకొచ్చి విరహంతో విలపిస్తాడు. అతడి కళ్లకీ మానవ కాంతలు అందమైన వారిగానే కనిపిస్తారు, కాని వాళ్ల మనసులన్నీ చిత్రంగా ఉంటాయి. డబ్బు, బంగారం, చీరలు, నగలు, ఆకలి, దాహం, ఇవి ఎక్కువా తక్కువా అవడం వల్ల వాళ్ల ప్రేమ ఎక్కువా తక్కువా అవుతుంది. కాని ఊర్వశి వేరు... ఆకలి, దప్పులు, గొప్పబీదా లేని దేవలోకంలో ప్రేమ ఎంత దివ్యమైనది దానికోసం అలమటించనక్కరలేదు... ఊర్వశి అందం వర్ణిస్తూ, ఆమెని మానవ కాంతలతో సరిపోల్చి రాసిన పది పద్యాలవి. లతకి వెంకటేశ్వరులు రాసిన నాలుగు పద్యాలనీ పూర్తిగా మార్చేసి, ఒక కొత్తభావంపెట్టి రాసేడు రామం. వెంకటేశ్వరులుకి ఒక సహజమైన సరళమైన శైలి ఉంది...వెంకటేశ్వరులు పదాల పొందిక చూసుకున్నాడు. కాబట్టి ఈ పద్యాలు ఇద్దరి పరిశ్రమా, ఈ సంగతెవరికన్నా తెలిస్తే తనకి ప్రమాదం వస్తుందని రామం ఎక్కడా చెప్పలేదు.

"లతకి రాసిన పద్యాలు కావురా బాబూ ఇవి .. ఇవన్నీవేరు..." వెంకటేశ్వరులన్నాడు. పేజీలు తిరిగ వేసేడు...'బుచ్చిబాబు' కథ తన పద్యం తరవాత ఉంది...తరహాత జ్యోతిష్యం శాస్త్రం మీద రాళ్లబండి వారి వ్యాసం...మరో కథ...ఎవరో కొత్త రచయితది...పద్యాలు కొన్ని శ్రీ దాశరథివి. ఇంత ప్రఖ్యాత రచయితలు, కవులు రాసిన రచనలతో తన రచన కూడా పడింది ... ఇంక ఏకబిగిని పద్యాలు రాసి పారెయ్యాలి–పద్యాలు రాయడానికి కావల్సినంత ప్రేమ, ఆకలి విరహం ఈ ప్రపంచంలో ఉంది...కలంపాళీకి పని చెప్పడమే తన పని.

"అన్నట్టు...ఈ పద్యాలకి డబ్బు దొరుకుతుందిరా బాబూ..." అన్నాడు వెంకటేశ్వరులు.

"ఎంత ?" ఆదినారాయణ అడిగేడు...

"తెలీదు...ఏదో...ఇరవైయ్యో...అందులో సగం రామానిది..." వెంకటేశ్వరులన్నాడు.

రామం నాన్న రాసిన కార్డుతీసి చదవడం ఆరంభించేడు...డబ్బు పంపినట్టు...డబ్బు పరీక్షలకి కట్టేక ఊరుకి రమ్మనీ... అందరూ కులాసా అనీ, చెల్లి రెండు మాటలు రాసింది... "నాకోసం అద్దం కొని తీసుకురా... అని"

రామం నవ్వుకున్నాడు. మనస్సంతో ఆనందంగాఉంది..పండుగకి ఇంటికి వెళ్ళిపోవచ్చు. "పదరా...బీచికిపోయి పద్యాలు చదువుకుందాం" అన్నాడు వెంకటేశ్వరులు...

"నేను గేమ్‌కి పోవాలి" అని లేచేడు ఆదినారాయణ. వీళ్లంతా పద్యాలు రాస్తారు...కాని వాడి కళ్లు బంతి మీద ఉన్నాయి...బి. ఎన్. ఆర్. క్లబ్ మీద ఉంది వాడి దృష్టి...

(ఇంకా వుంది)

ప్రశ్నావళి

కె. రామలక్ష్మి

జి. ఆర్. — రాయచోటి

నవసమాజంలో స్త్రీకి గల ప్రత్యేకత ఏమిటి?

★ ప్రస్తుతం ఏం వున్నట్టు తోచడం లేదు— నలుగురి నోళ్లలో పడడం మినహా.

ఎమ్. ఎల్. ఎన్. ఆర్. బైపల్లి

మీ అమ్మాయి యీమధ్య చాలా ఎక్కువ రచనలుచేస్తోంది. మీ ప్రభావమే అనుకుంటాను?

★ నా పిల్లలపై నా ప్రభావం చాలా తక్కువ. నా యిష్టా యిష్టాలు వాళ్లపై రుద్దే అలవాటు రాలేదు నాకు.

ఎన్.ఎన్. — విశాఖ

యీనాటి మన కార్టూనిస్టులు టెలివిజన్‌ని పిచ్చివాళ్ల సాధనంగా పోల్చడం న్యాయమంటారా?

★ దాని పేరే — ఇడియట్ బాక్సు కద! ఇక దానిద్వారా మనకి అందుతున్న కార్యక్రమాలను చూస్తే — మనకి పిచ్చేకద ఎక్కుతూంది! పబ్లిక్ స్థలాల్లో పెట్టిన సెట్లకి వైర్‌మెష్ ఎందుకు పెడతారో నాకు బాగా అర్థంఅవుతోంది. స్వంత పెట్టె కాకుంటే — నేనూ రాయి విసిరే దాన్నే యింట్లో!

పి.ఆర్.జి.కె. — బల్లిగూడ

ముసలితనం వస్తూన్న కొద్దీ దృష్టిశక్తి, శ్రవణ శక్తి క్షీణిస్తుందని అంటారు. అయితే మీ ఘాటు సమాధానాలలో మార్పు లేదే?

★ వయస్సు శరీరానికికాని మనస్సుకి కాదు చిట్టి తండ్రీ! ఆ మాత్రం తెలియదా? జీవితపు ఆటు పోటులకి శరీరం అలసిపోవచ్చుగాని మెదడు పదునెక్కుతుంది. "యు లుక్ ఏస్ ఓల్డు ఏస్ యు ఫీల్!"... కొందరికి పాతిక్కే ముసలితనం వస్తుంది అందుకే. కొందరికి ఏభై దాటినా — చెలాకీతనం పోదు. అయినా తెలియక అడుగుతాను — ఏభై దాటిన మగాడు పూలరంగడిలా స్మార్టుగా వుంటూంటే — ఏభైకి ఆడది ముసలిదెలా అవుతుందయ్యా పిచ్చి కాని!

కె. ఎస్. కె. — అనకాపల్లి

నేటి యువతలో విప్లవాత్మక ఆలోచన లేదు. సమాజంలో మార్పు ఎప్పుడు వస్తుందిలా వుంటే?

★ శ్రీకాకుళానికంత దగ్గరగా వుంటూ— నన్నడిగేతే—నేనేం చెప్పగలను?! విప్లవ కవిత్వం చదువుతున్నాను, విప్లవ రచనలూ చదువుతున్నాను. విప్లవ వీరులనబడే వారినీ చూస్తున్నాను...కాని నాకేం బోధపడడం లేదు. వారు కావాలంటున్నది ఏమిటో?! సమాజంలో మంచి మార్పు అందరం కోరుకుంటున్నాం కదా! వీళ్లెందుకిలా భయపెట్టేస్తున్నారు అనిపిస్తుంది—నా మట్టి బుర్రకి.

పి. బి. ఎల్. — మద్దిలోడిపేట

మా ఆయన తగవు లాడినప్పుడు చనిపోవాలనిపిస్తుంది. పిల్లలున్నారు మనసు అంగీకరించదు. తగవులు లేనప్పుడు సరదాగా వుంటుంది.

★ తగవులకి — మూలకారణం ఏమిటో అన్వేషించి భార్యాభర్తలు మాట్లాడుకోకల్గాలి. అదొక్కటే పరిష్కార మార్గం.

ఎన్. ఎమ్. బి. — ఏలూరు

అనురాగానికి త్యాగానికి ముందుండేది ప్రేమ. బంధానికి, అనుబంధానికి— విడదీయలేనిది పెళ్లి. మరి జీవితానికి తోడేమిటి?

★ ఈ ప్రేమా — ఈ బంధాలూ చాలవా తోడుకి!!

టి. ఎస్. — ప్రాతకోట

—వరకట్న పిశాచాన్ని రూపుమాపాలంటే— పెళ్లి కావలసిన ఆడపిల్లలందరూ మేం వరకట్నం యిచ్చి అబ్బాయిని కొనుక్కోం అని సమ్మె చేయాలంటాను. మీరేమంటారు?

★ సమ్మె చేయక్కరలేదు. తీసుకున్న నిర్ణయాలకి కట్టుబడి వుండాలి. చాలు. సమ్మె చేయడానికిదేం ట్రేడ్ యూనియన్ సమస్య కాదు.

కె.ఎస్.ఆర్. — బిక్కమూర్

ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్నాను. మొదటి సంవత్సరం ఫెయిల్ అయ్యాను. ఈ కాలేజీకి రాగానే చదువుమీద దృష్టి వుండడంలేదు. ఎందువల్ల?

★ చదవడం యిష్టంలేకపోతే — ఏదైన పని నేర్చుకోవడం ప్రారంభించు తమ్ముడూ, రేటున డిగ్రీదాకా వచ్చేసరికి — ఏ వ్యాపారంలోన నిలదొక్కుకోకల్గుతావు.

వి. హెచ్. ఎన్. — ఖమ్మం

నేటి చిత్రాలు విచిత్రంగా వుంటున్నాయి

★ అవి మీరు కోరినవి. మరిచిపోకండి.

ఎమ్. ఎస్. బి. — మచిలీపట్నం

నన్ను చూసి పల్కరించేటప్పుడు కొందరు నవ్వుతారు. ఆ నవ్వులో నాకు విషాదం కన్పిస్తుంది.

★ అది మీ తత్వంలో వుంది. పల్కరింపు చిరునవ్వుని— అలాగే స్వీకరించాలిగాని — దానికి అర్థాలు వూహించుకో కూడదు.

పి. ఆర్. — ఇల్లెందు

మగవాడు చెడిపోవాలన్నా బాగుపడాలన్నా ఆడదే కారణం అంటారు?

★ అదో వంక. అంతే—

ఫ్రాంక్లిన్ — పెరవలి

జీవితానికి పరిపూర్ణత ఎప్పుడు లభిస్తుంది!

★ లభించిందనుకున్నప్పుడు—మనిషి చచ్చిపోయినట్టే లెక్క.

పి.కె.ఎల్. — విశాఖ

మంగళసూత్రం మగాళ్లకిస్తే?

★ పేకాటలో పోకొట్టేస్తారు! ★



సీరియల్

కర్మయోగి

డా॥ కె.వి. కృష్ణకుమారి

(గత సంచిక తరువాయి)

తులశమ్మ మనసు మనసులో లేదు.

మొన్న శంకరశాస్త్రి, కృష్ణశాస్త్రిగార్లు కృష్ణారావుతో ఇంటికి వచ్చి వెళ్ళిన దగ్గర్నుంచీ ఉన్న మనశ్శాంతి కూడా దూరమైపోయింది.

సభలో జరిగిన విశేషాలు వింది. చివర్లో కృష్ణ ధ్యానంతో కొడుకు వొళ్ళు మరచి పడిపోవటం, దైవాంశ సంభూతునిగా స్తుతించటం...

మళ్ళా చరిత్ర పునరావృత మౌతోందా ?

తన కోరిక ఈ జన్మలో తీరేది కాదా ?

ఈ వంశ వృక్షం వృద్ధిచెందే అవకాశమే లేదా ?

శ్రీకృష్ణుడ్ని నమ్ముకున్నందుకు వచ్చిన ప్రతిఫలం ఇదేనా ? అత్తగార్ని ఆ పరిస్థితిలో చూస్తుంటే లక్ష్మికి గతం గుర్తుకువస్తోంది.

గతం ప్రస్తుతంలో అడుగుపెడుతుందేమో నన్న భయం నీడలా వెన్నాడుతునే వుంది.

''ఎవరి అదృష్టానికి ఎవరుకర్తలక్కయ్యా! వారి జీవితం ఏ రకమైన మలుపు తిరగబోతోందో– ఈ విధంగా వుండాలని శాసించే హక్కు మనకెక్కడుంది ? శాసించినా జరిగేది జరక్క మానుతుందా ? మనం బాధ పడటం అనవసరం కదూ–''

పద్మిని వంక వింతగా చూసింది లక్ష్మి.

చటుక్కున తల వాల్చుకుంది పద్మిని.

''మీరు... మీరిద్దరూ... కల్సి సరిగ్గా వుడటం లేదేమోననే నా అనుమానం అనుమానం కాదని ఇప్పుడన్పిస్తోంది ... నిజమా చెప్ప పద్మినీ–''

లక్ష్మి బాధ అర్థం చేసుకోలేనిది కాదు. అందుకే పూర్తిగా తల దించేసింది పద్మిని.

''చెప్పమ్మా... మీరు భార్యా భర్తల్లా వుండటం లేదు కదూ– అలా వున్నట్టు అత్తయ్యని నమ్మిస్తున్నారు కదూ...''

పద్మిని మొహం పాలిపోయింది.

''ఇన్నాళ్ళనుంచీ అడగన్ది ఇవాళ అడుగుతున్నాననా... శారీరకంగా కూడా ఏకమైన ఏ భార్యాభర్తలు– మీలా ప్రవర్తించరు... గదిలోనుంచి రాగానే ఎంతో క్రొత్తదనాన్ని ఆశించేదాన్ని– కానీ– నీలో– వెనుకటి నేనే కన్పించేదాన్నమ్మా– అందుకే– అందరికన్నా నేనే మీ అనుబంధాన్ని అర్థం చేసుకోగలిగాను. కాదా ??–''

ఆ ఆరాటంలో ఆవేదన–

ఆ అనుమానం కూడా– చావని ఆశ తాలూకు నీడలు– తానన్నది కాకూడదన్న కాంక్ష–

అవుతుందేమోననే భీతి–

అన్నీ కలగా పులగంగా లక్ష్మిని కమ్ముకున్నాయి.

అత్తగారి కోరికను తనెలాగూ నెరవేర్చలేకపోయింది. ఆ అవకాశాన్ని విధి దూరం చేసింది– పద్మినిమీదే ఆశలు పెట్టుకుని బ్రతుకుతోందావిడ. మామూలు వాళ్ళకైతే– మనమడ్ని చూడాలనీ– వాడితో ఆడుకోవాలనీ–వాడి ద్వారా వంశాన్ని వృద్ధి చేయాలనేది అతి మామూలు కోరిక–

ఈ కోరిక తీరనిదనే భావన నిశ్చలంగావున్నా ఇంత బాధ వుండకపోయేది.

కృష్ణారావు వివాహం చేసుకోటం–దాంపత్య జీవితంమీద ఎటువంటి వైముఖ్యం చూపించకపోవటం ఆవిడలో– క్రొత్త ఆశలు రేపాయి. క్రొత్త ఊపిరితో కొండంత ఆశతో ఆవిడకూడా భవిష్యత్‌మీద ఆశలు పెంచుకుంటోంది–

''పద్మినీ, సమాధానం చెప్పవా ?''

లక్ష్మివంక జాలిగా చూసింది పద్మిని. నీళ్ళు నిండిన ఆ కళ్ళే సమాధాన్ని అందించాయి.

* * *

జాజులు ఎప్పుడూ లేనంతగా పూస్తున్నాయి. పూజకి వాడి ఇరుగుపొరుగు వాళ్ళకి ఇవ్వగా కూడా – ఎలా ఉపయోగించాలో కూడా అర్థం కానన్ని పూలు మిగిలిపోతున్నాయి. మొక్కల సంరక్షణ పూర్తిగా కృష్ణప్రియ ఆధీనంలోకి వచ్చాక, ఏ మొక్కకి ఆ మొక్కే విరగబూస్తోంది. పెరటి మొక్కల సంరక్షణంతా లక్ష్మి చేతుల్లో జరిగిపోయేది. వాళ్ళిద్దరూ ఆ రకంగాకూడా తీరికలేని కార్యక్రమాన్ని నిర్దేసించుకున్నారు.

''ఎందుకర్రా – పగలూ – రాత్రి లేకుండా ఆ మొక్కల కోసం అంత కష్టపడతారూ –. తరతరాలు తవ్విపోసినా తరగని ఆస్థి మనది – పూలు కొనలేకా – కాయలు కొనలేకా ?''

కోడళ్ళు కష్టపడుతుంటే చూడలేకపోయే అత్తగార్ని చూసి నవ్వుకునేవాళ్ళు కోడళ్ళు.

''డబ్బుతో ఏదైనా కొనగలమనుకోండీ – కానీ – కష్టపడి మన చేతిలోకి వచ్చినవి ఎంత అపురూపంగా వుంటాయి. వంకాయలు గిట్టవనే వారా – మరి అక్కయ్య నవనవలాడే వంకాయలు కోస్తుంటే – ఎందుకంత ముచ్చటపడి చూశారు ? – లేత వంకాయల్ని మనసుపడి – కూర చేయించుకుంటున్నారా లేదా ? – స్వంతమంటే అలాగే వుంటుంది.''

''అవును... వెధవది నీళ్ళుపోసి పెంచుకున్న కూరగాయలే ఇంత ఇష్టంగా అన్పిస్తున్నప్పుడు... ఈ ఇంట్లో పసివాడే పుడితే –''

ఆ భావనతోనే తులశమ్మ మనసు పులకరించేది.

జరిగిన కథ – 13 : తులశమ్మగారు గత జీవితాన్ని శ్రీహరిగారితో చెప్పి హృదయభారాన్ని తగ్గించుకొంటారు. కృష్ణారావు తల్లి ఆవేదనని చూసి చలిస్తాడు. తల్లి కోరిక ప్రకారం పెళ్ళి చేసుకొనుటకు అంగీకరిస్తాడు కృష్ణ. కృష్ణ పెళ్ళి పద్మినితో నిశ్చయమవుతుంది. కృష్ణారావు, పద్మినిల వివాహం జరిగిన కొద్దిగంటలకే పద్మిని తల్లి యశోదమ్మ మరణిస్తుంది. యశోదమ్మ కర్మకాండ అనంతరం పద్మినితో కూడ కృష్ణప్రియను తమ దగ్గరకే పంపమని రామచంద్రరావుకి చెప్పి తులశమ్మ కృష్ణారావుతో కలిసి తమ ఊరు వెళ్లిపోతారు. పద్మిని, కృష్ణప్రియల రాకతో తులశమ్మగారి ఇంట్లో చైతన్యం వస్తుంది. కృష్ణారావు చర్చలకు అందరూ ఆకర్షితులవుతారు. శోభనం నాటి రాత్రి మూర్ఛవచ్చి పడిపోయిన పద్మినికి సేవలు చేసి అనునయిస్తాడు కృష్ణ. గుండె నొప్పితో బాధపడుతున్న పద్మినిని మనస్సుకు ఉల్లాసం కలిగించే మాటలతో వూరడిస్తాడు కృష్ణ. మనువడి కోసం తాప్రయ పడే తులశమ్మను చూసి పద్మిని కృంగిపోతుంది. కృష్ణారావుని గోష్టిలో అల్లరిపాలు చేయాలనుకున్న నారాయణ ప్లాను తల్రకిందులవుతుంది



పద్మినిది సామాన్యమైన అందం కాదు. కృష్ణారావు వర్చస్సు ఎవరికీ రాదేమోకూడా — అటువంటివాళ్ళకి పుట్టిన వాడు — ఇంకెంత అందంగా వుంటాడు — అచ్చం బాలకృష్ణుడిలా వుంటాడేమో —

'వుండి తీరతాడు.'

అలవాటైన ఆలోచన్లకి అలవాటుగా కళ్ళు తుడుచుకుందావిడ. ఈ దౌర్భాగ్యురాలికి అంత అదృష్టమా ? — లేదేమో — వుండదేమో —

"రోజూకన్నా ఇవాళ చూడండి ఎన్ని పూలు పూశాయో — మాల కట్టలేక చేతులు పడిపోతున్నాయి బాబూ —"

అప్పటికే బారెడు మాలను వొత్తుగా కట్టటం పూర్తిచేసింది కృష్ణప్రియ. "నీ హస్తవాసి మంచిది — లేకపోతే — ఏనాడు పూశాయి అన్ని పూలు —"

లక్ష్మిని నవ్వుతూ చూసింది కృష్ణ.

"మరి — నీ హస్తవాసి కూడా మంచిదేగా— నీ చేతిమీదగా అన్ని కాయలు కాస్తుంటే—"

"అదే నువ్వొచ్చాకేగా — ఎటుపోయి ఎటొచ్చినా ఘనతంతా నీదే —" లక్ష్మి వంక ఆప్యాయంగా చూసింది కృష్ణప్రియ.

"ఎవరి ఘనతైనా..."

తులశమ్మ మాట్లాడలేకపోయింది.

"పొద్దస్తమానూ — అలా దిగులు పడితే ఎలా అత్తయ్యా — అన్నీ తెల్సినవారు... మన చేతుల్లో ఏముందని —"

లక్ష్మి వోదార్పుతో దుఃఖం పైకుబికింది. అతి కష్టంమీద అదుపులోకి తెచ్చుకుంటూ ఆశా నిరాశల మధ్యన కొట్టుమిట్టాడుతున్నట్టు దైన్యంగా అంది తులశమ్మ.

"ఆ సభ జరిగినదగ్గర్నుంచీ — కృష్ణ అదోలాలేడూ — వాడిని చూస్తుంటే రాముడు గుర్తుకురావటంలేదూ — దానికి తగ్గట్టే — నేను చెప్పానుకదూ — నాకొచ్చిన కల సంగతి... వాడిని కృష్ణుడు పిలుస్తున్నాడుట — ఏమిటే ఇదంతా,"

"పద్మినీ — నువ్వొకసారి రా —"

నిస్సహాయంగా అంది లక్ష్మి.

"అత్తయ్య చూడూ—ఎలా ఐపోతున్నారో— కృష్ణలో మార్పేమీలేదని నువ్వు చెపితేనేగానీ నమ్మేలాలేరు —"

"అక్కయ్య చెప్పింది నిజమత్తయ్యా... అందరికన్నా — నాకు — నాకు బాగా తెలుస్తుంది కదా — వారు మామూలుగానే వున్నారు ... మార్పేమీలేదు."

పద్మిని కళ్ళల్లో ధృఢత్వం, మాటల్లో నిశ్చలత్వం కొట్టొచ్చినట్టు కన్పిస్తున్నాయి. కృష్ణారావు సహవాసం పద్మినిలో ఆశించిన మార్పే తీసుకువచ్చింది. 'మనవల్ల మనకోసం ఆక్రోశించేవారి కళ్ళు చెమ్మగిల్ల కూడదు పద్మినీ — వారిని బాధ పెట్టటం — తద్వారా మనం బాధపడటం — అందువల్ల భగవంతునికి ద్రోహం చేసినవాళమే అవుతాము. ఎందుకంటే అందరిలోనూ వుండేది ఆ భగవంతుడేకనుక. ఈ సత్యాన్ని అర్థం చేసుకున్నాక మనకోసం మనం బాధ పడటమంటూ వుండదు. మనకు చేతనైనంతగా ఇతరులు మనకోసం — మనవల్ల— బాధపడకుండా చూసుకోవాలి. అందుకు అబద్ధాలాడినా — అసత్యాన్ని నమ్మించ ప్రయత్నించినా తప్పులేదు. వుండకూడదు."

కృష్ణారావు తరచుగా అనే మాటలు ఎప్పుడూ గుర్తుకువచ్చినా, తులశమ్మని చూస్తున్నప్పుడే — అతని ఆశయాన్ని ఆచరణలో పెట్టాలన్పిస్తుంది. కన్నతల్లి కోరిక ప్రకారం వివాహం చేసుకున్నారాయన. ఆవిడ కోరిక ప్రకారం భార్య మనసు ననుసరించీ — కర్మయోగ సాధనకి అడ్డంకిలేదు కనుక — వంశోద్ధారకుల్ని అందించే వారేమో ఆయన. ఈ వివాహం, ఈ బంధాలూ— ఆయన్ని ఏ విధంగానూ బంధించలేనప్పుడూ — పిల్లలుమటుకు బంధాలెలా అవుతారు ? తన స్థానంలో ఎవరున్నా—అత్తగారి కోరిక తీరేదేమో— ఈ వంశం వృద్ధి అయేదేమో ? — తన జబ్బును దాచి ఒకరకంగా మోసం చేసింది. తన స్వార్థం కోసం తల్లి ఆనందం కోసం, దాంపత్యానికి అనర్హురాలినని తెల్సికూడా—దైవం లాంటి వారికి అన్యాయం చేసింది. ఈ విధంగా జరక్కుండా వుంటే — తనీ ఇంట్లో అడుగు పెట్టకుండావుంటే — మోడువారినట్టున్న ఈ ఇంటి వాతావరణం తిరిగి చిగురులువేసి కళకళలాడేదికదా —

తన పాపం కాస్తయినా లేదా !!! కడుక్కోవాలంటే — తన కన్నీటిని దాచుకోవాలి—తనవాళ్ళ కన్నీటిని తుడవ ప్రయత్నించాలి — మరోమార్గం లేనప్పుడు — ఇంతకుమించిన మార్గం ఇంకేముంది ?

అందుకే అత్తగార్ని నిబ్బరంగా ఓదార్చ గలుగుతోంది

"మనం దేముడ్ని నమ్ముకున్నాం. మన మనసుల్లో ఎటువంటి కల్మషంలేదు. ఎదుటి వాళ్ళ సంతోషాన్నే మన సంతోషంగా భావించుకునే మనకీ మంచిరోజులు తప్పకుండా వస్తాయి ... మీరు అనవసరంగా బాధపడుతున్నారత్తయ్యా."

"నువ్వంటున్నది నిజమేనా పద్మినీ — నేనవసరంగానే బాధపడుతున్నానా ? నా అనుమానాలేవీ నిజం కావుకదూ ... ఏదీ అలా అని కృష్ణుడిమీద ఒట్టు వెయ్యి."

"శ్రీకృష్ణపరమాత్మమీద ఒట్టు."

నిర్భయంగా అంది పద్మిని.

పద్మినిని చూస్తుంటే — విచిత్రంగా వుంది లక్ష్మికి. కృష్ణప్రియకి మరీ విచిత్రంగా వుంది. అసలు తను చూసేది అక్కయ్యనేనా అన్పిస్తోంది. వివాహం స్త్రీ జీవితంలో అనూహ్యమైన మార్పు తెస్తుందంటారు. మరీ ఇంత అనుకోని మార్పా ? బావతో సన్నిహితత్వం బలపడిందని అక్కయ్య మాటలవల్లే తెలుస్తోంది. ఎప్పుడూ అనారోగ్యంతో, దిగులూ విచారంతో కృంగిపోయే అక్కయ్యకీ — నిగారింపుతో, ఆత్మస్థైర్యంతో, తను నిలద్రొక్కుకోటమేకాక— ఇతరుల్ని ఓదార్చే స్థాయికి వచ్చిందన్నమాట —

లక్ష్మి మాత్రం — పద్మిని మనస్తత్వాన్ని అర్థం చేసుకోగలిగింది. కారణం — ఆవిడలో — తన ఛాయలు కన్పిస్తున్నాయి కనుక.

ఈ ఇంట్లో సంసార జీవితం ఎంత సక్రమంగా సాగుతుందో — రెండు తరాలుగా తెల్సు కనుక —

కృష్ణారావు తత్వం తనకి పూర్తిగా తెల్సు కనుక. ఐతే తెలియనిదల్లా పద్మిని అనారోగ్యం గురించే.

* * *

ఆ రోజు తల్లి పోయినరోజు —

మామూలు మనుష్యుల్లో పడుతున్న కృష్ణప్రియ పద్మిని గురించి భయపడుతూనేవుంది.

మళ్ళా భయపడటం అనవసరం అనుకుంటోంది.

కర్మయోగి

పద్మిని తనలా మనసుకు సమాధాన పర్చుకోలేదు — అలాగని బావగారి ఛాయలు పడకపోనూలేదు.

ఐనా వెయ్యి కళ్ళతో అక్కను గమనిస్తూనే వుంది. అనుకున్నట్టే ఆ రోజు గడపదాటి రాలేదు పద్మిని.

"అమ్మాయ్... చిన్న పిల్లవుకావు నువ్వు."

"నన్నలాగే పెంచిందత్తయ్యా అమ్మ."

ఈ మధ్యలో— ఇంత దీనంగా ఇంత బేలగా కోడల్ని ఎప్పుడూ చూడలేదు తులశమ్మ. ఆరిందాలా తనకు ధైర్యం చెప్పే కోడల్ని చూడటానికి అలవాటుపడ్డ ఆవిడ మనసు విలవిల్లాడింది.

"ఐనా — ఇప్పుడు నిన్ను పెద్దదాన్నిచేసి వెళ్ళిపోయారావిడ —"

"అత్తయ్యా —"

చిన్న పిల్లలా ఏడుస్తున్న పద్మినిని ఆప్యాయంగా దగ్గరకు తీసుకున్న ఆవిడ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

తల్లిలేని లోటును తీర్చటం ఎవరితరం ?

ఈ కడుపుమంటను ఏం చెప్పి ఆర్పటం సాధ్యమౌతుంది !!!

ఎంతోసేపటికి తనను తనే సమాధాన పర్చుకున్నట్టు కన్పించింది.

"అక్కయ్యా !..."

గది మూలగా కూర్చున్న లక్ష్మిని చూసి తల దించుకుంది.

"అక్కయ్యా — నువ్వింట్లోకి రాకూడదని మర్చిపోయాను... రాత్రినుంచీ అమ్మే గుర్తుకు వస్తోంది..."

"..........."

"ఏమిటో పిచ్చిదాన్లా ప్రొద్దున్నే— గదిలోకి వెళ్ళి పడుకున్నా... నీరసంగా వుంటేనూ..."

"జాలిగా చూస్తోంది లక్ష్మి."

"ప్రొద్దునే చెయ్యాల్సిన పన్లేవో చెయ్యలేదు... పాపం అత్తయ్య చేసుకుపోయేరేమో అన్నీ... వారికి పూజకి అన్నీ..."

"కృష్ణ చేసింది లేమ్మా. తోడబుట్టిన దానివి — నిన్ను అర్థం చేసుకోలేదా తను ? అందుకే — ఈ రోజు నువ్వు నిగ్రహించుకోలేవనే — నీకన్నాముందే లేచి పన్లన్నీ చేసుకుపోయింది — అత్తయ్య వద్దంటున్నా వినేలేదా పిచ్చిపిల్ల—ఐనా—మనకి ఇంట్లో పన్లేముంటాయి గనుక ? — తోచక కల్పించుకున్నవేగా —"

లక్ష్మివంక తృప్తిగా చూసింది.

"ప్రియ కాలం ప్రకారం నడవగలదు — కానీ కాలంతో నేనే మారలేకపోతున్నా."

"పోన్లేమ్మా — ఇక్కడ అర్థం చేసుకోని వాళ్ళుంటూ ఎవరున్నారు ? దేనికైనా కాలం కల్సి రావాలిగా."

లక్ష్మి ఆప్యాయంగా నవ్వుతోంది —

పద్మిని గుండెల్లో బలహీనతేదో కలుక్కుమంది.

"భగవాన్ — వీళ్ళందరూ ఎంత మంచి వాళ్ళు — ఎంతటి సహృదయం వీళ్ళది — ఎవరికీ ఎవరూ కష్టం కలిగించకుండా — ఎవరికివారే సమాధాన పడుతున్నారు. ఎవరికివారే సర్దుకుపోవటానికి ప్రయత్నిస్తున్నారు. కానీ— ఇంట్లో అందరికీ వుంది — ఈ వాతావరణంలో మార్పు పసిపాప ప్రాకులాడాలని ... అందుకోసం అత్తగారు చెయ్యని పూజంటూలేదు — తన స్థానంలో మరెవరున్నా — ఆవిడ కోరిక తీరేదే — ఈ వంశం నిలబడేదే ... "

"పద్మినీ — ఏమిటి ఆలోచిస్తున్నావ్ ... కూర్చోరాదూ కాసేపు ... "

"వారు ... వారు ... "

బొటనవ్రేలుతో గీస్తూ నీరసంగా నవ్వింది పద్మిని.

"ప్రియ మందిరంలో అన్నీ అమర్చి పెట్టేసింది. నువ్వు — నేనూ లేమన్న లోటు లేకుండా — ఆరిందాలా అన్నీ పన్లూ చేసుకుపోయింది. కృష్ణ పూజ అయ్యాక — నీ దగ్గరికి రెండు మూడుసార్లు వచ్చి వెళ్ళాడనుకుంటా — నీకు వంట్లో బావుల్లేదని — లేపకుండా వెళ్ళి వుంటాడు ... "

లక్ష్మి ఇదివరకు ఒక్కమాట మాట్లాడితే—

అదే మహా ప్రసాదంగా వుండేదిట — తను కూడా ఏ యోగుల్లోనో కస్సిపోతుందేమోనని భయపడి పోయేవారుట — తనూ — ప్రియ వచ్చాకే — ఇంటికి జీవం — లక్ష్మికి మాట వచ్చాయిట — అసలింతగా మాటాడగలదనే తెలియదుట.

అత్తగారి మాటలు గుర్తుకు వచ్చాయి పద్మినికి.

"అక్కా — నేనొక్క మాటడగనా... మనం తెల్సీ — తెలియకా కూడా — ఎవరికీ — ఎటువంటి ద్రోహం చెయ్యలేదే — ఎప్పుడూ — ఆ శ్రీకృష్ణుడ్నే నమ్ముకుని — మరో చింతలేకుండా బతుకుతున్నామే — మనల్నే — ఎందుకా దేముడిన్ని బాధలు పెడుతున్నాడు ? ఎందుకు మనశ్శాంతికి దూరం చేస్తున్నాడు ? నావ్వొక్క మాట చెప్పక్కా— నువ్వూ— అత్తయ్యా—చెయ్యని పూజలేదు. ఐదోతనం కోసం — ఆచరించని నోములేదు ... మరెందుకిలా అయింది ? ... "

లక్ష్మి కళ్ళల్లో నిశ్చలత తొంగి చూస్తోంటే — ఎప్పటికప్పుడు వింతగానే కన్పిస్తూవుంటుంది పద్మినికి.

"మన కర్మఫలాన్ని మార్చటం ఎవరితనం పద్మినీ — మన ప్రారబ్ధం శాపంలా మనల్ని వెంటాడుతోందిగానీ — దానికి భగవంతుడని ఎందుకు పేరు పెట్టుకోవాలి? పోనీ భగవంతుడే మన కష్టాలకు కారణం అనుకుందాం. అదాయన మంచికే తెలుసా — ఎందుకో చెప్పనా ? తనని నమ్ముకున్న వాళ్ళని తనకోసమే బతుకుతున్న వాళ్ళనీ — ముందుగా — ఏరుకుని — అష్టకష్టాలనూ కల్పించి — విరక్తినిపెంచి — తన ధ్యానాన్ని వారి గుండెల్లో దీపంలా వెలిగించి — ఆత్మ సాక్షాత్కారాన్ని కల్పిస్తాడు — చెత్తాచెదారం లాంటి సుఖదుఃఖాలను తరిమివేశాకే తన ఉనికిని గుర్తించేలాచేస్తాడు. ఇవి కష్టాలనుకోకూడదు— కష్టాల్లోనే — భగవంతుడికి దగ్గరవుతామని — నిర్లిప్తంగా ఈ యాత్ర సాగించాల్సిందే ... అదంతే —"

అలవాటుగా కళ్ళు మూసుకుని కూర్చుండి పోయింది పద్మిని.

ఆ రోజంతా అదోలా నీర్సంగా వుంది.

కృష్ణప్రియకి అక్క బాగా అర్థమౌతుంది. అందుకే అక్కను కదిలించకుండా — తన పని తను చేసుకుపోతోంది.

"ప్రియా..."

పనున్నట్టు వెడుతున్న కృష్ణప్రియ ప్రయత్న పూర్వకంగానే ఆగిపోయింది.

"ఏమక్కా —"

"అలా మాట్లాడించకుండాపోతావేం ?"

అక్క మాటలు ఆశ్చర్యంగా వున్నాయి.

ఇంత బేలగా మాట్లాడగా — ఇక్కడకు వచ్చాక ఇదే మొదలు వినటం.

"ప్రియా — అమ్మ గుర్తుకురావటంలేదే నీకూ ?"

కార్చిచ్చు

అగ్గిపుల్ల
అనుమానం
వెలిగితే రెండూ
ఆరని జ్వాలలు
నీటితో ఆరే
నిప్పొకటి
నిప్పులా ఆరక
నిను దహించేది మరొకటి

— తాతినేని తులసీమోహన్

పద్మిని గొంతు వొణుకుతోంది.

గతం గుర్తుకువచ్చి భయం వేసింది కృష్ణప్రియకు.

భయపడాల్సిందీ — దిగులుపడాల్సిందీ — గతాన్ని గురించి కాదు — కాకూడదు. వ్యథనూ శోకాన్నీ తప్ప మిగల్చని ఈ దిగులువల్ల ప్రయోజనం ఏముంది ? వెళ్ళిపోయిన తనవా రనుకున్న వారికోసం — ఉన్న తనవారికి — న్యాయం చెయ్యలేకపోవటం — కర్తవ్యాన్ని విస్మరించటం — క్షమించరాని నేరం — లక్ష్మి సహవాసం నేర్పిన పాఠాలు— ప్రియ అణువణువు లోనూ జీర్ణించుకుపోయాయి.

అందుకే ధైర్యంగా అక్క ముందు నిలబడ గలిగింది.

"గుర్తొస్తోందక్కా — వచ్చి ఏం చెయ్యగలం ?"

చెల్లెలి గొంతు తొణకటంలేదు — అదిరిపడి చూసింది పద్మిని.

"నువ్వేనా మాట్లాడేది ?..."

"నేనే... అక్కా — బావ శిక్షణలో నువ్వెంతో మారివుంటావనుకున్నా ... ప్రయోజనం లేని గతాన్ని తల్చుకుంటే — మనకు మిగిలేదేముంది ? మనవాళ్ళకోసం మిగల్చగలిగే దేముంటుంది ? మన చిరునవ్వులమీద — ఈ ఇంటి వెలుగు ఆధారపడివుంది — మన జీవితంలో వెలుగునింపిన వారికి మనవల్ల అందవల్సిన ఉపకారమిదేనా ?... ముఖ్యంగా నువ్వు గతాన్ని మర్చిపోవాలి..."

చెల్లెలివంకే విస్మయంగా చూస్తోంది పద్మిని. ఎంత ఎదిగిపోయింది. తన కళ్ళముందే ఎంతగా ఎదిగిపోయింది.

లక్ష్మి అభినందిస్తూన్నట్టు చూడటం— ఇంకేదో సంకేతాన్ని అందుకున్నట్టు కృష్ణప్రియ తల ఊపటం గ్రహించలేక పోయింది పద్మిని.

అక్క అనారోగ్యం సంగతీ తెల్సు—

కుటుంబ పరిస్థితుల దృష్ట్యా— సహజంగా నిలద్రొక్కుకోగల స్తోమత వున్న కృష్ణప్రియ మీద లక్ష్మి ప్రభావం బాగానే పడింది.

ఏ ప్రభావానికీ లొంగని బలహీనతని జయించాననుకున్న పద్మినిని చాలా తరముగా అది పలకరిస్తూనే వుంది—

ఇవాళ— ఏదోలా వుంది—

ఎప్పటిలా లేదు—


గుండెమీద కొండ పెట్టినట్టూ— పేగుల్ని తెంచుకుని దుఃఖం గుండెల కెగతంతున్నట్టూ—

భయాన్ని జయించలేని బలహీనత— తనని నిలువునా ముంచేస్తున్నట్టూ— ఏమిటిది ? ఎందుకని ?

కారణంవుంది...ఐనా—ఇంతభయంకరమైన అనుభూతులా... అంతేనా... కేవలం ఇది భ్రాంతేనా ?

అనుభూతుల వరకే పరిమితమా...

హాల్లో అత్తగారి గొంతు వినపడుతోంది.



వంటలు

మొగల్రాజ్ పరోటాలు

కావలసిన వస్తువులు :—

గోధుమపిండి అర కిలో, గ్రుడ్లు మూడు, పచ్చిమిరపకాయలు ఐదు, డాల్డా 100 గ్రా., ఉప్పు తగినంత.

చేయు విధానం :—

మొదట మిర్చిని సన్నగా తరిగి గ్రుడ్లను బాగా గిలక్కొట్టుకుని చిటికెడు ఉప్పువేసి దీనిలో మిర్చిని కలుపుకొని ఉంచుకొనవలెను. గోధుమ పిండిని జల్లించి పొట్టు తీసివేసి, తగినంత ఉప్పు వేసి నీరుపోసి ముద్దగా కలుపుకొనవలెను. ఈ ముద్దను నిమ్మకాయంత సైజులో ఉండలు చేసి వాటిని రొట్టెలుగా చేసి డాల్డా రాస్తూ చపాతీల మాదిరిగా మడిచి వాటిని వత్తి, పెనముపై వేసి రెండువైపులా కాల్చవలెను. రెండు వైపులా కాలిన తర్వాత డాల్డా వేసి అటు ఇటు త్రిప్పినచో రొట్టె పొరలుగావిడిపోయి ఉండును. గిలక్కొట్టిన గ్రుడ్డుసొనను ఒక టీస్పూన్ చొప్పున ప్రతి పొరలో పోసి పెనముపై అటు ఇటు త్రిప్పినచో పొరల లోపలి గ్రుడ్డుసొన రొట్టె అంతా పరచుకుని ఉండును. ఇవి చాలా రుచిగా ఉంటాయి. రొట్టెలు తినేడి వారికి వెరైటీగా కూడా ఉంటాయి.

— బి. అనూరాధకుమారి

సన్ ఫ్లవర్స్

కావలసినవి :-

మైదా పావుకేజి, డాల్డా 350 గ్రా, పాలు అరకప్పు, పచ్చికొబ్బరి చిప్ప 1, పంచదార 4 కప్పులు, యాలకలు 6, కిస్‌మిస్, జీడిపప్పు, కుంకుమ పువ్వు తగినన్ని.

చేసే పద్ధతి :

ముందుగా మైదాను 75 గ్రా. డాల్డావేసి చిటికెడు సోడాఉప్పు వేసుకొని పాలుపోసి గట్టిగా ముద్దలా కలిపి ఉంచుకోవాలి. కొబ్బరితురిమి అందులో 1కప్పు పంచదార వేసి పొయ్యిమీదపెట్టి తిప్పుతూ ఉండాలి. ముదురుపాకం కాకుండా లేత పాకంతోనే ముద్దలా ఉండేటట్లుచేసి జీడిపప్పు, కిస్‌మిస్, యాలుకపొడివేసి తిప్పి చల్లారిన తర్వాత చిన్న నిమ్మకాయసైజులో గుండ్రంగా బంతులు లాగా చేయాలి. తర్వాత మిగిలిన పంచదారను లేత పాకంపట్టి పక్కన ఉంచాలి. మైదా పిండిని కొంచెం కొంచెం తీసుకొని పూరీలాగా చేసి అందులో గుండ్రంగాచేసిన కొబ్బరిలౌజును పెట్టి చుట్టూ మోసివేయాలి. పూరీని మూసివేయగా చుట్టూ అంచులవెంట ఉన్న పిండిని నులక తాడులా మెలిపెట్టాలి. ఇపుడు దీని ఆకారం మధ్యలో బొడ్డులాఉండి చుట్టూ పువ్వు విడిలి నట్లు ఉంటుంది. వీటిని డాల్డాలో వేసి వేగనిచ్చి పట్టిఉంచిన చక్కెరపాకంలో వేడిమీద వేయాలి. 10 ని. ఉండనిచ్చి వీటినితీసి ఒక పళ్ళెంలో విడి విడిగా పెట్టాలి. వీటిమధ్యలో కుంకుమ పువ్వు అద్దితే అందంగా పువ్వులాగా ఉంటాయి.

— కుమారి

దసిమా

కావలసిన వస్తువులు :— గోధుమపిండి - 1 కె. జి., పంచదార – 3 డబ్బాలు, కొబ్బరి చిప్పలు – 2 ఎండువి, గసగసాలు–250 గ్రా, తినేసోడ – 50 పై., చక్కరకేళీ అరటి పళ్ళు – 3, యాలక్కాయలు 50 పై,, ఉంటే నెయ్యి, పాలు కూడా వేసుకోవచ్చు, మంచినూనె – అర కె. జి.

ముందుగా తయారు చేసుకోవలసినవి :— కొబ్బరి తరుముకోవాలి. గసగసాలు, యాలక్కాయలు నూరుకొనవలెను.

తయారు చేయు విధానము :— 3 డబ్బాల పంచదారలో కొంచెము నీళ్ళుపోసి స్టౌమీద పెట్టవలెను. పంచదార బాగా కరిగించాలి. తరువాత తురిమిన కొబ్బరి, గసగసాలు, యాలక్కాయలు నూరినవి పిండిలో వేయాలి. అరటిపళ్ళతొక్కలు తీసి, పిండిలో వేసి బాగా పిసకాలి. ఈ కలిపిన పిండిని కరిగిన పంచదారలోవేసి గట్టిగా కలపాలి. (చపాతి పిండిలా) మనకు కావలసిన సైజులో ఉండలు చేసుకొనవలెను. బాణలితో నూనె పోసి స్టౌమీద పెట్టవలెను. నూనె బాగా కాగిన తరువాత ఉండలను చపాతిలుగా చేసి నూనెలో వేసి బాగా వేగిన తరువాత తియ్యవలెను. ఇవి 1, 2 నెలలు నిలువ ఉంటాయి. చాల బాగుంటాయి.

— పి. నాగ ధన లక్ష్మిబాయి

జున్ను జామూన్లు

కావలసిన వస్తువులు :-

ఒక గ్లాసు (సన్నని) గోధుమరవ్వ, అర గ్లాసు జున్ను, అర గ్లాసు పంచదార, అర గ్లాసు నెయ్యి, యాలికులు.

చేయు విధానము :—

జున్నులో రవ్వ కలిపి మూతపెట్టివుంచి సుమారు 4,5 గం॥ల తరువాత మూత తీసి మరో మారు కలపాలి. స్టౌవ్ మీద బాణలిలో నెయ్యి కాగుతున్నపుడు జూన్ను ముద్ద కుంకుడు కాయంత తీసుకుని, దాని మధ్య యాలికు గింజ పెట్టి నేతిలో వేయించాలి. అన్నీ అలా వేయించాక పంచాదార తీగపాకం పట్టి అందులో వేయాలి. తరువాత మూతబెట్టి బాగా కుదిపి దించి మూత తీసి ఆరనిచ్చి తింటే చాలా బాగుంటాయి. పాకంలో ఎస్సెన్సు కూడా వేసుకోవచ్చు.

— కె. రాజ్యలక్ష్మి ★

కర్మయోగి

ఆ సమయంలో ఆవిడతో బాటు, చుట్టు ప్రక్కల అమ్మలక్కలందరూ కూర్చుంటాడు— కృష్ణదాముని కలవాటుపడ్డ ఆ గోడలమధ్య— ఏదో రూపంలో కృష్ణుడ్ని గురించిన గోష్టి జరుగుతూనే వుంది.

"... కృష్ణాష్టమి రాగానే... కేవలం— పళ్ళూ— దుంపలను మాత్రమే తినాలి— తెల్ల బట్ట కట్టుకుని—సదాచారముతో—సకలదేవతలను పూజిస్తూ— ఆ రోజు మొదలు సంవత్సరం వరకూ— కఠిన నియమములను ఆచరించాలి... భర్తయందు—ప్రేమా—భక్తి ముఖ్యం— ముందు చెప్పినట్టు బ్రాహ్మణులకి దానంచేసి— గోమయోదకంతో శిరస్సు తడిపి బిల్వ శ్రీఫలచూర్ణముతో జుత్తును శుభ్రపరచుకొనాలి. స్నానం చేసే సమయంలో గామూత్రాన్ని స్నానజలంలో కలపాలి... ఈ విధంగా ప్రతి కృష్ణ పక్ష చతుర్దశిరోజు చెయ్యటం ముఖ్యం. ఆ స్త్రీ వైధవ్యము పొందదు— అదృష్టవంతురాలై..."

అదోలా నవ్వుకుంది పద్మిని—


"ఇంట్లో ఎంత నష్టంజరిగినా—బాధలన్నీ మర్చిపోయి— అత్తయ్య అందరికీ అంత ఇదిగా ఎందుకు చెప్తోంది? తనకి మనశ్శాంతివుందా? తనకేమీ నష్టం కాలేదనా ?... అందరి కోసం— అందరి తృప్తికోసం..." చెల్లెలివంక కన్నార్పకుండా చూసింది పద్మిని.

"చెల్లెలు బ్రతకగలదు...బ్రతుకుతుంది." తృప్తిగా గొణుక్కుంది.

(ఇంకా వుంది)

సంగమం

ఆదూరి వెంకటసీతారామమూర్తి



డాబా మీద నిల్చుని ఆకాశంవంక చూశారు రాఘవరావుగారు—మేఘాలు ఒకటీ ఒకటీ పడమటినించి ఉత్తరం దిశగా పోతున్నాయి—పగటి వెలుగు తగ్గిపోటానికి యిక కాస్సేపే వ్యవధి వుంది. ఆ కాస్త వెలుగూ పోయి ఏ గాలో తోడైతే మేఘాలు వర్షించి వాతావరణం పూర్తిగా మారిపోతుంది—

ప్రకృతి ఎంతలో మారిపోవాలి ?

తూర్పుదిశన దూరంగా కొండవారగా వురకలేస్తూ కన్పిస్తోంది సముద్రం.

నింగికీ నేలకూ మధ్య గాలిలో గిరికీలు కొడుతోందో పక్షి.

ఆ పక్షితో తనను పోల్చుకున్నాడు రాఘవరావు. తన పరిస్థితీ అలానే వుంది — అంటూ అసంతృప్తిగా నిట్టూర్చేడు.

భాస్కరం అలాంటి నిర్ణయం తీసుకుంటాడని ఆయన ఏనాడూ వూహించనైనా వూహించలేదు. పిల్లలందరిమీదా ఒకే రకమైన ప్రేమ వున్నా భాస్కరమంటే తనకదోరకమైన ప్రత్యేకమైన అభిమానం. చిన్నతనం నుండీ డిగ్రీ పూర్తి చేసేవరకూ భాస్కరం కూడ తనమాట జవదాటలేదు. తన అభిప్రాయాలకు అనుగుణంగానే నడుచుకుంటూ వచ్చాడు.

‘ఈ పరిస్థితి యిలా వుంది నాన్నగారూ ఏం చెయ్యమంటారు’ అని అడిగేవాడు—తను చెప్పిందే వేదవాక్కుగా స్వీకరించేవాడు.

అటువంటిది వాడి స్వవిషయంలో—పెళ్ళి తన స్వవిషయమని అనుకున్నాడు కాబోలు... తన అభిప్రాయం అనవసరమనుకున్నాడు.

ఐతే—నేటి యువతరం ప్రతినిధిలా పెళ్ళి చేసుకొచ్చి కాళ్ళమీదపడి దీవించరడి నాన్నారూ అనలేదు—అలా చేసినా తనింత బాధపడేవాడే కాదు—కరుకుగానో, సౌమ్యంగానో పరిస్థితిని దిద్దుకునేవాడు.

‘నేను వసుధను ప్రేమించాను నాన్నగారూ. పెళ్ళికూడ చేసుకోవాలనుకుంటున్నాను — ఆమె కులమూ, ఆర్థిక స్థితిగతులూ నా కనవసరమనుకున్నాను — ఈ విషయంలో మీ అనుమతి తీసుకోకపోయినా తప్పటడుగు మాత్రం వేయటంలేదు. మీరు అర్థం చేసుకుని మమ్మల్ని దీవిస్తే నాకంటె అదృష్టవంతుడుండడు.’’ అంటూ ఓ శుభముహూర్తాన భాస్కరం తన నిశ్చయాన్ని వెల్లడిచేసే సరికి నోటమాటరాలేదు తనకు. భారతమ్మ సంగతి సరేసరి— కళ్ళంట నీళ్ళే తక్కువయ్యాయి—

ఆ తర్వాత మాటలూ, అర్థింపులూ, ఏడ్పులూ... ఎన్ని ఏమైతేనేం ? భాస్కరం తన మాటమీదే నిలబడిపోయాడు – పెళ్ళంటూ చేసుకుంటే నేను వసుధనే చేసుకుంటాను. కానీ మీ ఆశీర్వాదం లేనిదే పెళ్ళే చేసుకోను—అంటూ భీష్మించుకుని కూర్చున్నాడు.

‘‘ఇదో కొత్తరకమైన శిక్ష’’ నిట్టూర్చారు రాఘవరావుగారు.

ఆకాశంలో నల్లమేఘాల స్థానే తెల్ల మేఘాలు చోటుచేసుకుంటున్నాయి— దూరంగా వున్న ఖాళీస్థలంలో ఆడపిల్లలంతా ఏవేవో ఆటలాడుకుంటున్నారు—

అనుకోకుండా రాఘవరావుగారి దృష్టి మూడోయింటి డాబామీద పడింది — బంగారు వన్నె శరీరమేమో... నారింజరంగు చీరలో మెరిసి పోతోందామె. పమిటను నిండా కప్పుకుని పిల్లల ఆటల్ని చూస్తోంది.

సృష్టి ఎంత విచిత్రం ? ఒక్కోమనిషిలో ఎన్నో అందాలు ! ఒక్కో మనిషిలో ఎంతవెదికినా యే అందాలూ కానరావు.

వాళ్ళా ఇంట్లోదిగి నెలరోజులౌతుందేమో... ఆమె మాత్రం ఏ నాలుగుమార్లో కన్పించిందంతే. సుమారు నలభై ఏళ్ళుంటాయామెకు— కానీ ముప్పయి అయిదేళ్ళ దానిలా కన్పిస్తుంది. అంత అందమైన ఆమె భర్త ఎంత అదృష్టవంతుడో! మరెంత అందగాడో అన్పించింది. తీరా,ఆయనను చూశాక కాకిముక్కుకు దొండపండే అన్పించింది. చామనఛాయలో పొట్టిగా వుంటాడామె భర్త. ఓ చిన్నసైజు బానపొట్ట; నెత్తిమీద మండువాలా బట్టతల;ఉన్నకాస్తంత జుట్టైనా తైలసంస్కారం లేకుండా; ఈ ప్రపంచంతోనే సంబంధం లేనట్టు నైరాశ్యపు చూపులతో ఉంటాడు. ఒకరు మాట్లాడితే తప్ప తనంతట తాను కల్పించుకుని మాట్లాడే వ్యక్తిలా కన్పించదు ఆమెను కూడా

సంగమం

యింతవరకూ యిరుగు పొరుగులతో నైనా మాట్లాడగా ఎవరూ చూళ్ళేదు. గుట్టైన; గుంభనమైన సంసారంగా పేరు పొందింది వారి సంసారం ఈ కొద్దిరోజుల్లోనే.

రాఘవరావుగారి దృష్టి మళ్ళీ ఆకాశంమీదికే మళ్ళింది. ఆకాశం నిర్మలంగా వింత వెలుగుతో వుంది. బారులు బారులుగా పక్షులు ఎగురుతున్నాయి.

జంటలుగా ఏర్పడి మనుగడసాగించడానికి సృష్టి అట్లా జరిగిందా ? పెళ్ళిళ్ళు స్వర్గంలోనే ముందుగా జరుగుతాయి అన్నది ఆంగ్ల నానుడి. ఆమె పట్ల అది నిజమే అన్పిస్తుంది. లేకపోతే ఏమిటి ? అపురూప సౌందర్యరాశి అని మన పూర్వులు వర్ణించినట్లుండే ఆమె ఎక్కడ. కనీస ఆకర్షణకూడ లేని కురూపిలాంటి ఆయనెక్కడ? వీరిద్దరికీ పెళ్ళి ఎట్లా జరిగింది? ఇరవైయేళ్ళక్రితం స్త్రీకి నేడున్నంత స్వేచ్ఛ తన పెళ్ళి విషయంలో వుండేదికాదు — ఆ కారణంవల్లనే పెద్దల మాటలకు తలవంచి ఆమె అతడిని చేసుకుందా ? అదే నిజమైతే ఎంత రాక్షసత్వం వుందీ మనుషులలో ! ఎంత బుద్ధిహీనులు ఆ పెళ్ళి చేసిన పెద్దలు ! క్రూర సింహం ముందుకు లేడిపిల్లను తోసి ఆనందించ గల నేర్పు యీ మానవులకే వుందేమో ! కొందనవు బొమ్మలాంటి అమ్మాయిని ఆస్తికోసమో; చిన్నతనంలో అనుకున్న మాటకోసమో యిష్టంలేనివాడికిచ్చి కట్టబెట్టడం, ఒక జీవితానికి సరిపోయే శిక్షను వేయడం ఎంత అమానుషం ?

రాఘవరావుగారి దృష్టి రోడ్డుమీద సైకిల్ తొక్కుతూ పోతున్న అమ్మాయిపై పడింది — పన్నెండేళ్ళుంటాయేమో... తెల్లగా అందంగా సుకుమారంగా వుంది. ఆ సైకిలు ఆ యింటిముందు ఆగేకగాని గుర్తురాలేదు రాఘవరావుగార్కి ఆ అమ్మాయి వాళ్ళ అమ్మాయే అని — వసంత చూపిస్తే ఓ మారు చూశాడు. చక్రాల్లాంటి కళ్ళు... అచ్చం తల్లి పోలికతోనే వుంటుంది — అంతకంటే పెద్దవాడు డిగ్రీ చదువుతున్నాడట - అతగాడివన్నీ తండ్రిపోలికలే. అయినా బుద్ధులు మంచివి రావాలిగాని పోలికల్లో యేముందీ - పండిత పుత్రుడు శుంఠ అవొచ్చు— పాలేరు కొడుకు కలక్టరు కావొచ్చు.

"నాన్నా — అమ్మ పిలుస్తోంది", అంటూ వచ్చింది వసంత మౌనంగా. వసంత వెనుకే దిగిపోయారు రాఘవరావుగారు — సంధ్యావందనం చేస్తున్నా, ఆ తర్వాత భోంచేస్తున్నా ఆయన ఆలోచిస్తూనే వున్నారు.

భాస్కరం పుట్టిన నాలుగేళ్ళకు పుట్టింది వసంత. ఆ తర్వాత మరో మూడేళ్ళకు చైతన్య— అంతే ! ఆ తర్వాత యింక పిల్లలు కలగలేదు.

ముగ్గురి పిల్లల్నీ ముచ్చటగా పెంచాలను

కున్నారు రాఘవరావుగారు — వారికి మంచి భవిష్యత్తును ఏర్పరచాలని ఆశపడ్డాడు — కానీ మధ్యతరగతి మనిషి ఆశలపల్లకిలో వూరేగుతాడే తప్ప ఆర్థికపరమైన అవరోధాలను దాటి యివతల పడలేడన్న సత్యం కాస్త ఆలస్యంగానే అవగతమైంది రాఘవరావుగారికి — ఇంజనీరు అవాల్సిన భాస్కరం డిగ్రీ అయిందనిపించి గుమస్తాగిరీలో చేరాడు. సంగీతంలో అపర సరస్వతి కావల్సిన వసంత డబ్బులేని కారణంగా సంగీతాన్ని గీతాలతోనూ, చదువును పదో తరగతి తోనూ ఆపేసి తల్లిదండ్రుల నిర్ణయాలకు తలవొగ్గి యింట్లో కూర్చుంది.

అప్పటికే కూడబెట్టినదంతా హరించుకుపోగా అయిదువేల అప్పు మిగిలితే యిక చైతన్య చదువు గురించి బెంగ పట్టుకుంది రాఘవరావు గారికి.

కానీ చైతన్య చదువు అనుకున్నంత యిబ్బందిని కలిగించకపోగా అనుకోని అదృష్టాల్నే తెచ్చిపెట్టింది. ఎప్పుడూ నీరసంగా చదువులో ఏవరేజ్‌గా వుండే చైతన్య టెంత్ క్లాసు ఫస్టు క్లాసులో పాసయ్యాడు. పై చదువులకై గవర్నమెంటు స్కాలర్‌షిప్ సంపాదించుకున్నాడు.

మళ్ళీ పిల్లల భవిష్యత్తు గురించి ఆశలు చిగురులు తొడిగాయి రాఘవరావుగారి మనసులో. కొడుకు లిద్దరూ ఆర్థికంగా తనకు సాయపడితే వసంత పెళ్ళి కాస్త ఘనంగానే జరిపించగలడన్న నమ్మకమేర్పడింది. మధ్యతరగతి యిబ్బందులలో పెరిగి పెద్దవారైన పిల్లలే రేపు అనుభవశాలురై జీవితాల్ని అర్థంచేసుకుని ఎదుటి జీవితాల్ని దిద్దగలిగే స్థితికి చేరుకోగలరని రాఘవరావుగారి నమ్మిక.

కానీ... ఆ నమ్మకాల్ని వమ్ముచేసేలా భాస్కరం ప్రవర్తించబోవడం రాఘవరావుగారి గుండెను పిండినట్లే అయింది. తన పెళ్ళి విషయం తానే ఆలోచించుకుని నిర్ణయించుకున్న భాస్కరం రేపు తనకు ఆర్థికంగా ఎలా సాయపడ గలడన్నదే సందేహం.

భారంగా నిట్టూర్చేరు రాఘవరావుగారు. తన పిల్లలు తను అనుకున్నంత ఉత్తములూ, తెలివైనవాళ్ళూ కాకపోవచ్చు, కానీ కన్నవారికి కూడా ఉపయోగపడని పనికిమాలినవాళ్ళూ, స్వార్థపరులూ కాలేరన్నది మాత్రం నిజం — ఆ నమ్మకం తనకు తను వారికి పెంచిన పెంపకం కలిగించింది. ఆలోచిస్తే భాస్కరం చేసిన దాంట్లో తప్పేముంది? తన యిష్టాన్ని ప్రకటించి తమ అంగీకారాన్ని కోరేడు — ఆ మాటకొస్తే భాస్కరం పెళ్ళిద్వారా తను తన కూతురి పెళ్ళికోసం వెనకెయ్యాలనుకున్న ఆలోచనే తప్పు.

ఆలోచనలతో ఎప్పుడో నిద్రపట్టింది రాఘవరావుగారికి.

* * *

తెల్లారింది. బాధ్యతల సంసార చక్రం బరువుగా కదిలింది. చిన్నకొడుకు చైతన్యతో పాటు బస్టాపులో నిల్చున్న రాఘవరావుగారి ఆలోచనలు పరిపరివిధాల వున్నాయి. ఇంటర్ ఫస్టుక్లాసులోనూ; టెక్నాలజీ ఎంట్రెన్సు మంచి మార్కులతోనూ పాసైన చైతన్యకు యూనివర్శిటీలో సీటు వస్తుందో రాదోనన్న సందేహం ఏర్పడుతోంది. ఆ రోజే ఇంటర్వ్యూ.

వేళకు బస్సు రాలేదని చైతన్య అసహనంగా తిరుగుతున్నాడు. అతని కాలు ఒకచోట నిలవటం లేదు. కొడుకులోని ఆతృతని గ్రహించిన రాఘవరావుగారు "పోనీ ఆటో చేయించుకుని వెళ్దామేంటిరా" అన్నారు.

"ఎందుకు నాన్నగారూ అదో దండగ - ఈ టెక్నాలజీలో సీటొస్తుందని నాకు నమ్మకం కుదరడంలేదు — తెలివైన వాళ్ళూ; క్లాసులు తెచ్చుకున్నవాళ్ళే చాలమంది టెస్టులో నెగ్గలేదు. ఈ పరీక్షలు తెలివైన వాళ్ళకి సీటివ్వటానికి కాదు. క్లాసులతోనూ, మార్కులతోనూ నిమిత్తం లేకుండా తమకు కావల్సిన వారికిచ్చుకుందికి. అదే అర్థమౌతోంది నాకు. ఇంతోటి యింటర్వ్యూకే ఆటోలూ, టాక్సీలూ ఎందుకూ" చైతన్య చాల వుద్రేకంలో వున్నట్లనిపించింది రాఘవరావుగారికి.

"యూనివర్సిటీలో సీటుకోసమా అంకుల్ మీరు వెళ్తుంటా" సన్నని నాజూకైన గొంతు విన్పిస్తే పక్కకు చూశారు రాఘవరావుగారు. అందంగా చక్రాల్లాంటి కళ్ళతో. పన్నెండేళ్ళ ఆ అమ్మాయి — తమ వీధిలో కొత్తగా దిగిన వారమ్మాయి — చైతన్య మాటలు వింది కాబోలు చనువుగా వచ్చింది.

"ఏం? నువ్వు యిప్పించగలవా" అన్నాడు చైతన్య కాస్త చిరాగ్గానే.

"ఓ... మా డాడీ పన్జేసేది అక్కడేగా... నేను చెబితే కాదనరు - తప్పకుండా వస్తుంది సీటు" అంది.

ఆ అమ్మాయి మాటల్లోని అమాయకత్వానికి నవ్వొచ్చింది రాఘవరావుగారికి.

"మీ నాన్నగారేం చేస్తుంటారమ్మా అక్కడ?" అడిగేడు.

"అసిస్టెంట్ ప్రొఫెసరు... టెక్నాలజీలో"

ఆశ్చర్యంతో రాఘవరావుగారికి నోట మాట రాలేదు— ఏ వ్యవసాయదారుడో వ్యాపారస్తుడో అనుకున్న అందవిహీనమైన ఆ అమ్మాయి తండ్రేనా అంతటి విజ్ఞాని? బాహ్యమైన రూపం చూసి మనిషిని తప్పుగా అంచనా వేసినందుకు తనను తానే నిందించుకున్నాడు.

"ఆలోచించకండి అంకుల్ మీరు మా వీధిలోనేగా వుండేదీ. రోజూ చూస్తుంటా మిమ్మల్ని. పేరు రాసివ్వండి. నేను డాడీతో చెబుతాగా" అంటూ యిచ్చేవరకూ వూరుకుంది కాదా అమ్మాయి —


చైతన్య వివరాలు రాసిన కాగితాన్నామెచేతికందిస్తూ "నీ పేరేమిటమ్మా" అనడిగారు రాఘవరావుగారు.

"పల్లవి."

"మీ నాన్నగారికి సంగీతంలో కూడ ప్రవేశముందా."

"ఊహుఁ. మా నాన్నగారికి పుస్తకాలే అన్నీను. ఆయనకది వుంటే అన్నం కూడ అక్కర్లేదు."

"మరి...? మీ అమ్మగారు పాడతారా?"



'లెవల్ క్రాసింగ్'

ఇది లెవల్ క్రాసింగా ?
డెవిల్స్ క్రాసింగా ?

గణగణ డేంజరు గంట మ్రోగుతువుంటే
ఇదే నీ ఆఖరు గంట అని చెపుతూవుంటే
కణకణ డేంజరు లైటు వెలుగుతూవుంటే
ఇదే నీ ఆఖరు మంట అని తెలుపుతూవుంటే
క్రాస్‌బార్ మెడమీద కత్తిలాగ పడుతూవుంటే
చాకల్లే రైలుబండి దూసుకొపోతూవుంటే
ఎందకు ఈ తొందర ?
ఎక్కడికీ పరుగు ?
ఎందుకు ఈ హడావుడి. దాటిపోవాలని
చావడానికా ? బ్రతకడానికా ?
తెలీదు ఏమీ !

లెవల్ క్రాసింగ్‌నిండా జీవితం
కలకల బిలబిల కదుల్తూవుంటే

అటూ ఇటూ ట్రక్కులు, ఎన్నో కారులు, రిక్షాలో సైకిళ్లు
ముందొక కారు అడ్డుపడి
ఆగిపోయిందొక బస్సు
బస్సులోని జనం ఆగలేదు ఆవేశంతో ఊగిపోయారు
ప్రక్కల్లోంచి శూలంవలె దూసుకపోయింది కారు ఒకటి

దేనికేది ఢీకొన్నా
కొన్ని జీవితాలు సున్నా
కొన్ని క్షణాలు ఆగుతె
అంతా మామూలే మళ్లీ
అయినా ఎందుకీ తొందర ?
ఎక్కడికీ పరుగు ?
చావడానికా ? బ్రతకడానికా ?
తెలీదు ఏమీ !

— భమిడిపాటి వెంకటరమణ

పాడరన్నట్లు తలూపి వెళ్లిపోయింది.

నాలుగురోజుల తర్వాత ఓ సాయంకాలం వచ్చింది పల్లవి రాఘవరావుగారి దగ్గరకు.

''మీ చైతన్యగారికి సీటొచ్చిందట — డాడీ చెప్పమన్నారు.''

ఆశ్చర్యంగా నమ్మలేనట్లుగా చూశారామె వంక—నిజానికి ఆరోజు యింటర్వ్యూలో చైతన్య సరిగా చెప్పలేదు. ఖచ్చితంగా సీటు రాదనే నిర్ధారించుకున్నాడు. మరి యిదేమిటి ?

''నిజం అంకుల్—సీటొచ్చిందిట— నే చెప్ప లేదూ డాడీ నా మాట కాదనరనీ''

''థ్యాంక్యూ పల్లవీ థాంక్యూ...'' రాఘవ రావుగారి కళ్లలో ఆనందభాష్పాలు విరిశాయి.

సంగమం

ఆ మర్నాడు చైతన్య నిజంగానే సెలెక్టు అయినట్టు తెల్సింది — పల్లవి తండ్రి గురించి రాఘవరావుగారిలో ఎన్నో ఆలోచనలు చోటు చేసుకున్నాయి. ఆలోచించినకొద్దీ ఆయనపై గౌరవం పెరుగుతూనే వచ్చింది.

* * *

రోజులు గడుస్తున్న కొద్దీ రాఘవరావుగారి గుండెలో ఆవేదన అధికవౌతూనే వచ్చింది. భాస్కరం విషయంలో తనో నిర్ణయానికి రాలేక పోతున్నాడు. అందంలోనూ గుణంలోనూ గొప్ప వారైన కోడళ్ళు రావాలని ఆశపడ్డాడు. కోడలు గొప్పదైతే వంశం గొప్పదౌతుందని నమ్మకం. ఆ నమ్మకాలేకాక ఎక్కడో కాస్తంత స్వార్థం... ఆడపిల్ల తండ్రిగా తప్పదేమో మరి !

భాస్కరం పట్టుదల గురించి తనకు బాగా తెల్సు—ఆలోచించకుండా ఏ నిర్ణయాలూ తీసు కోక పోయినా ఒక నిశ్చయానికొస్తే మాత్రం మరొకరి ఆలోచనకు తావివ్వడు. వారం రోజులుగా కొడుకులో వచ్చిన మార్పును గమనిస్తూనే వున్నారాయన. ఇంట్లోవుండే సమయమే తగ్గిం చేసాడు భాస్కరం. ఏ వేళకోవచ్చి భోంచేస్తాడు. వున్నకాస్సేపూ మాటామంతీ లేకుండానే గడి పేస్తాడు.

ఆ రోజు ఆరుబయట వాలు కుర్చీలో కూర్చొని ఆలోచనలో నిమగ్నమయిన రాఘవ రావు గారి దగ్గరకు వసంతవచ్చి చెప్పిన వార్తకు ఆయన నిశ్చేష్టుడయ్యాడు.

''ఏమిటమ్మా నువ్వంటున్నదీ...నిజమే ?''

''అవున్నాన్నగారూ నేనూ నమ్మలేక పోయాను పల్లవి చెబుతుంటే—అంత అందమైన ఆమెకు మాటలు కరువా అన్పించింది.''

ఎంతదారుణం ? వాస్తవానికీ వూహకీ ఎంత తేడా ! అపురూప సౌందర్యవతి అనుకున్న ఆమె మూగదా ? అంద విహీనంగా నిర్లిప్తంగా వెర్రివాడులా వుండే ఆయన ఒక విశ్వ విద్యా లయంలో ప్రొఫెసరా ? వారిద్దరి సంగమం ఎంత విచిత్రమైనది !

కనీసావసరమైన మాట లేకపోయినా ఎదుటి వ్యక్తిలోని బాహ్య సౌందర్యంకాక ఆత్మ సౌందర్యాన్ని గుర్తించి జీవిత భాగస్వామిగా చేసుకున్న అతడెంత వున్నతుడు ! మనిషికి కావల్సింది చర్మ సౌందర్యం కాదు. మనో సౌందర్యం. అది గుర్తించి ఒకరినొకరు గౌరవించు కున్ననాడు ఆ దాంపత్యం రెండు శరీరాల కలయిక కానేరదు. రెండు ఆత్మల సంగమవౌతుంది. పవిత్రమైన రెండు మనసుల బంధవౌతుంది.

ఆ రాత్రే భాస్కరం పెళ్ళి విషయంలో ఒక నిర్ణయానికొచ్చారు రాఘవరావుగారు. రాత్రి ఏడున్నరకే భోజనంచేసి తన గదిలోకి పోయి చదువులో నిమగ్నమయ్యే ఆయన కొడుకు రాక కోసం నిరీక్షిస్తూ తొమ్మిది వరకూ ఆరు బయటే కూర్చున్నారు. ఆ తర్వాత అతగాడితోనే భోజనానికి కూర్చుని తన అభిమతాన్ని అంగీ కారాన్నీ వ్యక్తం చేశారాయన.

ఆ సమయంలో అటు భార్య భారతమ్మ ముఖంలోనూ, భాస్కరం ముఖంలోనూ వ్యక్త మైన ఆనందం ఆయనకు అపూర్వమనిపించింది. ఒకఇంటి పెద్దగా, యజమానిగా తనకు ఒకరి మనసును బాధించే హక్కెక్కడిది? అనుకున్నాడు.

''నాన్న మనసు నాకు తెలుసమ్మా. నన్నీ స్థితికి తెచ్చిన నాన్నను బాధపెట్టడం నాకూ యిష్టంలేదు. కానీ ఆయనకున్న బరువు బాధ్యత లను కొన్నైనా పంచుకోవాలనే నేనీ నిర్ణయం తీసుకున్నది''— అని ఆరాత్రి భాస్కరం తల్లితో చెప్పడంవిని ఆనందపడిపోయారురాఘవరావుగారు.

"తన పిల్లలు పేదరికమనే బూడిదలో పడి పోయిన మాణిక్యాలు" అనుకున్నారాయన.ఆర్రాత్రి హాయిగా నిద్రపోయారాయన.

* * *

"సాయంకాలం ఓ కొత్తవ్యక్తి మనింటి కొస్తున్నారు. అందరూ యింటిదగ్గరే ఉండండేం" అంటూ ఉదయం ఆఫీసుకెళ్ళే ముందు ఓజనాంతిక ప్రకటన చేశాడు భాస్కరం. భాస్కరంలో కలిగిన మార్పు రాఘవరావుగారు గుర్తించకపోలేదు. అందరితో పాటు ఆయనా విన్నారు కొడుకు మాటల్ని.

"ఇంకెవరై ఉంటారూ. కోడలి పిల్లనే సరాసరి యింటికి తీసుకొచ్చి పరిచయం చేస్తాడు గావును" అనుకున్నారాయన.

ఎవ్వరూ ఏం మాట్లాడక పోవడంచూసి, "అమ్మా వింటున్నావా. వీలైతే కాస్త టిఫిన్ కూడ చెయ్యాలి" అన్నాడు తల్లి నుద్దేశించి.

"అలాగే లేరా. ఇంతకీ ఆ వచ్చేదెవరో చెప్పావు కావు" అన్నారావిడ వంటగదిలోంచి తొంగి చూస్తూ.

చూస్తారుగా !" అంటూ ఎవరో ఏమిటో చెప్పకుండానే వెళ్ళిపోయాడు భాస్కరం.

సాయంకాలం నాలుగయ్యేసర్కి ఇల్లంతా నీటుగా సర్ది గుమ్మాలకు తెరలుకట్టింది వసంత. ఆ తర్వాత స్నానంచేసి వంగపూవు రంగు పరికిణీ, తెల్ల అమెరికన్ జార్జెట్ వోణి వేసుకుని జడలో ఫల సంపెంగి పెట్టుకుంది. భారతమ్మగారుకూడ ఉప్మాచేసి, ఫిల్టర్ కాఫీ కోసం డికాక్షన్ వేశారు — పనులన్నీ అయ్యాక గుంటూరు జరీ చీర కట్టుకుని గుమ్మంలో చతికిల బడ్డారు — రాఘవరావుగారుకూడ షికారు కెళ్ళడం మానేసి పొందూరు ఖద్దరు పంచె, ఇస్త్రీ లాల్చీ వేసుకుని పక్కింటివారినుంచి తెప్పించుకున్న న్యూస్ పేపర్ చూస్తూ ముందు గదిలో కూర్చున్నారు. ఒక్క చైతన్యకు తప్ప అందరికీ ఒకే ఆత్రుత. ఆ వస్తున్నది ఎవరా అని. చైతన్య మాత్రం మామూలుగానే కాలేజీనుంచి వచ్చి పుస్తకాలు తీసుకుని డాబామీదికి పోయాడు.

ఐదున్నర అవుతూంటే యింటి ముందు స్కూటర్ ఆగింది —భాస్కరం వెనుకే యింట్లో కొచ్చిన అతన్నిచూసి నిరుత్సాహపడ్డారంతా.

"ఇతను పండరికుమార్ అనీ... నాకు కావల్సినవాడు — ఎం.కామ్. చదివి ప్రస్తుతం బేంకులో పనిచేస్తున్నాడు" అంటూ తల్లికీ తండ్రికీ పరిచయం చేశాడు భాస్కరం.

"చాలా సంతోషం నాయనా !" అంటూనే ఏవేవో ప్రశ్నలు కురిపించారు రాఘవరావుగారు.

ప్లేటుతో ఉప్మా, గాజుగ్లాసుతో మంచి నీళ్ళూ తెచ్చి బల్లమీద పెట్టింది వసంత.

"మా చెల్లాయి వసంత"అంటూ ఆమెనూ పరిచయం చేశాడు.

"నమస్కారం. ఏం చేస్తున్నారు" అంటూ నవ్వుతూ అడిగేడు పండరికుమార్. సిగ్గుపడి తలొంచుకుంది వసంత.

"ఏముందీ మిడిల్ క్లాస్ చదువుతో; ఆలోచనలతో గడిపేస్తోంది"అన్నాడు భాస్కరమే ఛలోక్తిగా.

"పో అన్నయ్యా"అంటూ సిగ్గుపడిందామె. ఆ సిగ్గుల మొగ్గలలో అందాల్ని చూశాడు పండరికుమార్.

కాస్సేపు మాట్లాడి అతను వెళ్ళిపోయాక కొడుకును అడిగింది భారతమ్మగారు.

"ఇంతకీ ఆ అబ్బాయి ఎవరంటావ్" అని—

"మీకాబోయే కోడలికి పెన్సాత్తూ అన్న దమ్ముడు — నాకు చిన్ననాటి స్నేహితుడు — ఇంకా... మీరు కావాలనుకుంటే యీ యింటి అల్లుడుకూడ" అని అందరి వంకా చూశాడు భాస్కరం. భారతమ్మగారూ రాఘవరావుగారూ ఆఖరి మాటకు ఆశ్చర్యంగా కొడుకు ముఖంలోకి చూశారు. వసంత మాత్రం సిగ్గుపడి మరో గదిలోకి వెళ్ళిపోయింది.

"మనం కావాలనుకుంటే మాత్రం అయిపోతుందా ? అబ్బాయి విశేషంలా వున్నాడు — ఉద్యోగస్తుడూ, మర్యాదస్తుడూను. అతగాడు నచ్చుకోవాలిగా — ఇంతకీ కులమేమిటో ... " అని ఆగిపోయింది భారతమ్మగారు.

"కులానికేముందమ్మా — మనవాళ్ళే — " అని, తండ్రి వంక తిరిగి —

"మీరాలోచించి చెప్పండి నాన్నగారూ. అతనికి మన వసంతను ఎప్పుడో చూపించాను. అతనికి నచ్చింది. కట్నకానుకల ప్రసక్తిలేదు. మీరాలోచించి సరే అంటే ముహూర్తాలు పెట్టుకోవడమే."

రాఘవరావుగారికి మనసంతా ఆనందంతో నిండిపోయింది. భాస్కరంమీద తను పెట్టుకున్న ఆశలు యీడేరాయనిపించింది. "ఇంకా ఆలోచించే దేముంది — వసంతకు కూడా యిష్టమేనని బోధపడుతోంది. ఏమ్మా వసంతా" అంటూ చాటునుంచి చూస్తున్న ఆమె వంక చూశారాయన.

"మీ యిష్టం" అంది వసంత ఆనందంగానే.

"శుభం. ఇంతకీ కోడలిపిల్ల నెప్పుడు చూపిస్తావోయ్ !" అడిగింది భారతమ్మ కొడుకుని.

"మీ యిష్టమే" అంటూ లేచాడు భాస్కరం.

* * *

ఇంటిముందు ఆటో ఆగింది. ఆటో వెనుకే స్కూటర్ ఆపి లోపలికొచ్చాడు పండరికుమార్.

వస్తూనే గుమ్మంలోని వసంతనుచూశాడు. లేతగులాబీ పాలిస్టర్ చీరలో అందంగా మెరిసి

కార్టూనిస్టులకు సూచనలు !

★ కార్టూన్లను మంచి డ్రాయింగు కాగితంమీద ఇండియన్ యింకుతో గీసి పంపాలి.

★ ప్రతి కార్టూన్ వెనుక కార్టూనిస్టు పేరు, చిరునామా ఉండాలి.

★ వ్యంగ్య చిత్రాలు స్పష్టంగా సాధ్యమైనంతవరకూ వాటిపై 'వ్యాఖ్య' చదవటానికి ముందే నవ్వించేవిగా అర్థవంతంగా వుండాలి !

★ వ్యాఖ్య చిన్నదిగా క్లుప్తంగావుండాలి అక్షరాలు కుదురుగా మొదటిసారి చదివినప్పుడే అర్థం అవ్వాలి ! కార్టూన్ మీద పేరూ వూరు అన్నీ రాస్తే అవి తిరస్కరింపబడే అవకాశాలుంటాయి.

★ సొంత చిరునామా గల తపాలాబిళ్ళలు అంటించిన కవరుగల కార్టూన్లను త్రిప్పిపంపడంజరుగుతుంది దారిలో పోయేవాటికి మా బాధ్యతలేదు.

★ ఎన్నుకొన్న కార్టూన్లలో అన్నీగాక కొన్ని మాత్రమే ఒక్కోసారి వేసుకోడం జరుగుతుంది పరిశీలనా ఐదారువారాలు పట్టవచ్చు.

★ పండుగల కార్టూన్లు — బాగా ముందుగా వాటి కవరు మీద ఆ "ప్రత్యేక" సందర్భాన్ని పేర్కొంటూ పంపడం అవసరం.

★ రంగుల కార్టూన్లు, పెన్సిలు బొమ్మలు, తెల్లకాగితంమీద వేసిన బొమ్మలు పంపవద్దని మనవి.

★ మా కార్యాలయానికి స్వయంగావచ్చి కార్టూన్లు అందజేసేవారు కూడా స్వంత చిరునామాగల స్టాంపులంటించిన కవరు జతచేయాలి. కాపీ కార్టూన్లు పంపరాదు.

— సం॥

పోతోంది. ఆతడిని చూసి తుర్రుమని లోపలికి పోయింది వసంత.

"రావోయ్ రా!" అంటూ లేచారు రాఘవరావుగారు. గ్లాస్కోపంచ; పట్టు లాల్చీ ధరించారాయన. భారతమ్మగారు తమ పెళ్ళినాటి పట్టుచీరలో పెద్దరికం ఫుట్టిపడేలా నిండుగా తయారయ్యారు.

"ఇక ఆలస్యమేముంది పదండి" అంటూ అడుగుముందుకు వేశాడు భాస్కరం.

ఆటోలో రాఘవరావుగారూ, భారతమ్మగారూ వసంత కూర్చున్నారు. ఆ వెనుక స్కూటర్ మీద పండరికుమార్, భాస్కరం బయల్దేరారు.

మరో పావుగంటలో ఆటో ఓ చిన్న డాబా ముందు ఆగింది. ఆటోదిగి ఇంటివైపు చూశారు రాఘవరావుగారు. ముందు ఖాళీ జాగాలో పూల మొక్కలు, వెనుకగా చిన్నయిల్లు. ముచ్చటగా వుంది. లోపల్నించి వీణావాదనం హాయిగా విన్పిస్తోంది. పండరికుమార్ స్కూటర్‌దిగి, గేటు తీసి వారి నాహ్వానించాడు.

గులాబి, మందారం, మల్లె, చామంతీ... మొక్కలను దాటి గుమ్మంలోకి అడుగుపెట్టిన

సంగమం

రాఘవరావుగారి దృష్టి అపర సరస్వతీదేవిలా వీణ వాయిస్తున్న అమ్మాయిపైన పడింది. ఛాయ తక్కువే అయినా కళగావుండే ముఖం, పెద్ద కళ్ళు. వీణవాయించడం ఆపి, లేచి నిల్చుందామె.

"మా చెల్లాయి వసుధ" పరిచయం చేశాడు పండరి.

గౌరవంగా తలొంచి చేతులు జోడించింది వసుధ.

"వీరు మా అమ్మగారు. ఈ యింట్లో వుండేది మేం ముగ్గురమే. నాన్నగారు పోయి మూడేళ్ళయింది" అన్నాడు పండరి తన తల్లిని పరిచయం చేస్తూ.

"మధ్యలో ఆపేశావేమమ్మా, ఓ చక్కని కృతి వాయించు" అన్నారు రాఘవరావుగారు కూర్చుంటూ.

కూర్చొని వీణను చేతిలోనికి తీసుకుంది వసుధ. "కోటినదులు ధనుష్కోటిలో నుండగా" త్యాగరాజస్వామి కృతి వీనులవిందు నలరిస్తోంది.

"చెల్లాయి ఇప్పటికి పాతిక కచ్చేరీల వరకూ యిచ్చింది" అన్నాడు పండరి. రాఘవరావుగారు సంగీతంలో పూర్తిగా లీనమయ్యారు. ఫలహారం తీసుకుంటూ కూతురి అదృష్టానికి లోలోపలే మురిసిపోతోంది భారతమ్మ.

వీణపై వాద్యం పూర్తయ్యాక భారతమ్మ నోరు విప్పింది. "మాటల్ని కూడ తీగపై పలికించగల నేర్పుందమ్మా నీకు. ఒక్క పాట కూడ పాడావంటే..."

వసుధ లేచి నిల్చుంది. ఆమెకళ్లలో సుళ్లు తిరిగిన కన్నీళ్ళు.

"మీ కోడలు మాటల్ని తీగమీదే పలికించ గలదమ్మా — గొంతులోంచి పలికించే భాగ్యం ఆ దేవుడియ్యలేదు". భాస్కరం మాటలకు అవాక్కయి చూశారు రాఘవరావుగారు. అంటే... అంటే...యిది భాస్కరం తన బరువును దించడానికి చేసిన త్యాగం కాదుకదా ?

నిశ్శబ్దపవనంలో సంగీతం మిళితమైనట్లు ఉప్పునీటి జలధిలో పవిత్రజీవనదులు సంగమించినట్లు, యీ ఇరువురి సంగమం సహజసిద్ధమైతే...అదే నిజమైతే...? రాఘవరావుగారి కళ్ళలో నీళ్ళు చిలికాయి.

అవి...అవి...భాష్పాలే — ఆనందభాష్పాలే!! ★

హైదరాబాద్ నోట్‌బుక్

జర్నలిస్ట్ కాలనీ కార్యాలయం ప్రారంభం :

ముఖ్యమంత్రి శ్రీ రామారావు మే దినోత్సవాన ఉదయం జూబిలీ హిల్స్‌లో నిర్మింపబోయే జర్నలిస్టు కాలనీ కార్యాలయ భవనానికి ప్రారంభోత్సవం జరిపారు. పత్రికా రచయితలు తమ మేధస్సు డబ్బుకు అమ్ముకోక పోతనలాగ గౌరవప్రదంగా జీవితం గడపాలని ఆయన ఉద్బోధించారు. పత్రికారచయిత ప్రయోజనాలను కాపాడడానికి తన ప్రభుత్వం అన్నివిధాల సహకరిస్తుందన్నారు. కాలనీ అభివృద్ధికి 10 లక్షల సహాయం ప్రకటించారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన ఆర్థికశాఖా మంత్రి శ్రీ నాదెండ్ల భాస్కరరావు జూబిలీ హిల్స్ కాలనీవాసిగా తోడ్పడతానన్నారు. సమాచారశాఖా మంత్రి శ్రీ హరిరామ జోగయ్య జర్నలిస్టుల పక్షాన ముఖ్యమంత్రిని ఆర్థిక సహాయం కోరారు. ఇతర పట్టణాలలోను పత్రికా రచయితలకు నివేశన స్థలాలు, గృహవసతి కల్పిస్తున్నామని మునిసిపల్ శాఖామంత్రి శ్రీ రామకృష్ణుడు అన్నారు.

చో రామస్వామి ఉద్బోధ


తుగ్లక్ పత్రికా సంపాదకులు శ్రీ చో రామస్వామి ఈ నెల 1వ తేదీన త్యాగరాజ భవనంలో గోరాశాస్త్రి అకాడెమీ ఏర్పాటు చేసిన గోరాశాస్త్రి ద్వితీయ స్మారకోపన్యాసం కావిస్తూ చేసిన సూచనలను ప్రతి పత్రికా రచయితా మననం చేసుకోవాలని నేను భావిస్తున్నాను. భారత పత్రికారంగం తన బాధ్యతను, విధులను తక్షణ ఫలితాలకోసం తాపత్రయపడక, దీర్ఘకాలిక ప్రయోజనాల దృష్టితో కృషి చేయాలని కోరారు. నేటి పత్రికలు ప్రజాభిప్రాయం ప్రకటనకు, నూతనభావాల ప్రకటనకు జంకుతున్నాయని ఆయన అన్నారు. రాజకీయ పార్టీలు తమ ప్రచారం చేసుకొంటున్నాయి. ఇవి తప్ప ప్రజలకు వాస్తవాలు తెలియడంలేదు. పార్టీ సిద్ధాంతాలను అర్థం చేసుకొనే అవకాశం వారికి లేదు. అందువల్ల పత్రికలు వాస్తవాన్ని, విజ్ఞానాన్ని నిరక్షరాస్యులైన ప్రజలకు అందించాలి. దేశంలో పత్రికలు చదివేవారి సంఖ్య జనాభాలో ఐదు శాతమే. అయినా శ్రీమతిగాంధీ ఆందోళన చెందుతున్నారు. ఆ మాత్రం వాస్తవాలు తెలియడమూ ఆమెకు ఇష్టంలేదు. ఆంధ్ర కర్నాటక రాష్ట్రాలలో మూడు దశాబ్దాలుగా జరిగిన అవినీతిని, అసమర్థపాలనను పత్రికలు ఏండ్ల తరబడి వ్రాయడంవల్లే జనం అంతో ఇంతో నిజం తెలుసుకొని ప్రత్యామ్నాయ ప్రభుత్వం కోసం ప్రయత్నించారు. ఇప్పటి ఆంధ్ర, కర్నాటక రాష్ట్రాలలోని ప్రభుత్వాలను పనితీరును మరికొంత కాలం వేచి చూడాలి. అప్పుడే విమర్శించడం తగదు. శ్రీ ఎన్.టి. రామారావు మార్క్సిస్ట్ ముఖ్యమంత్రి కూడ ప్రదర్శించని ధైర్యసాహసాలు ప్రదర్శిస్తున్నారు — కేంద్రం మంచి నిధులను రాబట్టడం విషయంలో, ఆయన కొన్ని సినిమా తమాషాలు చేస్తున్నా, ప్రజలకు మంచి చేయాలన్న తపన ఆయనలో తీవ్రంగా వుంది — అని శ్రీ చో అన్నారు. దేశంలోని మేధావులకు ప్రజా సమస్యల పట్ల గల ఉదాసీన భావాన్ని ఆయన ప్రస్తావించి, అలాటివారికి రాజకీయాలను ఈసడించుకొనే అర్హతలేదన్నారు. దేశ హితాన్ని కాపాడగల కొత్తతరం నాయకులను మనం ప్రోత్సహించాలి. నిజాయతీ, అనుభవజ్ఞుల సలహాలను సవ్యంగా గ్రహించేవారెవరైనా సమర్థంగా ప్రభుత్వ బాధ్యతలు నిర్వహించగలరు. జనతా, భారతీయ జనతా పార్టీలు ఏకం అయితే, సమర్థమైన రాజకీయ పక్షం రూపొందుతుందని నా అభిప్రాయం — అని శ్రీ చో అన్నారు. దాదాపు ముప్పావు గంట ప్రసంగంలో శ్రీ చో విసుర్లు, వ్యంగ్యాలు, వ్యాఖ్యలతో శ్రోతలను ముగ్ధులను చేశారు. ముఖ్య అతిథి విధాన సభ బి.జె.పి. పక్షనాయకుడు శ్రీ వెంకయ్యనాయుడు ప్రసంగిస్తూ, ప్రజలలో సామాజిక చైతన్యం పెరిగితే తప్ప ఏ పార్టీ అధికారానికి వచ్చినా ప్రయోజనం లేదన్నారు. ఎలాటి దురుద్దేశాలూ ఆపాదించకుండా, విధాన సభలను, న్యాయశాఖలను విమర్శించే హక్కు ప్రజలకు వుండాలని ఆయన అన్నారు. అధ్యక్షత వహించిన శ్రీ పొత్తూరి వేంకటేశ్వరరావు ఇదివరకటికన్నా ఇప్పుడు శాసన సభ్యులు, న్యాయమూర్తులు ప్రతి విమర్శనూ తీవ్రంగా భావిస్తున్నారని,అనీఅనక ముందే భుజాలు తడుముకుంటున్నారని అన్నారు. తాము చేసిందే సరైనదనే భావం అధికారంలో వున్న వారి ప్రవర్తనలో కనిపిస్తున్నదని, విమర్శించే పత్రికలను రకరకాలుగా వేధిస్తున్నారని ఆయన విచారం ప్రకటించారు. అకాడెమీ కన్వీనర్ శ్రీ సిరాల్ల వేంకటేశ్వర్లు, శ్రీ గోరా శాస్త్రి పత్రికా రచనా శైలిని, సాహిత్య కృషిని ముందు తరాలవారికి ఇవ్వడం తమ అకాడెమీ ఉద్దేశమన్నారు. పలువురు గోరాశాస్త్రి సేవను ప్రశంసిస్తూ ప్రసంగించారు.

ఉపశ్రుతి :

పత్రికా రచయితలు పోతనలాగ వుండాలని, ఆయన భాగవతాన్ని రామునికి అంకితమిచ్చినట్టు ఉదాత్తంగా ప్రవర్తించాలంటున్నారే ముఖ్యమంత్రి, ఎలాగా ? — అనడిగారు నవ్వొక సాటి పత్రికా రచయిత. ఆనాడు రామునికి అంకితమిచ్చాడు పోతన. ఈనాడు ఈ రామునికి అంకితమిస్తే సరి — అన్నారు మరొక పత్రికా రచయిత.

— తిరుమల రామచంద్ర★

ఆంధ్ర సచిత్ర వారపత్రికలో సీరియల్‌గా ప్రచురితమైన శ్రీ ఆకెళ్ల వెంకట సూర్యనారాయణ రచించిన 'ధర్మోరక్షతి రక్షితః' నవల ఆవిష్కరణ సభ ఇటీవల కాకినాడలో రెవెన్యూబోర్డు సహాయ కార్యదర్శి (హైదరాబాదు) శ్రీ జి. ఫణికుమార్ ఆధ్యక్షతన జరిగింది. ఆ సందర్భంగా వేదికపై ఉన్న శ్రీమతి నందుల సుశీలాదేవి, శ్రీ చివుకుల పురుషోత్తం (ఆవిష్కర్త), శ్రీ ఫణికుమార్, శ్రీ భరణి, రచయిత శ్రీ ఆకెళ్ల వెంకట సూర్యనారాయణ, ప్రసంగిస్తున్న శ్రీ ఆద్దేపల్లి రామమోహనరావుగార్లని చిత్రంలో చూడవచ్చు.



అవీ ఇవీ అన్నీ

వివాహం

శ్రీ గురజాడ శ్రీరామమూర్తిగారి మేనల్లుడు (కీ. శే. పసుమర్తి కనకరాజుగారి పుత్రుడు) చి॥ సత్యనారాయణకు తూర్పు గోదావరి జిల్లా అమలాపురం వాస్తవ్యులు శ్రీ ముదిగొండ వీరభద్రరావుగారి 5వ పుత్రిక చి. ల. సౌ. జయప్రభావతికి హైదరాబాదులోని మెహిదీపట్నం కమ్యూనిటీ హాలులో మే 9వ తేదీ ఉదయం గం. 10–52 ని.లకు వైభవంగా వివాహం జరిగింది. పలువురు పెద్దలు, బంధుమిత్రులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

భువనేశ్వరం ఆంధ్ర సంస్కృతీ సమితి ఉగాది వేడుకలు, శ్రీరామ నవమి ఉత్సవాలు

భువనేశ్వరం ఆంధ్ర సాంస్కృతీ సమితి ఆధ్వర్యాన ఏప్రిల్ 2వ తేదీనుండి 14వ తేదీ వరకు సమితి భవన ప్రాంగణములో రక్తాక్షి ఉగాది వేడుకలు, శ్రీరామ నవమి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఉగాది సందర్భంగా పంచాగ శ్రవణం, ఔత్సాహిక కవుల కవితాగానం సాంస్కృతిక కార్యక్రమాల్లో లలిత సంగీతం, ఏకపాత్రాభినయాలు జరిగాయి. ఏప్రిల్ 3 నుండి 9వ తేదీ వరకు "సుందర దాసు" శ్రీ ఎమ్మెస్ రామారావు గారిచే హనుమాన్ చాలీసా, సుందర కాండ గానం మనోహరంగా జరిగింది. 9వ తేదీన శ్రీ రామారావు గారికి సన్మానపత్రం సమర్పించి, దుశ్శాలువా కప్పి, సమితి ఆధ్వర్యాన సన్మానం చేశారు.

ఏప్రిల్ 10వ తేదీ నుండి 14వ తేదీ వరకు శ్రీరామనవమి ఉత్సవాలు వైభవోపేతంగా జరిగాయి.

భువనేశ్వరంలోని ఆంధ్రులు, ఆంధ్రేతరులు కూడా ఈ కార్యక్రమాలలో ఉత్సాహంగా పాల్గొని జయప్రదం చేశారు. (ఒ. వి.)

'బరౌనీ'కి కవితా వేదిక బహుమతి

కవితా వేదిక, తంగళ్ళపల్లి వారు ఏటా ఉత్తమ కవితకు యిచ్చే బహుమతి (1983కి) కవి బరౌనీకి లభించింది. వీరి కవిత 'అస్సాం' ఉత్తమమైనదిగా నిర్ణయింపబడింది. బహుమతిగా వీరికి రూ. 216 లు లభిస్తాయి.

శ్రీయుతులు చేకూరి రామారావు, జయధీర్ తిరుమలరావు, కె. శివారెడ్డిగారలు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. (ఒ. వి.)

అస్సాంలో ఆంధ్రుల ఉగాది వేడుకలు

రక్తాక్షి ఉగాది సందర్భంగా నజీరా (అస్సాం)లో ఉన్న సుమారు వందమంది తెలుగు వారు ఏప్రిల్ ఒకటి సాయంత్రం చక్కని సాహితీ సమావేశం జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ఛీఫ్ జియోఫిజిసిస్టు శ్రీ కె. వి. ఎస్. మూర్తి గారు, అధ్యక్షత వహించగా, శ్రీమతి సరస్వతి, శ్రీయుతులు పురుషోత్తముడు, డా॥ వి.వి.ఎన్. మూర్తి, శ్రీ రామాచార్యగారలు వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు. సుమారు 50కి పైగా కవితలు పద్యాలు సమర్పించబడిన ఈ కార్యక్రమంలో దాదాపు 16 మంది ఔత్సాహికులు పాల్గొన్నారు.

ఏప్రిల్ రెండున నజీరా, శివసాగర్ (అస్సాం) పట్టణాల్లోని సుమారు రెండు వందలమంది ప్రవాసాంధ్రులు నజీరాలోని ఓ ఎన్జీసీ ఆడిటోరియంలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొన్నారు. శ్రీమతి వరలక్ష్మి రామారావు ప్రార్థనా గీతంతో ప్రారంభమైన ఈ కార్యక్రమానికి ఛీఫ్ జియాలజిస్టు శ్రీ వి. వి. కె. రావు ముఖ్య అతిథిగా విచ్చేయగా, శ్రీ కె. వి. ఎస్. మూర్తి (ఛీఫ్ జియో ఫిజిసిస్టు) అధ్యక్షత వహించారు.

శ్రీరామ్మూర్తి పంతులుగారి పంచాంగ పఠనం, శ్రీ సీతారామయ్యగారి "మాయల ఫకీరు" ఏకపాత్రాభినయం, శ్రీ మీనాక్షి సుందరం గారి వేణుగానం, శ్రీ బద్రీనారాయణగారి మిమిక్రి, శ్రీ సోమంచి యజ్ఞన్నశాస్త్రిగారు రచించిన "రిహార్సల్సు" – నాటిక ప్రదర్శన జరిగింది. నజీరాలోని ప్రవాసాంధ్రులందరు కలిసి ప్రప్రథమంగా "తెలుగు సమితిని" ఏర్పాటు చేసుకున్నారు. ఈ సంస్థకు శ్రీ కె. వి. ఎస్. మూర్తి గౌరవాధ్యక్షులు, శ్రీ వి. వి. కె. రావు గౌరవ ఉపాధ్యక్షులు, శ్రీ వి. బుచ్చిరాజు అధ్యక్షులు. శ్రీ వి. రఘురామారావుగారు కార్యదర్శి మరో ఏడుగురు కార్యవర్గ సభ్యులుగా నిర్ణయించబడ్డారు.

లక్నో ఆంధ్రసంఘం ఉగాది వేడుకలు

సంఘం సభ్యులు ఉగాది నాడు, సాయంత్రం సమావేశము అయి ఉగాది వేడుకలు చాలా ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వీణావాయిద్యమూ, మూడునాటికలూ పంచాంగ శ్రవణమూ, కార్యక్రమములు ఏర్పాటు చేయబడ్డాయి. కార్యక్రమము "మా తెలుగు తల్లికి మల్లెపూదండ" తో ప్రారంభమయి, దాదాపు మూడు గంటలసేపు, సభ్యులనూ, వారి కుటుంబాలనూ ఆనందపరిచింది. (ఒ. వి)

Printed and Published by S. Nageswara Rao at the Andhra Patrika Press, Mallikarjuna Rao Street, Gandhinagar, Vijayawada-3.
Editor: S. Radhakrishna.


భలే
బేరం!
ఒక అందమైన
స్టీలు గ్లాసు
కేవలం
రూ.2-25లకు
Super Power
Regal
DETERGENT CAKE
SAVE! A Stainless Steel Tumbler for only Rs 2.25
with 3 such cakes
A Shaw Wallace Product
ఈ
విధమైన
3
సబ్బులతో
సూపర్ పవర్
రీగల్
మురికిని నిర్మూలిస్తుంది
బట్టలను కాపాడుతుంది
Shaw Wallace
షా వాలెస్ వారి విశిష్ట ఉత్పాదన
సూపర్ పవర్ రీగల్ బహుమతి లేకుండాను లభించును
ACIL/0743/84 Tel


శ్రేష్ఠమైన భావాలకు
శ్రుతికలిపే సిల్కులు
ఆప్కో వస్త్రాల అందాలు
గత వైభవ స్మృతులను
ప్రతిబింబింప జేస్తాయి.
ఆప్కో వస్త్రాల విస్తృత శ్రేణి -
షర్టింగులు, డ్రెస్ మెటీరియల్స్,
చీరలు, తయారీదుస్తులు మరియు
గృహోపకరణ వస్త్రాలు.
ఆప్కో
చేనేతలు
APSHWCSL
దీ ఆంధ్రప్రదేశ్
స్టేట్ హేండ్లూం వీవర్సు
కోపరేటివ్ సొసైటీ లిమిటెడ్
హైదరాబాద్-500 029